www.truepointnews.com
ESTD 2024

PointNewsDaily
pointnewsdaily

ARN No: T/TG/2024/1040
Vol.I ISSUE 273
*Air Surcharge Extra Applicable

# పాయింట్

Published From : Vijaywada - Hyderabad - Delhi - Bengaluru

బుధవారం 25, జూన్, 2025 | పేజీలు :12

## బనకచర్లపై మన వాయిస్ గట్టిగా వినిపించండి : చంద్రబాబు

బనకచర్ల ప్రాజెక్ట్‌పై మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు. ఈ ప్రాజెక్టు ద్వారా వరద జలాలే వాడుకుంటున్నట్లు చెప్పారు. ఈ ప్రాజెక్టు వల్ల తెలంగాణకు ఎలాంటి నష్టమూ లేదని అన్నారు. బనకచర్ల ప్రాజెక్టుపై తెలంగాణలో రాజకీయ పార్టీలు సృష్టిస్తున్న అపోహలను తిప్పికొట్టాలన్నారు సీఎం.



02



03

### జగన్‌పై మరో కేసు.. వైసీపీ నేతలకు నోటీసులు

మాజీ సీఎం, వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై మరో కేసు నమోదు అయ్యింది. జగన్ మిర్చి యార్డ్ పర్యటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. అలాగే ఈ వ్యవహారానికి సంబంధించి వైసీపీ కీలక నేతలకు నల్లపాడు పోలీసులు నోటీసులు ఇస్తున్నారు.



03

### 27న షర్మిల రాజమండ్రి పర్యటన..!

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకు వచ్చేందుకు కృషి చేస్తున్న పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఈనెల 27 వ తేదీన రాజమండ్రి పర్యటనను విచ్చేస్తున్నారని, ఆమె పర్యటన విజయవంతం చేయాలని తూర్పుగోదావరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు టి.కె.విశ్వేశ్వర రెడ్డి పిలుపునిచ్చారు

## అమరావతిలో రెండోసారి భూసమీకరణకు

# కేబినెట్ ఆమోదం!

**రాజధానిలో నిర్మాణాలకు టెండర్లు ఫైనల్**
**రెవెన్యూ సమస్యల పరిష్కారం..**
**ప్రతి మండలంలో అన్నా క్యాంటీన్**
**కేబినెట్ భేటీలో పలు కీలక నిర్ణయాలు**

**టీపీఎన్, అమరావతి :**

ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన అమరావతి సచివాలయంలో కేబినెట్ భేటీ జరిగింది. ఈ భేటీలో పలు కీలక అంశాలపై సీఎం చంద్రబాబు మంత్రి మండలితో చర్చించారు. మంత్రివర్గ సమావేశంలో దాదాపు 42 అంశాలతో అజెండాను రూపొందించారు. వాటికి మంత్రివర్గం ఆమోదం తెలపింది. మున్సిపల్ శాఖ ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదం లభించింది. రాజధాని అమరావతిలో మౌలిక వసతుల కోసం రెండో విడత భూసేకరణ చేయాలని కేబినెట్ నిర్ణయించింది. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఒకేరకమైన రూల్స్‌తో ల్యాండ్ పూలింగ్ చేయాలని కేబినెట్‌లో నిర్ణయించినట్లు చెప్పారు మంత్రి కొలుసు పార్థసారథి. ప్రజలకు ఇబ్బంది లేకుండా నిబంధనలు సవరించామన్నారు. సీఆర్డీఏ పరిధిలో కొత్తగా తీసుకునే భూముల్లో ప్రభుత్వానికి సంబంధించి... 2019కు ముందు ఆరేళ్ల అనుభవ దారు ఎవరు ఉంటారో వారికే నష్టపరిహారం ఇవ్వాలని సీఎం చంద్రబాబు సూచించినట్లు తెలిపారు. ఎన్‌జీటీ, సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం జలవనరులను రక్షిస్తామన్నారు. అసైన్డ్, దేవాదాయ, లంక భూములపై జేసీతో దర్యాప్తు చేయించి.. సర్వే సమయంలో సరిహద్దుల దగ్గర సమస్యలు రాకుండా చూస్తామని స్పష్టం చేశారు. స్థానిక రైతులకు ఉచిత విద్య, వైద్య చికిత్స అందిస్తామని తెలిపారు.

**రాజధానిలో నిర్మాణాలకు టెండర్లు ఫైనల్**

గతంలో పునాదులు పూర్తయిన భవనాలు తొలుత పూర్తి చేసి.. టెండర్లు దక్కించుకున్న జీఏడీ, హెచ్‌వోడీ టవర్లను ఎన్‌సీసీ, ఎల్ అండ్ టీ, షాపూర్ పల్లోంజీ సంస్థకు అప్పగిస్తామన్నారు మంత్రి పార్థసారథి. సీఆర్డీఏ సమావేశ నిర్ణయాలకు కేబినెట్ ఆమోదం తెలిపిందని మంత్రి పార్థసారథి తెలిపారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా వాళ్లు రాజధానిలో లా యూనివర్సిటీ ఏర్పాటు చేయడానికి సంబంధిత భూమి వాళ్లకు లీజ్‌కు ఇవ్వాలని మంత్రి మండలి నిర్ణయం తీసుకుంది. బిల్డింగ్ రూల్స్‌ను మరింత సరళతరం చేయాలని కేబినెట్ నిర్ణయించింది. గుజరాత్‌లో మాదిరిగా బిల్డింగ్ రూల్స్‌ను సరళతరం చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. రాజధాని అమరావతిలో కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటుకి వెంటనే ప్లాన్ చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. అలాగే రాష్ట్రంలో పలు సంస్థలకు భూ కేటాయింపులకు ఆమోదం తెలిపింది మంత్రివర్గం. పురపాలకశాఖలో 40 బిల్డింగ్ ఇన్‌స్ట్రక్టర్ల పోస్టుల అప్‌గ్రేడ్‌కు ఆమోదం లభించింది. రాజధాని అమరావతిలో ఈ3 రోడ్డును ఎన్ హెచ్ 16కు అనుసంధానించేందుకు రూ.682 కోట్ల టెండర్లు ఆమోదానికి పరిపాలన అనుమతి ఇచ్చింది. భవన నిర్మాణ చట్టంలో నిబంధనల సవరిస్తూ, సులువుగా అనుమతులు వచ్చేలా కొన్ని సవరణలకు ఆమోదం తెలిపింది.

**రెవెన్యూ సమస్యల పరిష్కారం..**

రెవెన్యూ సమస్యలను ఏడాదిలోపు పరిష్కరించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఎక్కువగా రెవెన్యూ సంబంధిత సమస్యలు వస్తున్నాయని చెప్పుకొచ్చారు. జిల్లా స్థాయిలో ఏడాది పాలనపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి సమావేశం పెట్టాలని కోరారు. నియోజకవర్గ స్థాయిలో ఎమ్మెల్యేలు ఏడాది పాలనపై సమావేశాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశాల్లో ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివరించాలని చెప్పారు. ఈ నెలాఖరులోపు ఈ సమావేశాలు నిర్వహించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. జులై 1వ తేదీ నుంచి ఏడాది పాలనపై ఎమ్మెల్యేలు ఇంటింటికీ తిరిగి వివరించాలని నిర్దేశించారు సీఎం చంద్రబాబు. కూటమిలోని అన్ని పార్టీల నేతలను కలుపుకొని ముందుకు వెళ్లాలని కోరారు.

**ప్రతి మండలంలో అన్నా క్యాంటీన్**

అన్నా క్యాంటీన్ల నిర్వాహణపై సీఎం చంద్రబాబు రాష్ట్ర ప్రజలకు భారీ శుభవార్త అందించారు. ఇప్పటి వరకు నగరాలు పట్టణాలు, జిల్లా కేంద్రాలకే పరిమితం అయిన అన్న క్యాంటీన్లను త్వరలోనే అన్ని మండల కేంద్రాల్లో ఏర్పాటు చేయాలని మంత్రి వర్గ సమావేశంలో తెలిపారు సీఎం. అన్నా క్యాంటీన్ల ఏర్పాటు, దాతల నుంచి విరాళాలు, వాటి నిర్వహణకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు సూచించారు. మరో 9 అన్న క్యాంటీన్ల ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో 4687 మినీ అంగన్వాడీ కేంద్రాలను ప్రధాన అంగన్వాడీ కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేసేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఏపీ మార్క్ ఫెడ్ ద్వారా పొగాకు కొనుగోలు కోసం రూ.273.17 కోట్లు మంజూరుకు పరిపాలన పరమైన అనుమతులు ఇచ్చింది. రాష్ట్రంలో 20 మిలియన్ టన్నుల పొగాకును రాష్ట్ర ప్రభుత్వం సేకరించాలని నిర్ణయించింది. వచ్చే ఏడాది పొగాకు సాగుకు క్రాప్ హాలిడే ఇవ్వాలని మంత్రిమండలి నిర్ణయించినట్లు మంత్రి పార్థసారథి తెలిపారు. ధరల స్థిరీకరణ నిధి ద్వారా పొగాకు, మామిడి, కోకో పంటల రైతులను ఆదుకుంటున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. డిమాండ్‌కు తగ్గట్లుగా వాణిజ్య పంటలు వేసేలా రైతులను చైతన్య పరచాలని అన్నారు.



### కేబినెట్ పలు కీలక నిర్ణయాలు

విశాఖ మధురవాడలో 22.19ఎకరాల్లో కాగ్నిజెంట్ టెక్నాలజీ సంస్థను ఏర్పాటు చేస్తూ రూ.1582 కోట్ల పెట్టుబడులను అమోదించింది ఏపీ కేబినెట్. అనకాపల్లిలో ఆర్సెల్ మిట్టల్ స్టీల్‌కు సెప్టెంబర్‌లో శంకుస్థాపన చేసే విధంగా చూడాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. తిరుపతి జిల్లా వడమాలపేటలోను 12.07 ఎకరాలను పర్యాటకశాఖకు బదిలీ చేస్తూ అనుమతి ఇచ్చింది. పర్యాటక ప్రాంతం గండికోట దగ్గర రిసార్టు ఏర్పాటు కోసం 50 ఎకరాలు కేటాయిస్తూ నిర్ణయం తీసుకుంది. శ్రీశైలం డ్యామ్, సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ సేఫ్టీ పనుల కోసం 350 కోట్ల నిధుల విడుదలకు ఆమోదం లభించింది. విజయవాడలో అంబేద్కర్ విగ్రహ ప్రాంగణాన్ని సోషల్ వెల్ఫేర్ డిపార్ట్ మెంట్ నుంచి ఏపీ కల్చరల్ విభాగానికి బదిలీ చేయాలని .. పెండింగ్ పనులను ఏపీ కల్చరల్ విభాగం ద్వారా నిధులిచ్చి పూర్తి చేయాలని నిర్ణయం తీసుకుంది మంత్రిమండలి. టెన్నిస్ క్రీడాకారుడు సాకేత్ సాయికి స్పోర్ట్స్ కోటా కింద డిప్యూటీ కలెక్టర్ ఉద్యోగం ఇవ్వాలని నిర్ణయించింది.

## కళ్యాణదుర్గంలో కోట్ల రూపాయల కుంభకోణం

- **రూ.4 కోట్ల నుంచి రూ.5 కోట్ల వరకూ స్కాం జరిగినట్లు అనుమానం**
- **కళ్యాణదుర్గం ఎమ్మెల్యేపై వైసీపీ విమర్శలు**
- **కుంభకోణం వెనుక ఎమ్మెల్యే హస్తం ఉందన్న మాజీ ఎంపీ రంగయ్య**

**టీపీఎన్, అనంతపురం :**

అనంతపురం జిల్లాలో భారీ కుంభకోణం సంచలనం సృష్టిస్తోంది. కళ్యాణదుర్గం వేదికగా మీసేవ నిర్వాహకుడు భారీ ఈ స్టాంపు కుంభకోణానికి పాల్పడ్డారు. పలు కంపెనీలకు నకిలీ స్టాంపులు విక్రయించి లక్షా, రెండు లక్షలు కాదు.. ఏకంగా కోట్లలో కొల్లగొట్టినట్లు తెలుస్తోంది. కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబుకు చెందిన ఎస్ఆర్‌సీ ఇన్‌ఫ్రా డెవలప్పర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో నిర్వహించిన ఇంటర్నల్ ఆడిట్లో ఈ స్టాంపు భాగోతం బయటపడింది. బ్యాంకులకు ఇచ్చిన గ్యారెంటీల్లో ఈ స్టాంపు పత్రాలన్నీ నకిలీవని ఎస్ఆర్‌సీ ఇన్‌ఫ్రా డెవలప్పర్స్ ఆడిట్లో తేలింది. దాంతో కోట్ల రూపాలయ భాగోతం బయటపడింది. ఈ ఘటనపై ప్రముఖ నిర్మాణ సంస్థ ఎస్ఆర్‌సీ ఇన్‌ఫ్రా ప్రతినిధులు అనంతపురం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో వారు నిందితులను అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నారు. ఈస్టాంప్ స్కాంకు పాల్పడింది కళ్యాణదుర్గం మండలం బోరంపల్లికి చెందిన బోయ ఎర్రప్ప అలియాస్ మీ సేవ బాబుగా గుర్తించారు. తన భార్య కట్ట భార్గవి పేరిట తహసీల్దారు కార్యాలయం వద్ద మీ సేవ కేంద్రం నిర్వహిస్తున్నారు ఎర్రప్ప. ఇక్కడే ఈస్టాంపులను విక్రయిస్తుంటారు. నకిలీ స్టాంప్‌లు సృష్టించి, అమ్మడం మొదలు పెట్టారు. రూ.100 విలువ గల స్టాంపులను సైతం రూ.లక్ష విలువైనవిగా చూపించి సొమ్ము చేసుకున్నారు. ఇదే క్రమంలో ఎస్ఆర్‌సీ ఇన్‌ఫ్రా డెవలప్పర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి నకిలీ స్టాంపులను భారీగా విక్రయించారు. తాజాగా ఆ సంస్థ అంతర్గత ఆడిట్‌లో ఎర్రప్ప అలియాస్ మీసేవ బాబు ఇచ్చిన నకిలీ స్టాంపులు నకిలీవని తేలింది. దీంతో ఈ కుంభకోణం వెలుగులోకి వచ్చింది. దీంతో అప్రమత్తమైన ఎస్ఆర్‌సీ ఇన్‌ఫ్రా డెవలపర్స్ యాజమాన్యం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. నిందితులు ఎర్రప్ప, ఆయన భార్య భార్గవి, మరో వ్యక్తిని ఆదివారం అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారిస్తున్నారు. నిందితుడు బోయ ఎర్రప్ప అలియాస్ మీసేవ బాబు ఎవరెవరికి ఈ స్టాంపులు అమ్మాడో అవన్నీ కూడా నకిలీ ఈ స్టాంపు పత్రాలుగా గుర్తించారు పోలీసులు. 2020 నుంచి మీసేవ ముసుగులో... స్టాంప్ వెండర్ లైసెన్స్ తీసుకుని ఈ స్టాంప్ పత్రాలు ట్యాంపరింగ్ కు పాల్పడినట్లు గుర్తించారు పోలీసులు. మొత్తంగా రూ.4 కోట్ల నుంచి రూ.5 కోట్ల వరకూ స్కాం చేసినట్లు అనుమానిస్తున్నారు. ఈ



స్టాంప్ ట్యాంపరింగ్ మోసం సంచలనం సృష్టించడంతో నిందితులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్ఆర్‌సీ ఇన్‌ఫ్రా ప్రతినిధి గుంటూరు సతీష్‌బాబు పత్రికా ప్రకటన విడుదల చేశారు.

ఈస్టాంప్ కుంభకోణంపై సీరియస్‌గా స్పందించారు కళ్యాణదుర్గం వైసీపీ ఇన్‌చార్జ్, మాజీ ఎంపీ తలారి రంగయ్య. తెల్గీ కుంభకోణం కంటే కళ్యాణదుర్గం టీడీపీ ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు పెద్ద స్కాం చేశారని తలారి రంగయ్య విమర్శించారు. ఎమ్మెల్యే అమిలినేని వందల కోట్ల కుంభకోణానికి పాల్పడ్డారని మండిపడ్డారు. ఎమ్మెల్యే ఫోర్జరీ డాక్యుమెంట్లు సృష్టించి స్టాంప్ డ్యూటీ ఎగొట్టారని విమర్శించారు. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుకు చెందిన ఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ బ్యాంకు రుణాలు తీసుకుని ఈ స్టాంప్ డ్యూటీ చెల్లింపుల్లో భారీ కుంభకోణానికి పాల్పడిందని ఆరోపించారు. ఈ స్కామ్ కీలక సూత్రధారి టీడీపీ ఎమ్మెల్యే సురేంద్ర అనుచరుడే అన్నారు. టీడీపీ ప్రజా ప్రతినిధి అండదండలు లేకుండా ఓ సాధారణ మీ సేవా కేంద్రం నిర్వాహకుడు ఇంత రిస్క్ ఎందుకు తీసుకుంటాడు? అని ప్రశ్నించారు. ఈ స్టాంప్‌ల కోసమే మీ సేవ సెంటర్ నిర్వాహకుడు బాబుతో టీడీపీ ఎమ్మెల్యే సన్నిహిత సంబంధాలు నెలకొల్పాడని ఆరోపించారు. మీ సేవ బాబు కూడా టీడీపీ కుటుంబ కార్యకర్తే అన్నారు. టీడీపీ కార్యక్రమాల్లో పాల్గొనడంతో పాటు ఎమ్మెల్యే సురేంద్ర ఇంట్లో మనిషిలా మీసేవ బాబు వ్యవహరిస్తుంటాడని ఆరోపించారు. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబుకు చెందిన ఎస్ఆర్ కన్ స్ట్రక్షన్ సంస్థ రూ.920 కోట్ల రుణాలకు 4.5 కోట్ల స్టాంప్ డ్యూటీ చెల్లించాలని, అయితే కేవలం లక్షన్నర మాత్రమే చెల్లించారని ఆరోపించారు తలారి రంగయ్య. ప్రభుత్వానికి చేరాల్సిన కోట్ల రూపాయలు తన జేబులో వేసుకున్నారని, విషయం బయటపడేసరికి టీడీపీ నేత ఎర్రప్ప అలియాస్ మీసేవ బాబు పై పోలీసులకు ఫిర్యాదు చేశారని తప్పుపట్టారు. మొత్తం వ్యవహారంపై సమగ్ర విచారణ చేయాలని.. ఎన్ని కోట్ల రూపాయల స్టాంప్ డ్యూటీ ఎగ్గొట్టారో తేల్చాలని మాజీ ఎంపీ తలారి రంగయ్య డిమాండ్ చేశారు.

### ఈ రాజకీయ జాతరలో పొట్టేలు నువ్వేరా తమ్ముడూ..!

ఒకడు పవన్ అంటే పిచ్చి అంటాడు.. మరొకడు జగన్ అన్నంటే ప్రాణమంటాడు.. ఇంకొకడు చంద్రబాబుకు అంకితం అంటాడు. ఏమొస్తుంది వీళ్లకు.. ఏం ఒరుగుతుంది వీళ్ల జీవితాలకు. ఏమీ ఉండదు. ఇప్పుడో మరో కుర్రాడు ఆ ఎమోషనల్ రాజకీయంలో పడి బలిపశువుగా మారాడు. నాయకుడిపై అతనికి ఉన్న ఎమోషనల్ లవ్ హద్దులు చెరిపేసింది. వయసు ఇచ్చిన ఉత్సాహం విచక్షణను వెనక్కు పంపేసింది. ఏం చేస్తున్నాడో.. ఎందుకు చేస్తున్నాడో కూడా తెలియని మైకంలో అతడు చేసిన తప్పు.. నేడు కటకటాల వెనక్కు పంపింది. ఏదో సరదాగా అనుకున్నాడు.. కాని దాని వెనక ఉన్న రాజకీయ వ్యూహం అతనికి తెలియలేదు. చేయించినవాళ్లు.. విమర్శించే వాళ్లు ఎవరి వ్యూహం వారు చేస్తున్నారు.. కాని బలవుతున్నది ఇలాంటి యువతే. ఈ రాజకీయ జాతరలో బలవుతున్న పొట్టేళ్లు ఇలాంటివాళ్లే. ఇప్పటికైనా ఈ కుర్రాళ్లు మేలుకుంటారా?

ఏపీలో సినిమాలన్నా, రాజకీయాలన్నా కూడా యువత ఎక్కువ ఆసక్తి చూపిస్తుంటారు. అందుకే సినిమా హీరోలతోపాటు, రాజకీయ నేతలకు కూడా అదే రేంజ్‌లో ఇక్కడ క్రేజ్ ఉంటుంది. ఒక్కోసారి వీళ్ల అభిమానం హద్దు మీరుతోంది. ఇక అసలు విషయానికొస్తే.. జగన్ పల్నాడు పర్యటన రాష్ట్రంలో ఒక్కాసారిగా హీట్ పెంచింది. ఆయన పర్యటన విషయాన్ని కాస్త పక్కనబెడితే.. ఆ పర్యటనలో ఆయన అభిమానులు ప్రదర్శించిన ప్లకార్డులు ఇప్పుడు వివాదాస్పదంగా మారాయి. ఇక ఆ




పోస్టర్లలో ఉన్న సినిమా డైలాగులు చాలా అభ్యంతరకరంగా ఉన్నాయని టీడీపీ నేతలు ఫిర్యాదు చేయడంతో.. సదరు పోస్టర్లను ప్రదర్శించిన వారిని పోలీసులు గుర్తించి కేసులు నమోదు చేస్తున్నారు.

సత్తెనపల్లి నియోజకవర్గంలోని రెంటపాళ్లలో గత ఏడాది మరణించిన వైసీపీ గ్రామస్థాయి నేత నాగ మల్లేశ్వరరావు కుటుంబాన్ని జగన్ బుధవారం పరామర్శించారు. అయితే, ఈ పర్యటనకు కేవలం 100 మందిని మాత్రమే అనుమతిస్తామని, సత్తెనపల్లి నుంచి రెంటపాళ్ల వరకు 20 చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తామని, సెక్షన్ 30 విధిస్తామని పోలీసులు ప్రకటించారు.అయినప్పటికీ, వైసీపీ ఈ పర్యటనను విజయవంతం చేసేందుకు భారీగా జనసమీకరణ చేపట్టింది. పోలీసు చెక్‌పోస్టులను తొలగించడమే కాక, "2029లో జగన్ 2.0 మొదలైతే 'రప్పా.. రప్పా.. నరుకుతాం'"అనే వివాదాస్పద ఫ్లెక్సీలను ప్రదర్శించింది. దీనిపై ప్రభుత్వం తాజాగా కేసులు నమోదు చేస్తూ వందల మంది వైసీపీ కార్యకర్తలను అరెస్టు చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. జగన్ పర్యటనలో పాల్గొన్న పలువురు వైసీపీ కార్యకర్తలపై పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారు. వివాదాస్పద ఫ్లెక్సీ ప్రదర్శించిన రవితేజ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. తుళ్లూరు గ్రామానికి చెందిన రవితేజపై టీడీపీ నేతలు ఫిర్యాదు చేశారు. అయితే, రవితేజకు తమ పార్టీతో ఎలాంటి సంబంధం లేదని వైసీపీ వాదిస్తోంది. దీంతో వైసీపీ ఆరోపణలు ఈ స్టోరీని మరో మలుపు తిప్పాయి. "రప్పా.. రప్పా.." ఫ్లెక్సీ ప్రదర్శించిన రవితేజ టీడీపీ కార్యకర్త అని, అతనికి టీడీపీలో సభ్యత్వం ఉందని వైసీపీ కొన్ని ఫోటోలను విడుదల చేస్తూ ఆరోపించింది. ఎమ్మెల్యే టీ చంద్రశేఖర్ కూడా రవితేజ టీడీపీ సభ్యుడని బల్లగుద్ది మరీ చెబుతున్నారు. రవితేజను తమ పార్టీ కార్యక్రమానికి ఎవరు పంపారనేది పోలీసులు తేల్చాలని వైసీపీ నేతలు డిమాండ్ చేస్తున్నారు. ఈ వివాదం రవితేజ ఏ పార్టీకి చెందినవాడన్న సస్పెన్స్‌ను రేకెత్తిస్తోంది. మరోవైపు రాజకీయ నేతల ట్రాప్‌లో పడి యువత తమ విలువైన సమయాన్ని వృథా చేసుకోవడంతోపాటు.. బలి పశువులుగా మారుతున్నారనే వాదన కూడా వినిపిస్తోంది. గతంలో కోడి కత్తి కేసులో ఇరుక్కున్న శ్రీను అనే యువకుడి జీవితం ఏమైందో కళ్లారా చూశాం. ఇప్పుడు రవితేజ కూడా వెర్రి అభిమానంతో జైల్లో ఊచలు లెక్కపెడుతున్నాడు. ఇలాంటి యువకులు మరెంతమందో ఈ రాజకీయ చదరంగంలో పావులుగా మారుతున్నారు. ఇప్పటికైనా ఏపీ యువత కళ్లు తెరిచి తమ హీరోలు, అభిమాన నేతలపై ఉన్న అసక్తిని, ప్రేమని కుటుంబంపై చూపిస్తే బాగుంటుందనే సూచనలు వినిపిస్తున్నాయి.



## సింగయ్య మృతి కేసులో జగన్‌పై తీవ్ర నేరారోపణలు!

- **BNS సెక్షన్ 105, 49 కింద కేసు నమోదు**
- **ఆరోపణలు నిజమైతే జీవితఖైదు**
- **బెయిల్ రావడం కూడా కష్టమే..!**

**టీపీఎన్, అమరావతి :**

ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డిపై, పార్టీ కార్యకర్త చీలి సింగయ్య దుర్మరణానికి సంబంధించి **ఆరోపణ నెం. 2 (A2)**గా కేసు నమోదు కావడం రాష్ట్రంలో భారీ చర్చలకు దారితీసింది. భారతీయ న్యాయ సంహిత (BNS) సెక్షన్ 105 మరియు సెక్షన్ 49 కింద జగన్‌పై కేసులు నమోదయ్యాయి. ఈ ఆరోపణలు నిజమైతే ఆయన జీవిత ఖైదు వరకు శిక్షను ఎదుర్కొనవలసి రావచ్చు. జూన్ 18న పల్నాడు జిల్లా రెంటపల్లిలో జరిగిన జగన్ ర్యాలీలో, 53 ఏళ్ల కార్యకర్త చీలి సింగయ్య, జగన్ కాన్వాయ్‌లోని టాటా సఫారీ వాహనం కింద పడి ప్రాణాలు కోల్పోయాడు. ప్రత్యక్షంగా ఫుటేజ్‌లు, వీడియోల్లో బాధితుడు వాహనాలను ఆపమంటూ వేడుకున్నప్పటికీ, ఏ వాహనం ఆగలేదు. సింగయ్యను ఆసుపత్రికి తరలించినా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు.BNS సెక్షన్ 105 ప్రకారం, ఉద్దేశపూర్వక హత్య కాకపోయినా, నిర్లక్ష్యం వల్ల మరణం జరిగితే, బెయిల్ లేని నేరంగా పరిగణించి, జీవిత ఖైదు లేదా 5-10 ఏళ్ల జైలు శిక్ష విధించవచ్చు.సెక్షన్ 49 ప్రకారం, ప్రమాదకర పరిస్థితులు సృష్టించడం వల్ల మరణం సంభవిస్తే, అదే శిక్ష వర్తిస్తుంది. దర్యాప్తులో, జగన్ కాన్వాయ్‌కి అధికారికంగా 11 వాహనాలకు మాత్రమే అనుమతి ఉన్నప్పటికీ, అధిక సంఖ్యలో - 50కి పైగా వాహనాలు ఉండటం గుర్తించబడింది. ఇది ట్రాఫిక్, భద్రతా నిబంధనల ఉల్లంఘనగా నమోదైంది. మొదట కేసు సెక్షన్ 106(1) (నిర్లక్ష్యంతో మరణం కలిగించడం) కింద నమోదైంది. కానీ సీసీటీవీ, డ్రోన్ ఫుటేజ్ మరియు ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాల ఆధారంగా నిజాలు బయటకు రావడంతో, కేసు మరింత తీవ్రమైంది. వాహనాన్ని నడిపిన రమణారెడ్డి (A1) అనధికార పోలీసు కానిస్టేబుల్ కావడం కూడా పోలీస్ వ్యవస్థలో అనేక ప్రశ్నలకు దారితీసింది.మాజీ ఎంపీ వైవీ సుబ్బా రెడ్డి, మాజీ మంత్రులు పేర్ని నాని, విడదల రజిని, జగన్ కార్యదర్శి కె. నాగేశ్వర రెడ్డిపై కూడా ఆరోపణలు ఉన్నాయి. వీరంతా "ప్రయాణికులుగా డ్రైవర్ తప్పిదానికి బాధ్యత వహించలేరు" అంటూ ఆంధ్రప్రదేశ్ హైకోర్టును ఆశ్రయించారు. అయినప్పటికీ, కోర్టు దృష్టి జగన్ బాధ్యతపై ఎక్కువగా కేంద్రీకృతం అయ్యే అవకాశముంది. జగన్, ఈ ఘటనపై విచారం వ్యక్తం చేస్తూ, బాధిత కుటుంబానికి రూ.10 లక్షల ఆర్థిక సహాయం ప్రకటించారు. అయితే ఆయన ఈ ఆరోపణలను **"రాజకీయ ప్రయోజనాల కోసం చేస్తున్న దుష్ప్రచారం"**గా కొట్టిపారేశారు. కానీ వైరల్ వీడియోలు, ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలు, ఆయనకు రక్షణగా నిలవకపోవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఈ కేసు న్యాయవ్యవస్థ నిష్పక్షపాతతను పరీక్షించనుంది. సెక్షన్ 105, 49 కింద తీసుకునే తీర్పు ఆంధ్రప్రదేశ్ రాజకీయలపై దీర్ఘకాల ప్రభావం చూపే అవకాశం ఉంది.



# ఏడాదిలో 4 లక్షల ఉద్యోగాలు కూటమి ప్రభుత్వ విజయం!

- **5 ఏళ్లలో 20 లక్షల ఉద్యోగాల లక్ష్యాన్ని అధిగమించి తీరుతాం..!**
- **అధికార యంత్రాంగం యావత్తు మిషన్ మోడ్‌లో పనిచేయాలి..!**
- **అధికారులకు మంత్రుల కమిటీ సమావేశం దిశానిర్దేశం..!**

1టీపీఎన్, అమరావతి:
అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో నిరుద్యోగ యువతకు 4లక్షల ఉద్యోగాలు కల్పించడం కూటమి ప్రభుత్వం సాధించిన అతిపెద్ద విజయమని మంత్రుల కమిటీ సమావేశం పేర్కొంది. రాష్ట్ర సచివాలయంలోని మంత్రి నారా లోకేష్ చాంబర్ లో 20లక్షల ఉద్యోగాల కల్పనపై మంత్రుల కమిటీ సమావేశం మంగళవారం జరిగింది. సమావేశానికి మంత్రులు టిజి భరత్, పొంగూరు నారాయణ, కొండపల్లి శ్రీనివాస్, బిసి జనార్ధన్ రెడ్డి హాజరై అధికారులకు దిశానిర్దేశం చేశారు. గత ఏడాది జూన్ నుంచి ఇప్పటివరకు 9.5లక్షల కోట్ల పెట్టుబడులు, 8.5లక్షల ఉద్యోగాల కల్పనకు వివిధ కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకోగా, అందులో ఇప్పటికే వివిధ రంగాల్లో 3,94,416 ఉద్యోగాలు కల్పించినట్లు చెప్పారు. ఇందులో అత్యధికంగా ఎంఎస్ఎంఇ రంగంలో 1,18,268 యూనిట్ల ద్వారా 2,48,902 ఉద్యోగాలు, స్కిల్ డెవలప్ మెంట్ ద్వారా 73వేల ఉద్యోగాలు, టూరిజం రంగంలో 49,765 ఉద్యోగాలు కల్పించినట్లు అధికారులు తెలిపారు. ఎంఎస్ఎంఇ రంగంలో గత పదేళ్లలో సగటున 50వేల ఉద్యోగాలు మాత్రమే లభించగా, కూటమి ప్రభుత్వం వచ్చాక ఏడాదిలో 5రెట్లు పెరిగాయని అధికారులు తెలిపారు. వివిధ ప్రభుత్వ శాఖలు, ప్రైవేటురంగంలో కల్పిస్తున్న ఉద్యోగాలను గ్రామ సచివాలయాల ద్వారా ట్రాక్ చేసి పోర్టల్ లో అప్ లోడ్ చేయాలని మంత్రులు సూచించారు. అయిదేళ్లలో 20లక్షల ఉద్యోగాలు కల్పించాలన్నది ప్రభుత్వ లక్ష్యమని, సమిష్టికృషితో ఈ లక్ష్యాన్ని అధిగమించి తీరుతామని చెప్పారు. రాజధాని నిర్మాణ పనులు వేగం పుంజుకున్నాయని, అక్కడ అసంఘటిత రంగంలో ఇప్పటికే 10వేలమంది పనిచేస్తున్నారని మంత్రి నారాయణ తెలిపారు. అత్యధిక ఉద్యోగాలు లభించే మ్యానుఫ్యాక్చరింగ్, సర్వీసెస్ సెక్టార్లపై అధికారులు దృష్టిసారించాలని అన్నారు. ఈ సమావేశంలో సీనియర్ ఐఎఎస్ అధికారులు అజయ్ జైన్, ఎన్. యువరాజ్, కాంతిలాల్ దండే, ఎపి ఈడిబి సిఇఓ సాయికాంత్ వర్మ, ఎపిఐఐసి ఎండి అభిషిక్త్ కిషోర్, ట్రాన్స్ కో జెఎండి కీర్తి చేకూరి, ఎన్ఆర్ఇడిసిఎపి ఎండి కమలాకర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# బనకచర్లపై మన వాయిస్ గట్టిగా వినిపించండి : చంద్రబాబు

- **బనకచర్ల విషయంలో తెలంగాణలో పార్టీల అభ్యంతరం**
- **రాజకీయ ప్రయోజనాల కోసం అడ్డుచెబుతున్నాయన్న ఏపీ సీఎం**
- **మన వాయిస్ స్పష్టంగా వినిపించాలని మంత్రులకు బాబు దిశానిర్ధేశం**

**టీపీఎన్, అమరావతి :**



బనకచర్ల ప్రాజెక్ట్‌పై మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు. ఈ ప్రాజెక్టు ద్వారా వరద జలాలే వాడుకుంటున్నట్లు చెప్పారు. ఈ ప్రాజెక్టు వల్ల తెలంగాణకు ఎలాంటి నష్టమూ లేదని అన్నారు. బనకచర్ల ప్రాజెక్టుపై తెలంగాణలో రాజకీయ పార్టీలు సృష్టిస్తున్న అపోహలను తిప్పికొట్టాలన్నారు సీఎం. పోలవరం బనకచర్లపై తెలంగాణలో అందరూ ఏకమై మాట్లాడుతున్నారని.. మనం కూడా మన వాయిస్ వినిపించాలని కేబినెట్ భేటీలో మంత్రులకు సూచించారు. తెలంగాణలో వాళ్లు అనుమతి లేని ప్రాజెక్టులు ఎన్నో కడుతున్నారు.. వాళ్లు వాడుకోగా మిగిలిన నీళ్లే మనం వాడుకుంటున్న విషయాన్ని రెండు రాష్ట్రాల ప్రజలకు అర్థమయ్యేలా క్లియర్‌గా చెప్పాలని మంత్రులకు సూచించారు ముఖ్యమంత్రి. బనకచర్ల ప్రాజెక్టు అంశాన్ని తెలంగాణ వాళ్లు రాజకీయం చేస్తున్నారని తప్పుబట్టారు. రాజకీయం కోసమే తెలంగాణలో కొందరు అభ్యంతరాలు చెబుతున్నారని అన్నారు. దానికి ముందే మనం ప్రజలకు అర్థమయ్యే రీతిలో వివరించాలని మంత్రులకు సీఎం దిశానిర్ధేశం చేశారు. తెలంగాణకు ఉన్న అన్ని అనుమానాలను నివృత్తి చేయాలన్నారు. తెలంగాణలో అనుమతులు లేకుండా ఎన్నో ప్రాజెక్టులు చేపట్టిన అభ్యంతరం చెప్ప లేదు అన్నారు. పోలవరం బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టుపై నేతలు అంతా మాట్లాడాలని .. ప్రజలకు వాస్తవాలు వివరించాల్సిన బాధ్యత మంత్రులు, నాయకులపై ఉందన్నారు. మొన్న అమరావతిలో జరిగిన సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలోను ముఖ్యమంత్రి చంద్రబాబు తెలంగాణ ప్రభుత్వం అభ్యంతరం చెబుతున్న బనకచర్ల ప్రాజెక్టు ప్రస్తావన తెచ్చారు. గోదావరిబనకచర్ల ప్రాజెక్టుతో తెలంగాణకు ఇబ్బంది ఉండదన్నారు. తెలుగు రాష్ట్రాలు బాగుపడాలంటే గోదావరి నీళ్లను రెండు రాష్ట్రాలు వాడుకోవాలన్నారు. 3000 టీఎంసీలు నీళ్లు వృధాగా సముద్రంలోకి పోతున్నాయని చెప్పారు. ఇందులో కేవలం రెండు రాష్ట్రాలు కలిపి కూడా 400 టీఎంసీలు మాత్రమే వాడుకుంటున్నాయని చెప్పారు. ఇందులో కొంత మొత్తం వాడుకున్నా... తెలుగు రాష్ట్రాలకు ఉపయోగకరంగా ఉంటుందని స్పష్టం చేశారు. మరోవైపు.. బనకచర్ల ప్రాజెక్టుపై ఏ విధంగా ముందుకెళ్లాలనే విషయమై సోమవారం నిర్వహించిన తెలంగాణ మంత్రివర్గ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకుంది కేబినెట్. ఎట్టి పరిస్థితుల్లో ప్రాజెక్ట్‌ను అంగీకరించేది లేదని తేల్చి చెప్పారు. అడ్డుకొని తీరాలని నిర్ణయించారు. తెలంగాణ ప్రయోజనాలను దెబ్బతీసే విధంగా ఆంధ్రప్రదేశ్ సర్కార్ వ్యవహరిస్తున్నదని, ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం పలుమార్లు కేంద్రానికి ఫిర్యాదు చేసింది. అయితే బనకచర్ల విషయంలో ఏపీ ప్రభుత్వం కూడా తగ్గేదేలే అంటోంది. ఇలాంటి పరిస్థితుల్లో బనకచర్లపై రెండు ప్రభుత్వాలు ఒక అంగీకారానికి వస్తాయో లేదో అన్న ఉత్కంఠ నెలకొంది.

# సామాన్యుడి ఫిర్యాదుపై మంత్రి లోకేష్ క్విక్ రియాక్షన్

- **పార్వతీపురం జిల్లాలో బడిపిల్లలను నిరసనకు తరలించిన వైసీపీ**
- **తిరిగి వస్తుండగా ప్రమాదం. ఏడుగురికి గాయాలు.. ఇద్దరికి సీరియస్**
- **విచారణకు ఆదేశించిన మంత్రి లోకేష్**
- **ఏ రాజకీయ పార్టీ స్వప్రయోజనాలకు పాఠశాలల జోలికి పోవద్దని విజ్ఞప్తి**

**టీపీఎన్, అమరావతి :**





తన దృష్టికి వచ్చిన ఫిర్యాదులపై సెకన్ కూడా ఆలస్యం చేయకుండా స్పందిస్తున్నారు మంత్రి నారా లోకేష్. ఇక సోషల్ మీడియాల ద్వారా వచ్చే ఫిర్యాదులపై అయితే క్షణాల్లో క్విక్‌గా యాక్షన్ తీసుకుంటున్నారు లోకేష్. మొన్న అనంతపురం జిల్లా రైతుల సమస్యలపై ఎక్స్‌వేదికగా వచ్చిన కంప్లైంట్‌ను నిమిషాల్లో సాల్వ్ చేశారు. దీంతో తాజాగా పార్వతీపురం మన్యం జిల్లా నుంచి ఓ సమాన్య వ్యక్తి ఎక్స్‌లో చేసిన పోస్ట్‌పై సీరియస్‌గా స్పందించారు లోకేష్. పార్వతీపురం మన్యం జిల్లా పార్వతీపురం నియోజకవర్గం బలిజిపేట మండలం పెద్దపెంకి గ్రామంలోని ఎంపీపీ స్కూల్‌కు చెందిన విద్యార్థులను మాజీ ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగిన నిరసన కార్యక్రమానికి తీసుకెళ్లారని శ్యామ్ అనే వ్యక్తి మంగళవారం ఎక్స్ వేదికగా మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకొచ్చారు. పాఠశాల యూనిఫాంలో ఉన్న విద్యార్థులను ఈ రాజకీయ నిరసనకు తీసుకెళ్లేందుకు ఎంఈఓ, హెచ్ఎం అనుమతించడం దిగ్భ్రాంతికరమని శ్యామ్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు. అయితే కలెక్టరేట్ దగ్గర జరిగిన నిరసన కార్యక్రమంలో పాల్గొని అనంతరం తిరిగి వస్తుండగా ప్రమాదం జరిగింది. ఈఘటనలో ఏడుగురు విద్యార్థులు గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారిలో ఇద్దరి పరిస్థితి సీరియస్‌గా ఉందని శ్యామ్ తెలిపారు. ఎంఈఓ, హెచ్ఎంల బాధ్యతారహిత ప్రవర్తన వల్లే ఈ ఘటన జరిగిందని శ్యామ్ ఆరోపించారు. విద్యార్థుల భద్రతను పణంగా పెట్టి, పాఠశాల సమయంలో రాజకీయ నిరసనకు అనుమతించడం చట్ట విరుద్ధమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై తక్షణమే విచారణ జరిపి, బాధ్యులైన ఎంఈఓ, హెచ్ఎంలపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి లోకేష్‌ని కోరారు. విద్యార్థుల భద్రతతో రాజీపడే ఇటువంటి నిర్లక్ష్యాన్ని సహించరాదని, త్వరగా చర్యలు తీసుకోవాలని శ్యామ్ తన ట్వీట్‌లో విజ్ఞప్తి చేశారు.
శ్యామ్ చేసిన ట్వీట్‌పై సీరియస్‌గా స్పందించారు విద్యాశాఖ మంత్రి లోకేష్. ఇది చాలా దారుణం, నేరం కూడా అన్నారు. పాఠశాల విద్యార్థులను రాజకీయ నిరసనకు తరలించడం, ఆపై జరిగిన ప్రమాదంలో విద్యార్థులు గాయపడటం వంటి తీవ్రమైన అంశాలపై ఆయన సీరియస్ అయ్యారు. ఈ ఘటనపై అర్జెంటుగా విచారణ పూర్తి చేసి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. గాయపడిన పిల్లలు, వారి తల్లిదండ్రులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, మెరుగైన చికిత్స అందిస్తామని హామీ ఇచ్చారు. పాఠశాలల్లో ఇటువంటి దురదృష్టకరమైన జోక్యం రాజకీయ పార్టీల నేతలకు, అధికారులకు ఒక హెచ్చరిక కావాలని మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఏ రాజకీయ పార్టీ అయినా దయచేసి మీ స్వప్రయోజనాల కోసం పాఠశాలల జోలికి పోవద్దని రిక్వెస్ట్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకోవద్దన్నారు. బాధ్యులపై కఠినంగా వ్యవహరిస్తామని లోకేష్ తీవ్రంగా హెచ్చరించారు. ఈ ఘటనను ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందని, బాధ్యులెవరైనా కఠిన చర్యలు తప్పవని మంత్రి స్పష్టం చేశారు. విద్యార్థుల భద్రతతో రాజీ పడే ఇటువంటి నిర్లక్ష్యాన్ని సహించ రాదని సూచించారు.

# కాటన్ స్ఫూర్తికి విఘాతం!

- **తరలిన కార్యాలయాలు, మిగిలిన కాటన్ విగ్రహం**
- **ప్రపంచ వారసత్వ సంపద గుర్తించిన కాటన్ బ్యారేజి విస్మరణ**
- **ధశళేశ్వరం నుంచి వెల్లిపోయిన తూర్పు, మధ్య, పశ్చిమ డెల్టాలు..**

**టీపీఎన్, రాజమండ్రి :**





అన్నపూర్ణ గోదావరి డెల్టా భవిష్యత్తులో నిర్వీర్యం అయ్యే ప్రమాదం పొంచి ఉంది. దీనికి నిదర్శనం నీటిపారుదల కార్యాలయాల తరలింపు. ఎంతో చారిత్రక ప్రాధాన్యం ఉన్న ఈ కార్యాలయాల తరలింపుపై రాష్ట వ్యాప్తంగా ఆందోళన నెలకొంది. దశాబ్దాల చరిత్ర గల ఈ కార్యాలయాల తొలగింపు ఆయకట్టు ను ప్రమాదంలోకి నెట్టే పరిస్థితి ఉన్నట్లు రైతాంగం ఆందోళన చెందుతుంది.
తూర్పుగోదావరి జిల్లాలోని ధవళేశ్వరం అంటేనే ఇరిగేషన్ శాఖకు బ్రాండ్ అంబాసిడర్ లాంటిది... ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నీటిపారుదలశాఖ అంటేనే టక్కున గుర్తుకువచ్చేది రాజమండ్రి సమీపంలోని ధవళేశ్వరం సర్ధర్ కాటన్ బ్యారేజి... గోదావరి నదిపై ఆనకట్టను కట్టిన కాటన్ మహనీయుడు బ్యారేజి పరితీరును, భద్రత, సాగునీటి సరఫరాను నిత్యం పర్యవేక్షించేందుకు ఇరిగేశాఖలో ఉన్న ప్రధాన విభాగాలన్నీ ధవళేశ్వరం కాటన్ బ్యారేజి ముఖద్వారం వద్దనే ఉండాలంటే ఉద్దేశ్యంతోనే అన్ని కార్యాలయాలను ధవళేశ్వరం సర్కిల్ కార్యాలయం చుట్టూనే నిర్మించారు. ఇప్పుడు ధశళేశ్వరం బ్యారేజి వద్ద ఇరిగేషన్ పర్కిల్ కార్యాలయం సజీవసాక్షంగా దాని చుట్టూ ఆనాడు కాటన్ నిర్మించిన తూర్పు డెల్టా కార్యాలయం, సెంట్రల్ డెల్టా కార్యాలయం, పశ్యిమ డెల్టా కార్యాలయాలన్నీ ఇతర ప్రాంతాలకు తరలిపోయాయి. రాజకీయ నాయకులు స్వార్థప్రయోజనాలు, స్థానిక పాలకుల ఉదాశీనత, కొంతమంది అధికారుల నిర్లక్ష్యం కారణంగా ధవళేశ్వరంలో ఒక్క కాటన్ విగ్రహం తప్ప మిగిలిన కార్యాలయాలు అన్నీ తరలిపోయాయి. ఇక ధవళేశ్వరంలో మిగిలింది ఒక్క కాటన్ విగ్రహంతో పాటు సర్కిల్ కార్యాలయం మాత్రమే ఉంది. అయితే ఈ సర్కిల్ పరిధిలో నడుస్తున్న హెడ్‌వర్క్ డిపార్ట్ మెంట్ అవినీతి ఊబిలో కూరుకుపోయి జలవనరులశాఖకే చెడ్డపేరు తెచ్చిపెడుతుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల వరదాయిని సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజికి అంతర్జాతీయ గుర్తింపు లభించిన సంగతి విదితమే. ఆస్ట్రేలియాలోని ఆడిలైడ్‌లో ఇంటర్నేషనల్ కమిషన్ ఆన్ ఇరిగేషన్ అండ్ డ్రైనేజ్ (ఐసిఐడీ) సదస్సులో ప్రపంచ వారసత్వ కట్టడంగా ధవళేశ్వరం కాటన్ బ్యారేజిని గుర్తించి అవార్డు ప్రకటించారు. అపర భగీరధుడిగా గుర్తింపుపొందిన కాటన్ మహాశయుడు నిర్మించిన ఈ ఆనకట్ట విశిష్టత సమాహారం. అయితే నేటి ప్రజాప్రతినిధులు మాత్రం దీనిని గుర్తించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా గోదావరి జిల్లాలకు చెందిన మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు గోదావరిపై ఉన్న మమకారంతో ధవళేశ్వరంపై దృష్టిసారించి ధవళేశ్వరం ఇరిగేషన్ సర్కిల్‌కి పూర్వవైభవాన్ని తీసుకువస్తారా లేక విస్మరించి గత ఇరిగేషన్ మంత్రుల జాబితాలో చేరిపోతారా అనేది వేచిచూడాల్సి ఉంది.

**కాటన్ మహనీయుని దూరదృష్టి**

కాటన్ మహనీయుడు ఎంతో దూరదృష్టితో 1852వ సంవత్సరంలో గోదావరి నది దిగువ భాగంలో 15 అడుగల ఎత్తులో 3.5కిలోమీటర్ల పొడవు (ధశళేశ్వరంవిజ్జేశ్వరం మధ్యలో) సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజి (గోదావరి బ్యారేజ్ ) నిర్మించిన సంగతి విధితమే. అయితే 197082 మధ్యలో కాటన్ బ్యారేజిని 10.6 మీటర్ల ఎత్తుకు పునర్మించిన సంగతి కూడా విదితమే. అప్పట్లో 40 అడుగల వద్ద స్టూల నీటి నిల్వ సామర్థ్యం 83 మిలియన్ క్యూబిక్ మీటర్లు అంటే 2.93 టిఎంసి అడుగులు ఉండేది. బ్యారేజి 3,599 పొడవు ఉన్న ఈ కాటన్ బ్యారేజిని నాలుగు ఆర్మల్లో 175 గేట్లను అమర్చారు. అప్పట్లో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లోని 65 మండలాల్లో ఏటా రెండు పంటలకు దాదాపు 100 టీఎంసీల అడుగుల నీటి వినియోగాన్ని సరఫరా చేస్తోంది. గోదావరి ఆనకట్ట వద్ద నిల్ల ఉన్న నీటిని ఉభయ గోదావరి జిల్లాలో ఉన్న రెండు పంటలకు నీటిని సరఫరా చేయాలంటే ఆనకట్ట వద్ద ఉన్న 175 గేట్ల ద్వారానే నీటిని విడుదల చేసేవారు. అనంతరం ఆయా కాలువల నుండి వాటికి అనుసంధానం చేసిన స్లూయిజ్లద్వారా పిల్లకాలువల నుండి పంట చేలలోనే నీటిని సరఫరా చేసేవారు. వీటిలో బ్యారేజి కింద తూర్పు డెల్టా కాలువలకు 2.76లక్షల ఎకరాలు, మధ్య డెల్టా కాలువ కింద 2.04లక్షల ఎకరాలు, పశ్చిమ డెల్టా కాలువ కింద 5.20లక్షల ఎకరాలకు సాగునీటిని అందించేవారు. అలాగే వరదల సమయంలో భారీగా క్యాటన్ బ్యారేజి వద్దకు చేరిన ఇనాఫ్‌లోని గణిస్తూ మిగలు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టడం, అదే సమయంలో 175 గేట్ల పరిస్థితులను గమనించడం వంటి అన్నింటిని ఇరిగేషన్ సర్కిల్ పరిధిలో హెడ్ వర్క్స్ విభాగం చూస్తుంది. వీటిని ఆయా ప్రాంతాలకు నీటిసరఫరాపై ఆజమాయిషీ చేయడానికి, నీటి సరఫరాను పర్యవేక్షించేందుకు అన్ని విభాగాలు ధవళేశ్వరం సర్కిల్ కార్యాలయం సమీపంలో నిర్మించిన తూర్పు వాటిని డెల్టా (ఈస్ట్రన్ డెల్టా), మధ్య డెల్టా (సెంట్రల్ డెల్టా), పశ్చిమ డెల్టా (వెస్ట్రన్ డెల్టా) కార్యాలయాలు. ఇప్పుడు తరలిపోయాయి. ధవళేశ్వరం కోట్ల రూపాయల వ్యయంతో తూర్పు డెల్టా కార్యాలయాన్ని నిర్మించిన కొంతమంది రాజకీయ నాయకులు స్వార్థప్రయోజనాల కారణంగా కోనసీమ ఏర్పాటు రామచంద్రపురం మండలానికి తరలిపోయింది. అలాగే సెంట్రల్ డెల్టా కోనసీమజిల్లాలోని అమలాపురం తరలిపోయింది. ఇక మిగలిన సెంట్రల్ డెల్టా కార్యాలయం గతంలోనే నిడదవోలుకు తరలిపోయింది. ఇన్ని తరలిపోతున్న అప్పటి నాయకులు ఏ ఒక్కరూ కూడా అడ్డుకున్న పాపానపోలేదంటే వారి ఉదాశీనత ఏ స్థాయిలో ఉందో స్పష్టమౌతుంది. ఇప్పటి వరకు ధవళేశ్వరం నుండి కాకినాడ, కోనసీమ ప్రాంతాలకు, శివారు ప్రాంతాలకు సాగునీటిని అందించాలన్నా, వరదల సమయంలో ముంపు ప్రాంతాలకు సంబంధించిన పర్యవేక్షణ చేయాలని, అన్ని శాఖల అధికారులతో సమీక్షలు జరపాలన్నా ఒకప్పుడు అన్ని అనుబంధ ఇరిగేషన్ శాఖలు, అధికారులు ధవళేశ్వరం సర్కిల్ అందుబాటులో ఉన్నాయి. ఉండేవారు. అయితే ఇప్పుడు ఏదైనా జరిగేదే సర్కిల్ కార్యాలయం మాత్రమే ధవళేశ్వరంలో ఉంది. మిగిలిన శాఖలు ఇతర వస్తువులతో సహా ధవళేశ్వరం రావాలంటే సుమారు 60 కి.మీ దూరం నుండి రావాల్సి ఉంటుంది. అయితే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుండి నేటి ఆంధ్రప్రదేశ్ వరకూ నీటిపారుదలశాఖ మంత్రులుగా ఉన్న పొన్నాల లక్ష్మయ్య (ఉమ్మడి ఆంధ్రప్రదేశ్), దేవినేని ఉమ మహేశ్వరరావు, అనిల్‌కుమార్ యాదవ్, అంబటి రాంబాబు వంటివారు నటించిన వారు ధవళేశ్వరం ఇరిగేషన్ సర్కిల్‌పై దృష్టిసారించిన దాఖలాలు లేవు. అయితే గోదావరి జిల్లాలకు చెందిన ప్రస్తుత జలవనరులశాఖామంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు ధవళేశ్వరం ఇరిగేషన్ సర్కిల్‌పై దృష్టిసారించి ధవళేశ్వరానికి పూర్వవైభవాన్ని తీసుకొస్తారని గోదావరి వాసులు ఆశిస్తున్నారు.



# జగన్ సైడ్ బోర్డు మీద నిలబడి ప్రయాణం చేయడమే తప్పు : షర్మిల


**టీపీఎన్, నెల్లూరు :**

మాజీ సిఎంగా ఉన్న జగన్ సైడ్ బోర్డు మీద నిలబడి ప్రయాణం చేయడమే తప్పని ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి అన్నారు. నెల్లూరు జిల్లాలో ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా మాజీ సీఎం జగన్ పర్యటనలో సింగయ్య మృతిపై షర్మిల స్పందించారు. జగన్ షేక్ హ్యాండ్ ఇస్తున్న సమయంలోనే సంఘటన జరిగిందన్నారు. ఫేక్ వీడియో అనడం దురదృష్టకరమన్నారు. జగన్ ప్రతీ విషయంలోనూ ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. అధికారంలో ఉన్నప్పుడు జనంలోకి వచ్చిన పరిస్థితి లేదని... ఇప్పుడేమో జనసమీకరణతో బలప్రదర్శన చేస్తున్నారని ఫైర్ అయ్యారు. 'జగన్‌కు మూడు బండ్లు అంటే, ముప్పై బండ్లతో వెళతారు. జగన్ మోదీ దత్తపుత్రుడనా? కార్ల కింద మనుషులని నలుపుకుంటూ పోతూ, మానవత్వం గురించి మాట్లాడుతారా? జగన్‌కు అసెంబ్లీకి వెళ్లి సమాధానం చెప్పే దమ్ము లేదు. నిబంధనలు, ఆంక్షలు ఉండవు. రుషికొండలని ఎందుకు గుండుగొరిగారు? మద్యపాన నిషేధం చేస్తామని ఎందుకు కుంభకోణానికి పాల్పడ్డారు?' అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. షర్మిల ఇంకా మాట్లాడుతూ... జగన్, వైఎస్ కుమారుడు అయినా మోదీకి దత్తపుత్రుడిగా ప్రతి బిల్లులోనూ బీజేపీకి మద్దతిచ్చారన్నారు. అదానీ, అంబానీలతో పాటు ఎవరికి ఏ మేలు కావాలన్నా చేశారని.. మెడలు వంచుతానని చెప్పి.. తానే మెడలు వంచారంటూ వ్యాఖ్యలు చేశారు. మన రాష్ట్రానికి ఏ మేలూ చేయని పార్టీ బీజేపీ అని విమర్శించారు. పదిహేనేళ్లుగా ఏపీ ప్రజలను బీజేపీ వెన్నుపోటు పొడుస్తుందన్నారు. ఇప్పుడు పోలవరానికి డబ్బులు ఇస్తామంటున్నారని... అయితే పార్లమెంటులో ఒక్క ఎంపీ కూడా పోలవరం ఎత్తు 45 ఉండాలని ప్రశ్నించే వారేలేరన్నారు. న్యూఢిల్లీని మించిన రాజధానిని నిర్మిస్తామన్నారని తెలిపారు.

అన్నదాత సుఖీభవ కింద రైతుకి రూ. 20వేలు ఇస్తామని, ఇప్పటికీ ఇవ్వలేదని విమర్శించారు. 80 లక్షల మంది రైతులు ఉంటే, 45 లక్షలకు కుదించారన్నారు. కర్నాటక, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వాలు మహిళలకు ఉచిత బస్సు బ్రహ్మాండంగా అమలు చేస్తుంటే, ఏపీలో ఇప్పటికీ అమలు కాలేదన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 50 ఏళ్లకే ఫించను ఇస్తామన్నారని అన్నారు. 'మిమ్మల్ని ప్రశ్నిస్తున్న మా నాలుకలు మందమా? ప్రజలని మోసం చేస్తున్న మీ నాలుకలు మందమా? వెంటనే అన్ని పథకాలు, హామీలని నెరవేర్చాలని' వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు.

ఏపీలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం చేయడానికి కృషి చేస్తున్నామన్నారు.

. ఈ సందర్భంగా ఆకుతోట గిరిజనకాలనీ నుంచి ఇందిరా భవన్ వరకు ర్యాలీగా వెళ్లారు. గాంధీబొమ్మ సెంటర్ వద్ద వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తనకు, జగన్‌కు ఉన్న విభేదాలు, రాష్ట్ర సమస్యలతో పోల్చితే చాలా చిన్నవన్నారు. జగన్ సీఎం అయిన వెంటనే తమకు విభేదాలు వచ్చాయన్నారు. బీజేపీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ఒక్కటే పోరాడగలదని స్పష్టం చేశారు.




# 27న షర్మిల రాజమండ్రి పర్యటన!

- **ఇందిరాగాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించనున్న షర్మిల**
- **ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల నాయకులతో సమావేశం**
- **షర్మిల పర్యటన విజయవంతానికి తరలిరావాలని పిలుపు**

**టీపీఎన్, రాజమండ్రి :**

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకు వచ్చేందుకు కృషి చేస్తున్న పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఈనెల 27 వ తేదీన రాజమండ్రి పర్యటనను విచ్చేస్తున్నారని, ఆమె పర్యటన విజయవంతం చేయాలని తూర్పుగోదావరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు టి.కె.విశ్వేశ్వర రెడ్డి పిలుపునిచ్చారు. ఆరోజు మధ్యాహ్నం 2 గంటలకు బస్సులో గోకవరం బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వద్దకు విచ్చేసే వైఎస్ షర్మిలకు కనీవినీ ఎరుగని రీతిలో ఘన స్వాగతం పలికేందుకు జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన తెలిపారు. మున్సిపల్ కాలనీలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన సమావేశమైన కాంగ్రెస్ నాయకులు షర్మిల పర్యటన విజయవంతానికి చేయాల్సిన ఏర్పాట్లపై చర్చించారు. ఆనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖరరెడ్డి ముద్దుబిడ్డ షర్మిలా రాష్ట్రలో కాంగ్రెస్‌కు గత వైభవాన్ని పునరుద్ధరించే సంకల్పంతో చిత్తూరు నుంచి పర్యటన ప్రారంభించారని.. దీనిలో భాగంగా తూర్పుగోదావరిజిల్లా పర్యటనకు రాజమండ్రి నగరానికి వస్తున్నారని.. ఆరోజు జరిగే కార్యక్రమాల వివరాలు వెల్లడించారు. మధ్యాహ్నం 2 గంటలకు షర్మిల, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్చార్జి పాలక్ వర్మతో కలిసి రెండు ప్రత్యేక బస్సుల్లో గోకవరం బస్టాండ్ వద్దకు చేరుకుంటారని.. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తారని,అక్కడి నుంచి కారులో బయలు దేరతారని, కాన్వాయ్ ముందు జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బిల్డర్ బాబీ, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర జనరల్ సెక్రటరీ పట్టాభి శ్రీను ఆధ్వర్యంలో విద్యార్థి, యువజన కాంగ్రెస్ కార్యకర్తలు 200 బైక్‌లతో ర్యాలీ నిర్వహిస్తారని చెప్పారు. జిల్లా ప్రచార కమిటీ చైర్మన్ డాక్టర్ వడయార్ ఆధ్వర్యంలో డీజె, తీన్మార్, బాణాసంచాతో దారిపొడవునా షర్మిలకు స్వాగతం పలుకుతారని ఆయన చెప్పారు. అక్కడి నుంచి సీతంపేట రాజీవ్ గాంధీ పార్కు వద్దకు చేరుకునీ పీసీసీ అధ్యక్షురాలు షర్మిల పార్కులో ఏర్పాటు చేసిన దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారని తెలిపారు.

గతంలో ఈ పార్కులో రాజీవ్ గాంధీ విగ్రహాన్ని షర్మిల తండ్రి వై.ఎస్. రాజశేఖరరెడ్డి ఆవిష్కరించారని ఆయన గుర్తు చేశారు. తర్వాత వైఎస్ షర్మిల గుర్రపుబగ్గీ ఎక్కి అక్కడి నుంచి ఊరేగింపుగా బయలుదేరి పేపరుమిల్లు గేటు ఎదుట ఉన్న శ్రీ కృష్ణసాయి కల్యాణ మండపం చేరుకుని అక్కడ జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల కాంగ్రెస్ కో ఆర్డినేటర్లు, ముఖ్య నాయకులతో సమావేశమై పార్టీ బలోపేతానికి అవసరమైన సలహాలు సూచనలు స్వీకరిస్తారని ఆయన చెప్పారు. ఇన్చార్జి పాలక్ వర్మ కూడా మాట్లాడతారని, అనంతరం షర్మిలకు సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు వివరించారు. అనంతరం గోకవరం బస్టాండ్ వద్దకు చేరుకుని తిరిగి బస్సులో షర్మిలా తిరుగు పయనమవుతారని తెలిపారు. పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలకు ఘన స్వాగతం పలికేందుకు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు, అభిమానులు ప్రజలు ఆరోజు మధ్యాహ్నం సీతంపేట రాజీవ్ గాంధీ పార్కు వద్దకు తరలిరావాలని విశ్వేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు.

జిల్లా కాంగ్రెస్ ఇన్చార్జి కే శివాజీ మాట్లాడుతూ రాష్ట్రంలోని కాంగ్రెస్ కార్యకర్తలు నాయకులు అభిమానుల్లో ఉత్సాహంనింపి పార్టీకి పూర్వ వైభవం తీసుకు వచ్చేందుకు కృషి చేస్తున్న షర్మిల ఈనెల 9 న చిత్తూరు నుంచి రాష్ట్ర పర్యటన ప్రారంభించారని చెప్పారు. జాతీయ పార్టీ అయిన భారతీయ జనతా పార్టీకి రాష్ట్ర అధ్యక్షురాలుగా రాజమండ్రి ఎంపీ అయిన మహిళా నాయకురాలు దగ్గుబాటి పురంధేశ్వరి, అలాగే జాతీయ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలుగా వైఎస్ షర్మిల ఉన్నారని, అయితే రాష్ట్రంలో ఎంతమంది మహిళా నాయకులు ఉన్నా ప్రజాకర్షణలో షర్మిలకు ఎవరూ సాటి రారని ఆయన వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాన్ని నిలువరించగల శక్తి కాంగ్రెస్ పార్టీకి మాత్రమే ఉందని, ప్రతి గ్రామంలోను కాంగ్రెస్‌కు నాయకులు, కార్యకర్తలు అభిమానులు ఉన్నారని.. అందుకే కాంగ్రెస్ బలహీనం కాదని శివాజీ అభిప్రాయం వ్యక్తం చేశారు.

# ఏపీలో పనికిమాలిన పాలన : లక్ష్మీపార్వతి

**టీపీఎన్, అమరావతి :**

ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారమనే మత్తులో మునిగిపోయిందని.. టీడీపీ గుండాలు చెలరేగిపోతున్నారని వైయస్ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందమూరి లక్ష్మీపార్వతి అన్నారు. మంగళవారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ..''చంద్రబాబు ముఖానికి పట్టుమని పది మంది కూడా రారు. అందుకే వైఎస్ జగన్‌కు వస్తున్న ప్రజాదరణ చూడలేక కళ్లలో నిప్పులు పోసుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారమనే మత్తులో మునిగిపోయింది.అందుకే టీడీపీ ంండాలు రెచ్చిపోతున్న చూస్తూ ఉండిపోతోంది. రాష్ట్రంలో జరిగే అత్యాచారాలు, హత్యలపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఎందుకు మాట్లాడరు?. హోం మంత్రి అనిత ఎక్కడ ఉన్నారు?. లోకేష్‌కు పొలిటికల్



నాలెడ్జ్ లేదు. లోకేష్ షాడో సీఎం.. చంద్రబాబు పని లేక మూలన కూర్చున్నారు. సిగ్గుమాలిన తండ్రీకొడుకులతో ఏపీలో పనికిమాలిన పాలన నడుస్తోంది. ఏపీలో రాజకీయ నేతలను, మహిళలను వేధిస్తున్నారు. గుడ్ గవర్నెన్స్ అంటే గిరిజన పిల్లలను నేల మీద పడుకోబెట్టడమా?. సనాతని వేషం వేసుకుని పవన్ కల్యాణ్ తిరుగుతున్నారు. ఆయన గురించి మాట్లాడుకోవడం వేస్ట్. వైఎస్ జగన్ పాలనలో దిశ యాప్‌తో మహిళలకు రక్షణ ఉండేది. మహిళలకు రక్షణతో పాటు ఆర్థికంగా బలోపేతం కూడా అయ్యారు'' అని లక్ష్మీపార్వతి అన్నారు.

**'ఏడాదిలోనే చంద్రబాబు చేసిన అప్ప అక్షరాల రూ.1.62 లక్షల కోట్లు'**

కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయ్యింది. ఈ ఏడాది కాలంలో ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను ఎంత చిత్తశుద్ధితో అమలు చేశారో చెప్పాలని మాజీ మంత్రి పేర్ని నాని కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మంగళవారం తాడేపల్లి వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో పేర్ని నాని మీడియాతో మాట్లాడారు. 'ఓట్ల కోసం కూటమి నేతలు,ఎల్లో మీడియా వైఎస్ జగన్‌పై దుష్ప్రచారం చేశారు. చంద్రబాబు 420 అబద్ధాలు,లోకేష్ 840 అబద్ధాలు చెప్పారు. చంద్రబాబు,పవన్,లోకేష్ సొంత డబ్బా కొట్టుకోవడం.. వైఎస్ జగన్‌ను తిట్టడమే పనిగా పెట్టుకున్నారు.2014 నుంచి 2019 వరకు చంద్రబాబు పరిమితికి మించి అప్పులు చేశారు. వైఎస్ జగన్ పాలనలో ఆర్థిక స్థితిగతులు మెరుగ్గా ఉన్నాయి. ఎన్నికల సమయంలో వైఎస్ జగన్ రూ.14లక్షల కోట్లు అప్పులు చేశారని.. చంద్రబాబు,లోకేష్ తప్పుడు ప్రచారం చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై చంద్రబాబు సిగ్గు లేకుండా అబద్ధాలు చెప్తున్నారు. చంద్రబాబు తొలి ఏడాదిలోనే రూ.1.62 లక్షల కోట్లు అప్పు చేశారు'అని ఆరోపించారు.



# జగన్‌పై మరో కేసు.. వైసీపీ నేతలకు నోటీసులు

**టీపీఎన్, గుంటూరు :**

మాజీ సీఎం, వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై మరో కేసు నమోదు అయ్యింది. జగన్ మిర్చి యార్డ్ పర్యటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. అలాగే ఈ వ్యవహారానికి సంబంధించి వైసీపీ కీలక నేతలకు నల్లపాడు పోలీసులు నోటీసులు ఇస్తున్నారు. గత ఫిబ్రవరి 19న మిర్చి రైతుల పరామర్శ కోసం యార్డ్‌కు వెళ్లారు జగన్. కానీ అనుమతి లేకుండా యార్డ్‌లోకి వచ్చి వైసీపీ నేతలు నానా హంగామా సృష్టించారు. దీంతో జగన్‌తో పాటు పలువురు వైసీపీ నేతలపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఫ్యాన్ పార్టీ నేతలకు 41 ఏ నోటీసులు అందజేస్తున్నారు. మాజీ మేయర్ కావటి మనోహర్ నాయుడు, అప్పిరెడ్డి, మోదుగుల వేణుగోపాల్ రెడ్డి , అంబటి రాంబాబు, మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డితో పాటు, కృష్ణా జిల్లాకు చెందిన కీలక నేతలు పేర్నినాని, కొడాలి నాని, తలశిల రఘురాంతో పాటు జగన్‌పై గతంలోనే నల్లపాడు పోలీస్‌స్టేషన్‌లోనే కేసు నమోదు అయ్యింది. ఇప్పుడు నాలుగు నెలల తర్వాత అందుబాటులో ఉన్న నేతలకు నోటీసులు జారీ చేశారు. పిలిచినప్పుడు నల్లపాడు స్టేషన్‌కు విచారణకు రావాల్సిందిగా నోటీసుల్లో పేర్కొన్నారు. కాగా.. మిర్చి రైతులను పరామర్శించేందుకు గత ఫిబ్రవరి 19న గుంటూరులోని మిర్చియార్డుకు వచ్చారు వైఎస్ జగన్. ఆ సమయంలో గుంటూరు కృష్ణా జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నిక నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలులో ఉందని పెద్ద సంఖ్యలో ర్యాలీలు, పరామర్శకు అనుమతి లేదని పోలీసులు ముందుగానే చెప్పారు. అయినప్పటికీ... జగన్, వైసీపీ నేతలతో కలిసి భారీగా మిర్చియార్డుకు వచ్చి నానా హంగామా సృష్టించారు. మిర్చి బస్తాలను ధ్వంసం చేశారు. అంతేకాకుండా కొన్ని మిర్చి బస్తాలను అపహరించారనే ఆరోపణలు వచ్చాయి. ఈ క్రమంలో నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. ఫిబ్రవరి 19న తొమ్మిది మందిపై కేసు నమోదు చేసిన నల్లపాడు పోలీసులు.. వారికి నోటీసులు పంపిస్తున్నారు. ఎప్పుడు పిలిస్తే అప్పుడు విచారణకు రావాలని, తమకు చెప్పకుండా ఊరు వదిలి, దేశం వదిలి పోవొద్దని నోటీసుల్లో స్పష్టంగా పేర్కొన్నారు. వైసీపీ నేతలకు నోటీసులు ఇస్తున్న పోలీసులు జగన్‌కు నోటీసులు ఇస్తారా లేదా అనే దానిపై ఆసక్తి నెలకొంది. గతంలో నల్లపాడు పోలీస్‌స్టేషన్‌లో రఘురామకృష్ణం రాజుపై కస్టోడియల్ టార్చర్ కేసుకు సంబంధించి జగన్‌పై కేసు నమోదు చేసి ఏడాది దాటింది. ఇంత వరకు ఆయనకు నోటీసులు ఇవ్వలేదు. ఇప్పుడు నాలుగు నెలల క్రితం మిర్చి యార్డులో ఎన్నికల కోడ్ నిబంధనలను ఉల్లంఘించి యార్డులో హంగామా సృష్టించిన కేసులో వైసీపీ నేతలకు నోటీసులు ఇవ్వడం మొదలు పెట్టారు. మరి జగన్‌కు నోటీసులు ఇవ్వడంపై ఉత్కంఠ నెలకొంది.

# అధికారం కోసం..చెల్లిని తల్లిని విస్మరించారు!

- **అరాచకాలకు వైసీపీ నేతలు సిద్ధంగా ఉన్నారు..!**
- **రాష్ట్ర ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..!**
- **జగన్‌పై ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి విమర్శలు**

**టీపీఎన్, కడప:**



వైసీపీ అధికారాన్ని చేపట్టేందుకోసం జగన్ ఎలాంటి అరాచకాన్ని చేయడానికి అయినా సిద్ధంగా ఉన్నాడని ఎమ్మెల్సీ భూమి రెడ్డి రాంగోపాల్ రెడ్డి ఆరోపించారు. అధికారం కోసం ఎలాంటి ఆరాచ కానికైనా కుట్రలకైనా కుతంత్రాలకైన వైయస్ జగన్మోహన్ రెడ్డి వెనుకాడ బోడని అందుకు నిదర్శనం ఆయన కారు. కింద పడ్డ ఓ కార్యకర్త మరణమేనని అన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ సొంత చెల్లిని కూడా వైయస్ జగన్మోహన్ రెడ్డి విస్మరించారని తన పార్టీ అధికారం లోకి వచ్చేందుకు వైఎస్ షర్మిల ఎంత కష్టపడిందో పాదయాత్రలు చేసి పార్టీని అభివృద్ధి పథంలో నడిపిందని అలాంటి చెల్లిని నమ్మకద్రోహం చేశారని అన్నారు. మరో చెల్లి వివేకా నంద రెడ్డి కుమార్తె వైఎస్ వివేక మర ణం వెనుక ఉన్న రహస్యాన్ని ఛేదించేందుకు ఎలా కష్టపడుతుందో ప్రజలు చూస్తున్నారన్నారు. ఒక కార్యకర్త తన సొంత వాహనం కిందపడి మరణిస్తే వైయస్ జగన్ దాన్ని పట్టించుకోలేదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజల ముందు జగన్ దోషిగా నిలబడిన తర్వాత ప్రజలు అసహ్యించుకుంటున్నారని తెలుసుకొని తన కారు కింద పడి మరణించిన వ్యక్తి కుటుంబాన్ని పరామర్శించేందుకు అంబటి రాంబాబు, విడుదల రజిని పంపించానని జగన్ అనడం చాలా బాధాకరమన్నారు. ఒక పార్టీ అధ్యక్షుడిగా ఒక ప్రజా ప్రతినిధిగా తన కారు కింద పడి మరణించిన కార్యకర్త కుటుంబాన్ని పరామర్శిం చకుండా మానవత్వం లేకుండా జగన్ ఉన్నాడని అన్నారు. ఇలాంటి వ్యక్తులను రాజకీయాల నుంచి పారద్రోరాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యకర్త మరణం తనను కలిగించిందని 10 లక్షల రూపాయలు ఎక్రేషియా ప్రకటించామని వైసీపీ నాయకులు తో పాటు జగన్మోహన్ రెడ్డి అనడం కూడా చాలా బాధాకరమన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రజలు వైయస్ జగన్మోహన్ రెడ్డిని నమ్మకుండా వైసీపీని రాష్ట్రం నుంచి శాశ్వతంగా తరిమికొట్టవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు బొజ్జ మైసూరా రెడ్డి, మోపూరు దేవస్థాన చైర్మన్ రమణారెడ్డి, బాబు తదితరులు పాల్గొన్నారు.

# ఉమ్మడి కడప జిల్లా టీడీపీలో బలిజలు భగభగ!







- అధికారం వచ్చినా ... పదవులు లేవు... ప్రాధాన్యత లేదు...
- ఏ నియోజకవర్గంలో చూసినా అసంతృప్తి సెగలు...
- సీనియర్ నేతలంతా మౌనం...
- సుగవాసి బాలసుబ్రహ్మణ్యం రాజీనామాతో బలిజల్లో మరింత ఆజ్యం...

**టీపీఎన్, కడప :**

కడప జిల్లా టిడిపిలో భవిజలు భగభగమంటున్నారు. పార్టీ అధికారంలోకి వచ్చినా పదవులు లేవు. ప్రాధాన్యత అసలే లేదంటూ బలిజలు మండిపడుతున్నారు. టీడీపీ ఆవిర్భావం నుంచి కాపు కాసిన బలిజలు ఇప్పుడు తీవ్ర అసంతృప్తికి గురవుతున్నారు. గత ప్రభుత్వ హాయంలో ఒకరిద్దరు నేతలు పార్టీ మారిన మళ్లీ తిరిగొచ్చారు. అయినా, ప్రాధాన్యం దక్కకపోవడంపై ఆ సామాజికవర్గం నాయకుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. రాజంపేట అభ్యర్థిగా గత ఎన్నికల్లో టీడీపీ నుంచి పోటీ చేసిన సుగవాసి బాలసుబ్రమణ్యం ఏడాది తిరక్కముందే ఇటీవల పార్టీకి రాజీనామా చేయడం ఇప్పుడు ఆ వర్గాల్లో మరింత దుమారం రేపుతోంది.

**జిల్లాలో బలిజల ప్రభావం ఎక్కువే :**
జిల్లాలో బలిజల ప్రభావం ప్రతి నియోజకవర్గంలోనూ స్పష్టంగా కనబడుతుంది. ప్రతి ఎన్నికల్లో అభ్యర్థులకు గెలుపోటముల విషయంలో కీలకంగానే ఉంటుంది. చాలా వరకు ప్రతి నియోజకవర్గాల్లో బలిజలు ప్రతి ఎన్నికల్లో కూడా తెలుగుదేశం వైపే మొగ్గు చూపుతుంటారు. కానీ ఇదివరకు దివంగత వైయస్ రాజశేఖర్ రెడ్డి, వైఎస్ జగన్మోహన్ రెడ్డి సీఎం అయినా సందర్బంలో మాత్రం బలిజలు కాంగ్రెస్, వైసీపీ వైపు మొగ్గు చూపారు. కానీ పదవులు, ప్రాధాన్యత విషయంలో సాయిప్రతాప్, బత్యాల చెంగల్ రాయుడు, సి రామచంద్రయ్య, సుగవాసి పాలకొండ్రా యుడు వంటి నేతలు కీలకంగానే వివరించేవారు. వీరి ప్రభావం రాను రాను తగ్గుతుండడంతో ఇప్పుడున్న వారు కేవలం ద్వితీయ శ్రేణి నాయకులు గానే బలిజలు మిగులుతూ వస్తున్నారు. దీంతో బలిజలను ఓటు బ్యాంకుగా వాడుకోవడం తప్పితే తమకు సరైన ప్రాధాన్యత ఇవ్వడం లేదంటూ ఇప్పుడు తీవ్రస్థాయిలోనే వీరి స్వరం వినపడుతోంది.

**సుబ్రహ్మణ్యం రాజీనామాతో మరింత ఆజ్యం :**
గత ఎన్నికల్లో జిల్లాలోని బలిజ సామాజిక వర్గం చాలా వరకు కూటమివైపే మొగ్గుచూపింది. కానీ అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్న అన్ని నియోజకవర్గాల్లో బలిజ సమాజిక వర్గం నాయకులకు ప్రాధాన్యత పదవులు లేకుండా పోయాయి. తమ పరిస్థితిపై నోరు విప్పి మాట్లాడితే ఎక్కడ తమకు ఇబ్బందులు వస్తాయోనన్న భయాందోళన మధ్య మౌనంగా ఉండిపోతున్నారు. మరో నాలుగేళ్లు ప్రభుత్వం ఉండడంతో ప్రభుత్వానికి చెడ్డ కావడం ఎందుకా అన్న ఆలోచనతో బహిరంగంగా మాట్లాడేందుకు జంకుతున్నారు. కానీ ఇటువంటి పరిస్థితుల్లోనూ రాయచోటికి చెందిన సుగవాసి బాలసుబ్రమణ్యం టిడిపికి రాజీనామా చేసి వైసీపీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకోవడం బలిజల్లోని అసంతృప్తి వాదుల్లోని వ్యతిరేకత మరింత ఆజ్యం పోసింది.

**రామచంద్రయ్య సైతం మౌనం :**
జిల్లాలో టీడీపీలో సీనియర్ నాయకుడు, విశ్లేషకుడు ఎమ్మెల్సీ రామచంద్రయ్య వాయిస్ కూడా మునుపటిలాగా వినిపించడం లేదన్న అభిప్రాయం వ్యక్తం అవుతున్నాయి. కడప లో జరిగిన రాష్ట్ర మహానాడుకు కూడా ఆయన హాజరు కాలేదు. బలిజ సామాజిక వర్గానికి చెందిన రామచంద్రయ్య వైసీపీకి, ఆ పార్టీ నుంచి పొందిన ఎమ్మెల్సీ స్థానానికి రాజీనామా చేసి టిడిపిలో చేరారు. నేరుగా చంద్రబాబుతో మాట్లాడేంత సన్నిహితం ఉన్న రామచంద్రయ్య మౌనంగా ఉండిపోవడంతో ఇతర నేతలు నోరు మెదపలేని పరిస్థితిలో ఉండిపోయారు.

**బత్యాల పరిస్థితి అగమ్యగోచరం :**
ఇదిలా ఉంటే మరో సీనియర్ నేత బత్యాల చంగల్ రాయుడు పరిస్థితి అదే. ఈయనది రైల్వేకోడూరు నియోజకవర్గమైనప్పటికీ 2019లో రాజంపేటలో టిడిపికి అభ్యర్థి కరువడంతో బత్యాలను అప్పటికప్పుడు రాజంపేటకు వెళ్లి పోటీ చేయాలని పార్టీ ఆదేశించింది. పార్టీ ఆదేశం మేరకు బత్యాల కూడా రాజంపేటలో వచ్చి పోటీ చేసి ఓటమి చెందారు. వైసిపి ప్రభుత్వం హాయంలో రాజంపేటలో టిడిపిని ముందుండి నడిపారు. కానీ తీరా ఎన్నికలు దగ్గరకు వచ్చాక ఆయనను అక్కడి నుంచి తప్పించారు. బత్తాలను తప్పించి రాజంపేట మాజీ ఎంపీ సుగవాసి పాలకొండ్రాయుడు తనయుడు బాలసుబ్రమణ్యాన్ని టిడిపి రంగంలోకి దించింది. కానీ స్థానిక నాయకులు ఎవరూ సపోర్ట్ చేయకపోవడంతో టిడిపి ఓటమి పాలైంది. ఓటమిపాలయ్యాక బాలసుబ్రమణ్యం సైతం రాజంపేట నుంచి మళ్లీ రాయచోటికి వెళ్లేలా చేశారు. ఇప్పుడు మళ్లీ రాజంపేట బాధ్యతలు బత్యాలకు ఇవ్వాలన్న ప్రయత్నాలు జరుగుతుంటే... ఏది ఏమైనా స్థానికులకే రాజంపేట టిడిపి పగ్గాలు ఇవ్వాలంటూ స్థానిక నాయకత్వం డిమాండ్ చేస్తోంది. దీంతో బత్యాల పరిస్థితి రెంటికి చెడ్డ రేవడిలా తయారైంది. ఆయన కూడా చేసేదేమీ లేక రాజకీయాలకు దూరంగా ఉంటూ వస్తున్నాడు.

రాయచోటి మాజీ ఎమ్మెల్యే పాలకొండ్రాయిడి మృతి అనంతరం ఆయన కుటుంబాన్ని టిడిపి అధిష్టానం పరామర్శించకపోవడం కూడా బలిజల్లో తీవ్ర అసంతృప్తికి కారణమైంది. ఇలా జిల్లాలో సీనియర్ బలిజ నేతలు అంతా మౌనంగా ఉండడంతో ద్వితీయ శ్రేణి నాయకత్వం అంతా తమకు జరుగుతున్న అన్యాయాన్ని ఎవరికి చెప్పుకోవాలి అర్థం కాక తలలు పట్టుకుంటున్నారు. మరి రానున్న రోజుల్లో ఎలాంటి పరిణామాలు చోటుచేసుకుంటాయోనన్నది ఆసక్తిగా మారింది.



# నైపుణ్యాభివృద్ధి.. ఆర్థిక వృద్ధికి సోపానం!

- ప్రతి మండలానికీ నైపుణ్య శిక్షణ కేంద్రం అవసరం
- పీఎం ఇంటర్న్‌షిప్, పీఎం సూర్యఘర్‌పై ప్రత్యేక దృష్టిపెట్టండి
- సమష్టి కృషి, సమన్వయంతో జిల్లా సమగ్రాభివృద్ధికి కృషిచేద్దాం
- యోగాంధ్ర స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో జిల్లా కృషి భేష్
- దిశ కమిటీ సమావేశంలో ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)

**విజయవాడ :**

ప్రణాళికాబద్ధ ఆర్థిక పురోగతికి ముఖ్యంగా యువతలో నైపుణ్యాభివృద్ధి కీలకమని.. ప్రతి మండలంలో స్థానిక పారిశ్రామిక అవసరాలు, అభివృద్ధికి దోహదంచేసే వనరులను దృష్టిలో ఉంచుకొని నైపుణ్య శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాల్సిన అవసరముందని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. మంగళవారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ అధ్యక్షతన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశం జరిగింది. కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, జగ్గయ్యపేట, తిరువూరు శాసన సభ్యులు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య, కొలికపూడి శ్రీనివాసరావు హాజరైన ఈ సమావేశంలో వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు పురోగతి, భవిష్యత్తు కార్యాచరణ, సమస్యల గుర్తింపు, పరిష్కారానికి చర్యలపై చర్చించారు.

ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ.. ఎంపీగా ప్రమాణ స్వీకారం చేసి మంగళవారం నాటికి ఏడాది అయ్యిందని, ఈరోజు జిల్లా సమగ్రాభివృద్ధికి కీలకమైన దిశ కమిటీ సమావేశంలో పాల్గొనడం చాలా ఆనందంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారం, సమన్వయంతో అమలవుతున్న పథకాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకునేలా ప్రణాళికలు రూపొందించడంతో పాటు పథకాలు, కార్యక్రమాల అమల్లో లోటుపాట్లను గుర్తించి సమస్యల పరిష్కారానికి కృషిచేసేందుకు ఈ సమావేశం ఉపయోగపడుతుందన్నారు.

సమావేశంలో ప్రజాప్రతినిధులు, అధికారుల సూచనలను పార్లమెంటు సమావేశాల ద్వారా కేంద్రం దృష్టికి తీసుకెళ్తానని, జిల్లా సమగ్రాభివృద్ధికి మరిన్ని నిధుల సాధనకు కృషిచేయనున్నట్లు తెలిపారు. వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర సాకారానికి ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసికట్టుగా అడుగులేద్దామని పిలుపునిచ్చారు. జిల్లాలో పీఎం ఆవాస్ యోజన కింద 1,08,836 గృహాలు మంజూరుకాగా 75 శాతం గృహాల గ్రౌండింగ్ జరిగిందని.. 22,293 ఇళ్ల నిర్మాణాలుపూర్తికాగా, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయని అధికారులు వివరించగా.. బీసీ, ఎస్‌సీ, ఎస్‌టీలకు రాష్ట్ర ప్రభుత్వమిచ్చే అదనపు సాయాన్ని ఉపయోగించుకొని నిర్మాణాలను పూర్తిచేసుకునేలా లబ్ధిదారులను ప్రోత్సహించాలని ఎంపీ సూచించారు

పెద్దఎత్తున కిసాన్ మేళాలు నిర్వహించాలి..!
రైతు సేవా కేంద్రాల ద్వారా వరి, పచ్చిరొట్ట, అపరాల విత్తనాల పంపిణీ జరుగుతోందని.. అదేవిధంగా 202526లో 14,864 భూసార పరీక్షల నమూనాలు లక్ష్యం కాగా ఇప్పటివరకు 13,949 నమూనాలు సేకరించినట్లు వ్యవసాయ అధికారులు వివరించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమం ద్వారా ఖరీఫ్ 2025కు సంబంధించి పీఎం ఫసల్ బీమా యోజన పథకంపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. రైతులకు ఆధునిక వ్యవసాయ సాంకేతికతను పరిచయం చేసేందుకు, దిగుబడులు తద్వారా ఆదాయాలు పెరిగేందుకు దోహదపడే కిసాన్ మేళాలను పెద్దఎత్తున నిర్వహించాలని, ఇందుకు అవసరమైన ప్రతిపాదనలు రూపొందించాలని ఎంపీ సూచించారు. 202526లో 46,118 మంది రైతుల ద్వారా 21,993 హెక్టార్లను ప్రకృతిసాగులోకి తీసుకొచ్చే లక్ష్యాన్ని చేరుకునేందుకు కృషిచేయాలన్నారు.

పీ4 విధానం అమల్లో జిల్లాను ముందు నిలిపేందుకు కృషి: కలెక్టర్
పేదరిక నిర్మూలనకు వినూత్న విధానమైన పీ4 విధానం అమల్లో జిల్లాను ముందంజలో నిలిపేందుకు టీమ్ ఎన్టీఆర్ కృషిచేస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. ఒక కుటుంబంఒక పారిశ్రామికవేత్త లక్ష్యాలను చేరుకునేందుకు వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. స్వయం సహాయక సంఘాల సభ్యులకు శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ఎంఎస్ఎంఈ పార్కుల ద్వారా జిల్లా పారిశ్రామికంగా మరింత ముందుకెళ్లేందుకు వీలుంటుందన్నారు.

దిశ సమావేశంలో సాక్షమ్ అంగన్వాడీలు, మైలవరం, వీరుళ్లపాడు, ఇబ్రహీంపట్నం, జి.కొండూరు, ఎ.కొండూరు మండలాలను కవర్‌చేసే స్టార్టప్ విలేజ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ప్రోగ్రామ్ (ఎస్‌వీఈపీ) బ్లాక్, పీఎం విశ్వకర్మ యోజన, జిల్లాలో మూడు దశల్లో మంజూరైన 29 పీఎం శ్రీ స్కూళ్లు, గిరిజన ప్రాంతాల అభివృద్ధి పథకాల అమలు, పీఎం సూర్యఘర్, పీఎం ఇంటర్న్‌షిప్ తదితరాలపై ప్రభావవంతమైన చర్చ జరిగిందని.. సమావేశంలో లేవనెత్తిన అంశాలపై ప్రత్యేకంగా దృష్టిసారించనున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.

సమావేశంలో జెడ్‌పీ సీఈవో కె.కన్నమనాయుడు, సీపీవో వై.శ్రీలత, డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు, డీఈవో డీఎంఎఫ్ విజయకుమారి, డ్వామా పీడీ ఎ.రాము, డీఎంహెచ్‌వో డా. ఎం.సుహాసిని, హౌసింగ్ పీడీ పి.రజనీకుమారి, డీఈవో యూవీ సుబ్బారావు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, మునిసిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

# సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కోసం క్లస్టర్స్ ఏర్పాటు!

**టీపీఎన్, విజయవాడ :**

ఎన్టీఆర్ జిల్లాలో విజయవాడని మినహాయించగా ఉన్న మిగిలిన నాలుగు మునిసిపాలిటీలని రూరల్ అండ్ అర్బన్ కవర్ అయ్యే విధంగా రెండు క్లస్టర్స్ ఏర్పాటు చేసి ఒక కొత్త మోడల్‌కి శ్రీకారం చుడుతున్నామని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ శ్రీ కొమ్మా రెడ్డి పట్టాభిరామ్ అన్నారు . విజయవాడలోని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ కార్యాలయం వేదికగా ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని ) ఆద్వర్యంలో.. తిరువూరు, జగ్గయ్యపేట శాసన సభ్యులు అలాగే ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సమక్షంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ జిల్లా పూర్తి స్థాయి సమీక్ష సమావేశంలో పట్టాభిరామ్ పాల్గొన్నారు .ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ.. సుపరిపాలనకి తోలి అడుగు పడి సరిగ్గా ఏడాది పూర్తి అయిన సందర్భంగా సీఎం చంద్రబాబు గత సంవత్సర కాలంలో ఏం అభివృద్ధి చేశాం.. ఇంకా ఏం చేయబోతున్నాం అనే విషయాలపై సుదీర్ఘమైన వివరణ ఇచ్చారని తెలిపారు. అందులో భాగంగానే వేస్ట్ మేనేజ్మెంట్‌కి సంబంధించి స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ పరిధిలో చేయబోయే కార్యక్రమాల కోసం ఒక ప్రణాళికని తయారు చేశామని అందులో ముందుగా ఎన్టీఆర్ జిల్లాని ఒక పైలట్ ప్రాజెక్ట్ కింద తీసుకుని అందులో ఉన్న మునిసిపాలిటీలు మొత్తాన్ని రెండు క్లస్టర్స్ కింద విభజించడం జరుగుతుందని వాటిలో జగ్గయ్యపేట,కొండపల్లి ,నందిగామ ఒక క్లస్టర్ గా తిరువూరు,మైలవరం ,నూజివీడు కవర్ అయ్యే విధంగా మరొక క్లస్టర్‌గా రూపొందించడం జరిగిందని శ్రీ పట్టాభిరామ్ స్పష్టం చేసారు .. ఈ రెండు క్లస్టర్స్ కింద సుమారు ఐదు వేల జనాభాకి పైబడి ఉన్నప్రధాన పంచాయతీలు 75 గుర్తించామని వాటిలో ఎప్పటికప్పుడు ఏ రోజు వచ్చిన చెత్తని ఆ రోజు ప్రాసెస్ చేయడం జరుగుతుందని శ్రీపట్టాభిరామ్ తెలిపారు . స్వచ్ఛ దివస్ గా పిలవబడే అక్టోబర్ 2 న మొట్ట మొదటి క్లస్టర్ ప్రారంభించే దిశగా అడుగులు వేస్తున్నామని శ్రీ పట్టాభిరామ్ తెలిపారు. ఈ క్లస్టర్స్ ఏర్పాటుకి జగ్గయ్యపేట శాసన సభ్యులు శ్రీరామ్ తాతయ్య, తిరువూరు శాసన సభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు,మైలవరం శాసనసభ్యులు వసంత కృష్ణ ప్రసాద్ ,నందిగామ శాసనసభ్యులు తంగిరాల సౌమ్యలు పూర్తి సహకారం అందిస్తున్నారని శ్రీ పట్టాభిరామ్ తెలిపారు. రాష్ట్రంలో డంప్ యార్డ్ అనేది లేకుండా చేసి ఆంధ్ర రాష్ట్రాన్ని డంప్ యార్డ్ ఫ్రీ స్టేట్ గా మార్చాలని సీఎం చంద్రబాబు ఆదేశించారని దానికన్నా ముందు ఎన్టీఆర్ జిల్లాని డంప్ ఫ్రీ డిస్ట్రిక్ట్ గా మారుస్తామని అందుకు కావలసిన స్వీపింగ్ మెషీన్స్ ,ఇతర పరికరాలు కూడా అందించడానికి స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ సిద్ధంగా ఉందని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ శ్రీ కొమ్మా రెడ్డి పట్టాభిరామ్ తెలిపారు . ఈ కార్యక్రమంలో ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని),జగ్గయ్యపేట శాసన సభ్యులు శ్రీరామ్ తాతయ్య,తిరువూరు శాసన సభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి. లక్ష్మిషా, ఎన్టీఆర్ జిల్లా మున్సిపల్ చైర్మన్లు , కమిషనర్లు మరియు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.





# మత్స్యకారుల సమస్యలు పరిష్కారిస్తాం!

**టీపీఎన్, బాపట్ల :**

చేపల వేటకు ఆటంకంగా ఉన్న ఈపురుపాలెం కాల్వలో అడ్డురాళ్లను తక్షణమే తొలగిస్తామని, మత్స్యకారుల సమస్యలు పరిష్కరిస్తామని బాపట్ల జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. కాల్వను పూడ్చడానికి వేసిన రాళ్ళను తొలగించాలంటూ చేపల వేట నిలిపివేసి ఆందోళన నిర్వహిస్తున్న 9 గ్రామాలలోని మత్స్యకార ప్రతినిధులను కలెక్టర్ పిలిపించి అత్యవసర సమావేశం నిర్వహించారు. ఆ గ్రామాలలోని మత్స్యకారుల సమస్యలపై స్థానిక కలెక్టరేట్ లో మంగళవారం ఆయన సుదీర్ఘంగా చర్చించారు. తదుపరి మత్స్యకారుల సమస్యలను శాశ్వతంగా పరిష్కరిస్తామన్నారు. ఈపురుపాలెం కాల్వ సముద్రంలోకి కలిసే చోట చేపల వేట నిషేధం ప్రకటించకముందు ఎలా ఉందో ప్రస్తుతం నీటి ప్రవాహం సాగేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ప్రకటించారు. 2,500 బోట్లపై 20 వేల కుటుంబాలు ఆధారపడి చేపల వేటతో జీవనం సాగిస్తున్నాయన్నారు. ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన కాల్వ దారిని మళ్లించడానికి ఒక వ్యక్తి 500 టన్నుల ఇసుకను తొవ్వారని చెప్పారు. దీంతో పడవల రాకపోకలు నిలిచిపోయాయన్నారు. సముద్ర తీరం వద్ద వేసిన రాళ్ల వలన పడవల అడుగుభాగం దెబ్బతింటున్నాయని చెప్పారు. ఏడాదిన్నర క్రితం జరిగిన సంఘటనపై మత్స్యకారులు ఇప్పుడు ఆందోళన చేస్తున్నారని వివరించారు. వారి జీవనోపాధికి ఎలాంటి సమస్య రాకుండా చట్ట ప్రకారం అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. కాల్వ సమీపంలో ఉన్న పట్టాదారుడు ఆ కాల్వను పూడ్చడం, వరద నీరు దిగువకు వెళ్లకుండా అడ్డుకోవడంపై కలెక్టర్ ఆరా తీశారు. తొమ్మిది గ్రామాలలోని మత్స్యకార కుటుంబాల జీవనోపాధికి సంబంధించిన కాల్వను పూడ్చడంపై విచారిస్తామన్నారు. కాల్వలో వరద ప్రవాహాన్ని అడ్డుకునేలా పూడ్చడంపై కమిటీని నియమిస్తున్నట్లు ప్రకటించారు. ఆ కమిటీలో ఆర్డీవో, భూగర్భ గనులు, జల వనరులు, కాలుష్య నియంత్రణ మండలి, డీఎస్పీ, మత్స్య శాఖ అధికారులు, మత్స్యకార నాయకులు ఉంటారన్నారు. నెల రోజుల్లో సమగ్ర విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని సంబంధితశాఖల అధికారులను ఆదేశించారు. ముందుగా సమగ్ర సర్వే నిర్వహించాలని, తీర ప్రాంతం పర్యావరణాన్ని కాపాడాలన్నారు. ఆక్రమించినట్లు తేలితే సీఆర్ జెడ్ చట్టం ఉల్లంఘన కింద చర్యలు తీసుకుంటామన్నారు. అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన కాల్వ యథాతదంగా ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. మత్స్యకారులపై నమోదైన కేసులు తొలగిస్తామని హామీ ఇచ్చారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లడానికి ఆటంకంగా ఉన్న అన్ని పరిస్థితులను సరి చేస్తామని జిల్లా ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. బోట్ల రాకపోకల పునరుద్ధరణకు చట్ట ప్రకారం అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. సి ఆర్ జెడ్ చట్టాన్ని ఉల్లంఘిస్తే వారిపై తక్షణమే కేసులు నమోదు చేసి క్రిమినల్ చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు సంయుక్తంగా సర్వే, విచారణ, దర్యాప్తు చేస్తామన్నారు. అన్ని పరిస్థితులను సాయంత్రం కల్లా అదుపులోకి తెస్తామన్నారు. మత్స్యకారులు సహకరించాలని కోరారు. ఈపురుపాలెం కాల్వను పూడ్చడంపై విచారించి బాధ్యులపై చర్య తీసుకోవాలని మత్స్యకార ప్రతినిధులు రాజశేఖర్, నాగార్జున, ఆర్ ఎం శీలం కోరారు. కొందరు వ్యక్తులు స్వలాభం కొరకు తీర ప్రాంతాలను ఆక్రమిస్తున్నారని లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఘటనకు సంబంధించిన సమస్యలపై జిల్లా కలెక్టర్ కు మత్స్యకార ప్రతినిధులు వినతి పత్రాలను అందించారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్, ఆర్డీవో పి గ్లోరియా, అనుబంధ శాఖల అధికారులు, మత్స్యకార ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



# నిరుద్యోగులకు శుభవార్త.. ఈ నెల 28న సాలూరులో జాబ్‌మేళా..!

**టీపీఎన్, పార్వతీపురం మన్యం జిల్లా :**

సాలూరు శ్రీ సత్యసాయి డిగ్రీ కళాశాలలో ఈ నెల 28న ఉదయం 9.00గం.లకు జాబ్ మేళా జరగనుందని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పేర్కొన్నారు. నిరుద్యోగ యువత జాబ్ మేళాలో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉపాధి కల్పనలో భాగంగా 10వ తరగతి, ఇంటర్, ఐటిఐ, ఏదైనా డిగ్రీ చదువుకొని 18 నిండి 28 ఏళ్లు ఉన్న నిరుద్యోగ యువతీ యువకులు జాబ్ మేళాకు అర్హులని తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు జూన్ 28వ తేదీ అనగా శనివారం ఉదయం 9.00 గం.ల నుంచి శ్రీ సత్యసాయి డిగ్రీ కళాశాల, సాలూరులో జరిగే జాబ్ మేళాకు హాజరుకావచ్చని చెప్పారు. ఈ జాబ్ మేళాలో 12 కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరై అర్హత కలిగిన అభ్యర్థులను వారి కంపెనీలోకి ఎంపిక చేసుకోవడం జరుగుతుందని వివరించారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ యువకులకు తమ వివరాలను https://naipunyam. ap.gov.in వెబ్ సైట్ నందు తప్పనిసరిగా నమోదు చేసుకొని, రిఫరెన్స్ నెంబరుతో పాటు బయో డేటా, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్లు ఒరిజినల్ మరియు జెరాక్స్, ఒక పాస్పోర్ట్ సైజ్ ఫోటోతో ఆ రోజు ఉదయం 9.00గం.లకు హాజరు కావాలని స్పష్టం చేశారు. మరిన్ని వివరాలకు 94947 77553, 73825 59022 మొబైల్ నెంబర్లను సంప్రదించవచ్చని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.



# విపత్తు నిర్వహణ చర్యలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి..!

**టీపీఎన్, విజయవాడ :**

విపత్తు నిర్వహణలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. మంగళవారం ఉదయం తన పర్యటనలో భాగంగా నేతాజీ బ్రిడ్జ్ కృష్ణలంక ప్రాంతాలన్నీ పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. విపత్తు నివారణ చర్యల్లో భాగంగా కృష్ణానది వద్ద ఉండే కృష్ణలంక ప్రాంతం ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. తదుపరి కృష్ణలంక ప్రధాన రహదారి, సాయిబాబా గుడి వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా తాగునీటి సరఫరా ఆహారంలో నాణ్యత పారిశుధ్య నిర్వహణ సక్రమంగా ఉండాలని సూచించారు. ఈ పర్యటనలో చీఫ్ ఇంజనీర్ ఆర్ శ్రీనాథ్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సామ్రాజ్యం, సిబ్బంది పాల్గొన్నారు.



# శ్రీకాళహస్తి బీసీ హాస్టల్‌లో ఫుడ్ పాయిజన్..!

**టీపీఎన్, శ్రీకాళహస్తి :**

శ్రీకాళహస్తి బీసీ బాలుర హాస్టల్లో 16 మంది విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ కావడంతో అస్వస్థతకు గురయ్యారు. మంగళవారం యథావిధిగా హాస్టల్లో టిఫిన్ చేసి పాఠశాలకు వెళ్లిన విద్యార్థులు వాంతులు చేసుకున్నారు. శ్రీకాళహస్తి ఏరియా హాస్పిటల్ లో చికిత్స అందిస్తున్నారు వీరిని శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు మరియు వైయస్సార్సీపి బీసీ నాయకుడు వడ్ల తాంగల్ బాలాజీ రెడ్డి చిన్నారులను పరామర్శించినారు. అనంతరం అక్కడే విధులు నిర్వహిస్తున్న డాక్టర్లను చిన్నారులకు అందిస్తున్న చికిత్సను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి నియోజకవర్గ వైయస్సార్సీపి యువజన సంఘం అధ్యక్షుడు శ్రీవారి సురేష్, ఉమ్మడి చిత్తూరు ప్రధాన కార్యదర్శి బాలిశెట్టి విజయ్ శేఖర్, పెరుమాళ్ చౌదరి మరియు విద్యార్థి సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యాశక్తి కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయాలి..!

**టీపీఎన్, విజయవాడ :**

భావితరానికి ఉజ్వల భవిష్యత్తు ఇచ్చే శక్తి ఉపాధ్యాయులకు ఉందని, ప్రతి విద్యార్థిని తమ సొంత పిల్లల్లా భావించి నాణ్యమైన విద్యను అందించాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ శ్రీ విజయ్ రామరాజు అన్నారు. మంగళవారం విజయవాడలోని ఆంధ్రాలయోలా కాలేజీ ఎస్ జె ఎక్స్ లెన్స్ సెంటర్లో 'విద్యాశక్తి ' శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఐదు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో కేజీబీవీ, ఏపీ రెసిడెన్షియల్ స్కూల్ సొసైటీ, ఏపీ మోడల్ స్కూళ్లకు చెందిన ఉపాధ్యాయ సిబ్బంది విడతల వారీగా పాల్గొంటారు.




విద్యాశాఖ డైరెక్టర్ శ్రీ విజయ్ రామరాజు మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదువులో వెనుకబడిన విద్యార్థుల కోసం రూపొందించిన ఆన్‌లైన్ అదనపు బోధనా (remedial) కార్యక్రమం 'విద్యాశక్తి' అని అన్నారు. ఇందులో భాగంగా సాంకేతికతను, వినూత్న బోధనా పద్ధతులను ఉపయోగించి గణితం, సైన్స్, ఇంగ్లీషు సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులకు అదనంగా పాఠశాల వేళల తర్వాత ఆన్‌లైన్‌లో తరగతులు ద్వారా కోచింగ్ నిర్వహిస్తారు.

ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా 4424 జిల్లా పరిషత్, ప్రభుత్వ, మున్సిపల్ పాఠశాలల్లో, 576 కేజీబీవీ, ఏపీ రెసిడెన్షియల్ స్కూల్, ఏపీ మోడల్ స్కూల్స్ లో విద్యాశక్తి కార్యక్రమం అమలు చేస్తున్నామన్నారు.

విద్యార్థులలో అభ్యసన ఫలితాలను (learning outcomes) మెరుగుపరచడం, డ్రాపౌట్ రేట్లను తగ్గించడం, రాష్ట్రంలోని విద్యా సంస్థలలో స్థూల నమోదు నిష్పత్తిని (Gross Enrolment Ratio GER) పెంచడం తదితర ప్రధాన లక్ష్యాలుగా ఈ కార్యక్రమం అమలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమ అమలులో భాగంగా ప్రతి విద్యార్థి కాలనుక్రమ పట్టికను పాటించాలని, ఈ విద్యా సంవత్సరం నుండి తరగతుల వారీగా స్లాట్ ఉంటుందని వివరించారు. మెరుగైన అభ్యసన ఫలితాల కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. తెలివైన విద్యార్థులను గుర్తించి వారికి మరింత ప్రోత్సాహాన్నిస్తూ, పదో తరగతిలో ప్రతి పాఠశాల నుండి అత్యధిక మార్కులు సాధించేలా ఎక్కువ మంది విద్యార్థులకు తర్ఫీదునివ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ స్కూల్స్ (ఏపీఆర్ఈఐఎస్) కార్యదర్శి శ్రీ వి.ఎన్.మస్తానయ్య గారు, ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు, అడిషనల్ డైరెక్టర్ ఐటీ విభాగం డా. కె.వి. శ్రీనివాసులు రెడ్డి గారు, ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ శ్రీ ఎం.వి.కృష్ణారెడ్డి గారు, ఐఐటీఎం ప్రవర్తక్ ప్రతినిధులు నాగరాజన్, శివ సుబ్రమణ్యన్ తదితరులు పాల్గొన్నారు.



# విపత్తుల సమాచారం కోసం "సాచేట్" యాప్..!

**టీపీఎన్, రాజమండ్రి :**

విపత్తుల సమయంలో ఎటువంటి ప్రాణ , ఆస్తి నష్టం వాటిల్లకుండా కేంద్ర, రాష్ట్ర స్థాయిలో తీసుకున్న నిర్ణయాలపై జిల్లా స్థాయిలో అమలు చేస్తున్న తీరు, వాటికి సంబంధించి విధాన పరమైన అంశాలపై మరింతగా చర్చించే ప్రయత్నం లో భాగంగా జిల్లాల పర్యటన నిర్వహిస్తున్నట్లు జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ సంయుక్త సలహాదారు నావెల్ ప్రకాష్ పేర్కొన్నారు. మంగళవారం ఉదయం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో న్యూ ఢిల్లీ నుండి వొచ్చిన ముగ్గురు సభ్యుల జాతీయ విపత్తుల నిర్వహణ బృందం జిల్లా విపత్తుల నిర్వహణ సంస్థ పనితీరు, నూతనంగా ప్రతిపాదించిన ఏసడీఎమ్‌ఏ 2025 నమూనా ప్రతిపాదనల పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నావెల్ ప్రకాష్ మాట్లాడుతూ.. జిల్లా స్థాయిలో విపత్తుల నిర్వహణ వ్యవస్థ యొక్క కార్యకలాపాలపై చర్చించేందుకు, గతంలో వాటిని సమర్థవంతంగా చేపట్టడంలో ఎదుర్కొన్న లోపాలను సమీక్షించి భవిష్యత్తులో వాటిని పునరావృతం కాకుండా చేపట్టేందుకు తీసుకోవలసిన కార్యాచరణ ప్రణాళిక పై చర్చించేందుకు సమావేశం నిర్వహించామన్నారు. ఈ సమావేశంలో గౌరవ ప్రజాప్రతినిధులు జిల్లా పరిషత్ చైర్మన్ హాజరు కావడం హర్షణీయం అన్నారు. ఇందుకు వారిని ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. 2005 లో రూపొందించిన మార్గదర్శకాల్లో కొన్ని మార్పులు సూచిస్తూ 2025 నమూనా ప్రతిపాదనలు సిద్ధం చేసి, వాటిని క్షేత్ర స్థాయిలో చర్చించడం ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. దేశ ప్రధాని విపత్తుల సమయంలో ఎటువంటి ప్రాణ, ఆస్తి ఉండకుండా, ఆయా ప్రాంతాల్లో పరిస్థితులను ఆకళింపు చేయడం, ఆమేరకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించడం జరిగిందనీ పేర్కొన్నారు. ఆమేరకు ఇప్పుడు ప్రతిపాదించిన అంశాలకి తగిన ప్రాధాన్యత ఇవ్వడం, వాటిలో మీమీ ప్రాంతాల్లో అమలుకు అనువైన వాటిని మాత్రమే సమర్థవంతంగా ముందుకు తీసుకుని వెళ్లాల్సి ఉంటుందన్నారు. 15 వ ఆర్థిక సంఘం నిధులు, అదే సమయంలో పారిశ్రామిక రంగంలో ఆదాయాల్లో రూ.200 కోట్ల లాభాల్లో రెండు శాతం, రూ.500 కోట్ల లాభాల్లో 5 శాతం మేర సీఎస్ఆర్ ఫండ్ ఏర్పాటు చెయ్యాల్సి ఉంటుందన్నారు. ఇందుకు ఆయా సంస్థలకు తగిన సమాచారం ఇవ్వాలని, వారిని భాగస్వామ్యం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో కేంద్ర బృంద సభ్యులు అండర్ సెక్రటరీ అభిషేక్ బిశ్వాస్, సీనియర్ కన్సల్టెంట్ అభినవ్ వాల్యా, డీఆర్వోటీ సీతారామమూర్తి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డీ భాస్కర్ రెడ్డి, రాష్ట్ర డిజాస్టర్మెంట్ డీఎస్పీ సీహెచ్ పీటర్ , రెవెన్యూ వ్యవసాయ , డీఆర్డీఏ జల వనరులు, అగ్నిమాపక, పోలీసు, పంచాయతీరాజ్, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



# అనుమతి లేని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి..!

**టీపీఎన్, విజయనగరం :**

విజయనగరం జిల్లాలో అనధికారంగా నడుపుతున్నటువంటి విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని.. అలాగే విద్యార్థుల దగ్గర నుండి అధిక ఫీజులు వసూలు చేస్తూన్న విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారులకు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గౌరీ శంకర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఉన్నటువంటి కార్పొరేట్ ,ప్రైవేట్ విద్యా సంస్థలు ఫీజుల దోపిడీకి అంతులేకుండా పోయిందన్నారు. యూనిఫామ్స్, టెక్స్ట్ బుక్స్, షూస్, టై, బెల్ట్స్ పేరుతో విద్యార్థుల దగ్గర నుంచి లక్షల రూపాయలు అక్రమంగా వసూలు చేస్తూన్నారని ఆరోపించారు.చాలావరకు విద్యాసంస్థలు టెక్స్ట్ బుక్స్, యూనిఫామ్స్, టై , బెల్ట్స్ వంటివి తమ విద్యా సంస్థలోనే తీసుకోవాలని.. పాఠశాల క్యాంపస్‌లోనే ఒక స్టోర్‌ని మెయింటైన్ చేస్తూ ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా పనిచేస్తున్నట్లు చెప్పారు. సరైనటువంటి వసతులు లేనప్పటికీ విద్యార్థుల దగ్గర నుంచి లక్షల రూపాయలు ఫీజులు వసూలు చేస్తూ సరైనటువంటి విద్యను అందించకుండా విద్యను వ్యాపారం చేస్తున్నటువంటి ఇలాంటి సంస్థలపైన వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఏ.సుమన్ , భాస్కర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.


# ఇదేం దిక్కుమాలిన పనిరా నాయనా..!

**ప్రముఖ పారిశ్రామికవేత్త విడ్డూరం..**

- **ఇంటిముందు అసభ్యకరమైన ఏర్పాట్లు..**
- **జనాలు, మహిళ సంఘాలు, నెటిజెన్ల మండిపాటు..**
- **చర్యలు తీసుకోవాలని పోలీసులకు వినతి**

**కృష్ణకుమార్, టీపీఎన్ ప్రతినిధి :**

మనిషికి పిచ్చి ముదిరితే ఏమౌతుంది..? ఆ కుటుంబంలో తలనొప్పి ఎక్కువవుతుంది.. అలాగే కాలనీలో సమస్య మొదలౌతుంది. అచ్చం అలాగే ఉంది ఓ ప్రముఖ పారిశ్రామిక వేత్త ఆలోచన. డబ్బు ఉంది కదా అని ఆయన చేసిన పని జనాలకు తల తీసినంతలా మారింది. తలపైకెత్తి చూడాలంటేనే అసహ్యం పుట్టేలా తయారైంది. అటుగా వెళ్లే జనం, వాహనదారులు, చివరకు పక్కన నివసించే జనాలు ఇదేం ఖర్మరా బాబు అంటూ తిట్లపురాణం మొదలు పెట్టారు. ఇక సోషల్ మీడియాలో నెటిజన్లు దుమ్మెత్తిపోస్తున్నారు. అందుకు కారణమేంటో ఇక్కడున్న ఫోటో చూస్తే మీకే అర్థం



అవుతుంది. చూడగానే మీరు కూడా చీ అంటూ తలదించుకుంటారు. చూశారుగా ఇది ఎవరో పెట్టిన కటౌట్ కాదు.. జూబ్లీహిల్స్ పెద్దమ్మ గుడికి కూతవేటు దూరం.. డైమండ్ హౌస్ ఎదురుగా ఉండే.. సాక్షాత్తు మేఘా కృష్ణారెడ్డి మామ, ఎస్ఎస్ రెడ్డి ఇంటి ముందు పెట్టిన అశ్లీల మహిళ బొమ్మ అది. బొమ్మ సరే పైగా దానికి లైట్స్ పెట్టి మరి అందరికి కనిపించేలా భారీ స్థాయిలో ఏర్పాటు చేయడం జనాలకు వెగటు పుట్టేలా తయారైంది. అది చూసిన వాహనదారులు, మహిళలు అంతా.. ఇదేం పోయే కాలం అంటూ తిట్ల పురాణం మొదలు పెట్టారు. చుట్టుపక్కల మహిళలు బయటకు రావాలంటేనే సిగ్గుపడే పరిస్థితులు ఉన్నాయని వెళ్లి అసభ్యకరమైన బొమ్మను తీసేయాలంటూ వేడుకుంటే మా ఇల్లు మా ఇష్టం అంటూ సమాధానం చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక నెటిజెన్ల కామెంట్లు మహిళ సంఘాల మండిపాటు గురించి చెప్పాల్సిన పని లేదు. పడకగదికి పర్సనల్‌గా మారాల్సిన ఫొటోస్ , బొమ్మలు, కటవుట్లు ఇలా నడిరోడ్డులో దర్శనం ఇస్తుంటే పోలీసులు ఏం చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. వారి ఇంట్లో మహిళలు లేరా..? వారు అడ్డుచెప్పరా..? అని నిలదీస్తున్నారు. సినిమాల్లో అశ్లీలత ఉంటే సెన్సార్ బోర్డ్ క్లిప్పింగ్స్ తొలగిస్తుంది. మరి అంత భారీ స్థాయిలో ఏర్పాటైన ఆ బొమ్మపై పోలీసులు ఎందుకు చూసి చూసినట్లు వ్యవహరిస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. ప్రముఖ వ్యాపారవేత్త అని వారికి పోలీసులు, అధికారులు వత్తాసు పలికితే సబబు కాదని చెబుతున్నారు. వెంటనే దాన్ని తొలగించాలని కోరుతున్నారు. ఇదిలావుంటే ఇటీవల జరిగిన మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొన్న అందెగత్తెలకు ఆయన ఇంట్లో ఆతిథ్యం కూడా ఇచ్చారని, అందులో ఎవరి బొమ్మ ఇది అంటూ కామెంట్లు చేస్తున్నారు.



# రుణ మంజూరులో కౌలురైతులకు అత్యధిక ప్రాధాన్యత

**టీపీఎన్, ఏలూరు :**

రుణ మంజూరులో జిల్లాలో కౌలు రైతులకు, ఉద్యానవన పంటలకు, పాడి రైతులకు అత్యధిక ప్రాధాన్యతను ఇవ్వాలని జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి బ్యాంకర్లకు సూచించారు. స్థానిక జిల్లా కలెక్టరేట్ గౌతమి సమావేశ మందిరంలో మంగళవారం కలెక్టర్ అధ్యక్షతన బ్యాంకర్ల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వ్యవసాయ రుణాలు, పిఎం సూర్యఘర్, ఎస్ హెచ్ జి బ్యాంకు లింకేజి, పిఎం స్వానిధి, పిఎం విశ్వకర్మ, తదితర పథకాల పురోగతిపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ భూమిపై సాగుచేస్తూ సిసి ఆర్ సి కార్డుగల కౌలు రైతులకు విరివిగా రుణాలు ఇవ్వాలన్నారు. ఇదే సమయంలో ఉద్యాన, పాడి రైతులకు అవసరమైన రుణాలు మంజూరుకు ప్రాధాన్యత నివ్వాలన్నారు. పాడి పశువులకు సంబంధించి రైతుల నుండి ధరఖాస్తులు పశు సంవర్ధక శాఖ సేకరించి బ్యాంకర్ల ద్వారా రుణాలు అందించడంపై చొరవ చూపాలన్నారు. కోకో, ఆయిల్‌పామ్ కోసం పోస్ట్ హార్వెస్టింగ్, ఫ్లాట్ ఫామ్ నిర్మాణాలు, తదితరాలకు సంబంధించి సబ్సిడీపై రుణాలు అందించడంలో బ్యాంకర్లు ముఖ్యపాత్ర పోషించాలన్నారు. చిన్న, మధ్యతరహా ఫుడ్ ప్రోసెసింగ్ 100 యూనిట్లు నెలకొల్పే లక్ష్యంగా డిఆర్డిఏ, మెప్మా, బ్యాంకర్ల సమన్వయంతో పనిచేసి యూనిట్లు త్వరితగతిన స్థాపనకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో మినీ రైస్ మిల్లులు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఇప్పటికే 50 యూనిట్ల స్థాపనకు అందిన ధరఖాస్తులపై చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. పోలవరం నిర్వాసితులు నివసిస్తున్న కొత్త కాలనీల్లో జీలుగుమిల్లి, బుట్టాయిగూడెం తదితర ప్రాంతాల్లో బ్యాంకుల కొత్త బ్రాంచిలు ప్రతిపాదించాలని కలెక్టర్ కోరారు. స్వయం సహాయక సంఘాలకు రుణాలు అందించడంలో నూరు శాతం లక్ష్యాలు సాధించాలన్నారు. సమావేశంలో యూనియల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ హెడ్ ఎన్.శ్రీనివాసరావు, ఆర్బిఐ ఎజిఎం అబిషేక్ రాజ్, ఎల్ డిఎం డి. నీలాద్రి, నాబార్డు డిడిఎం పి. అనీల్ కాంత్, డిఆర్ డిఏ పిడి ఆర్. విజయరాజు, ఎస్సీ కార్పోరేషన్ ఈడి ఎం. ముక్కంటి, జెడ్పి సిఇఓ శ్రీహరి, జిల్లా ఉద్యానశాఖ అధికారి ఎస్. రామ్మోహన్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎం. హబీబ్ భాషా, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి ఎన్.ఎస్. కృపావరం, బి.సి. కార్పోరేషన్ ఈడి ఎన్. పుష్పలత, వివిధ శాఖల జిల్లా అధికారులు, వివిధ బ్యాంకుల జిల్లా కో ఆర్డినేటర్లు, పాల్గొన్నారు.




# ఏలూరు జిల్లా వార్షిక రుణ ప్రణాళిక విడుదల..!

- **రు. 21,262 కోట్ల అంచనాలతో ప్రణాళిక**
- **ప్రాధాన్యతా రంగాలకు 18,243 కోట్లు**
- **వ్యవసాయానికి 8,396 కోట్ల స్వల్పకాలిక రుణాలు**
- **జిల్లా క లెక్టర్ వెట్రిసెల్వి వెల్లడి**

**టీపీఎన్, ఏలూరు :**

జిల్లాలో 202526 ఆర్థిక సంవత్సరానికి రూ.21,262 కోట్ల అంచనాలతో రూపొందించిన వార్షిక రుణ ప్రణాళికను జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి విడుదల చేశారు. స్థానిక కలెక్టరేట్ లో మంగళవారం జరిగిన జిల్లా స్థాయి బ్యాంకర్ల సమావేశానికి కలెక్టర్ అధ్యక్షత వహించారు. 202526 సంవత్సరం వార్షిక రుణ ప్రణాళికను సమావేశంలో కలెక్టర్ విడుదల చేస్తూ గతంకన్నా 3 వేల కోట్ల రూపాయలు అదనంగా వార్షిక రుణ ప్రణాళికను రూపొందించామన్నారు. ఇందులో ప్రాధాన్యత రంగాలకు రూ. 18,243 కోట్లు కేటాయించారు. ప్రాధాన్యేతర రంగాలకు రూ. 3,018 కోట్లు కేటాయించారు. ప్రాధాన్యతా రంగాల్లో వ్యవసాయానికి స్వల్పకాలిక రుణాల కింద రూ. 8,396 కోట్లు, వ్యవసాయ టర్మ్ లోన్స్ (వ్యవసాయ అనుబంధ రంగాలు) కింద రూ.4,338 కోట్లు, వ్యవసాయ మౌలిక సదుపాయలకు రూ. 1,111 కోట్లు, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు రూ.3,343 కోట్లు, ఇతర ప్రాధాన్యత రంగాలకి రూ. 1,055 కోట్లు, కేటాయించారు. గత ఏడాది వార్షిక రుణ ప్రణాళికలో రూ. 18,256 కోట్లకు గాను రూ. 21,816 కోట్లతో 119 శాతం లక్ష్యాన్ని సాధించారు. ఆయా రంగాలకు నిర్ధేశించిన రుణాలను నూరుశాతం లక్ష్యాలను సాధించే దిశగా బ్యాంకర్లు కృషి చేయాలన్నారు. ముఖ్యంగా కౌలు రైతులకు విరివిగా రుణాలు అందించడంలో బ్యాంకర్లు చొరవ చూపాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో యూనియల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ హెడ్ ఎన్. శ్రీనివాసరావు, ఆర్బిఐ ఎజిఎం అబిషేక్ రాజ్, ఎల్ డిఎం డి. నీలాద్రి, నాబార్డు డిడిఎం పి. అనీల్ కాంత్, డిఆర్ డిఏ పిడి ఆర్. విజయరాజు, ఎస్సీ కార్పోరేషన్ ఈడి ఎం. ముక్కంటి, జెడ్పి సిఇఓ శ్రీహరి, పశు సంవర్ధక శాఖ జెడి గోవిందరాజులు, జిల్లా ఉద్యానశాఖ అధికారి ఎస్. రామ్మోహన్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎం. హబీబ్ భాషా, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి ఎన్.ఎస్. కృపావరం, బి.సి. కార్పోరేషన్ ఈడి ఎన్. పుష్పలత, వివిధ శాఖల జిల్లా అధికారులు, వివిధ బ్యాంకుల జిల్లా కో ఆర్డినేటర్లు, పాల్గొన్నారు.



# మహిళలకు శక్తి దళం అవగాహనా కార్యక్రమం..!

**టీపీఎన్, ఏలూరు :**

మహిళా భద్రత కోసం పోలీసు శాఖ ఆధ్వర్యంలో శక్తి దళం సభ్యులు పాఠశాలలు, కళాశాలల వద్ద గస్తీ నిర్వహిస్తూ అవగాహనా కార్యక్రమాలు చేపట్టారు. ఏలూరు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిశోర్ ఆదేశాలపై ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ ఇనస్పెక్టర్ సుబ్బారావు, మహిళా ఎస్ఐ కాంతిప్రియ ఆధ్వర్యంలో శక్తిదళం సభ్యులు నగరవ్యాప్తంగా ప్రత్యేక గస్తీ నిర్వహించి, మహిళలు, బాలికలు, వృద్ధుల భద్రత అవగాహనా నిర్వహించారు. శక్తి టోల్ ఫ్రీ నెంబర్ 7993485111 ను పరిచయం చేస్తూ అత్యవసర సమయంలో సహాయానికి ఎలా వినియోగించుకోవాలో ప్రజలకు శక్తి దళ సభ్యులు వివరించారు. సైబర్ నేరాలు, సోషల్ మీడియా మోసాలు, మహిళలపై వేధింపులు, ఆత్మరక్షణ పద్ధతులు వంటి అంశాలపై అభయ వాహనం ద్వారా అవగాహన కల్పించారు. పాఠశాలలు, కళాశాలల వద్ద ఆకతాయిల చెడు ప్రవర్తన నివారణకు గస్తీ నిర్వహించి బాలికలతో భద్రతపై చర్చించి ప్రోత్సహించారు. ప్రజల కోసం ముఖ్యమైన టోల్ ఫ్రీ నెంబర్లు 112 – అత్యవసర పరిస్థితుల్లో 1930 – సైబర్ నేరాల నివారణ కొరకు, 1098 – బాల్య వివాహాలు & బాలల హక్కుల కోసం, 9550351100 – ఏలూరు జిల్లా వాట్సాప్

# ఆ రహదారిలో వెళ్ళాలంటే బాలికలకు నరకం..!




- **హాస్టళ్ళకు వెళ్ళే దారి అధ్వాన్నం**
- **తక్షణం సీసీ రోడ్ నిర్మించాలని పీడీఎస్‌యు డిమాండ్**

**టీపీఎన్, ఏలూరు :**

ఆ రహదారిలో వెళ్ళాలంటే బాలికలకు ఓ నరకం. జిల్లా కేంద్రంలో పిల్లలు స్కూళ్ళకు వెళ్ళేందుకు నానా అవస్థలూ పడుతున్నారు. జిల్లా కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో వున్న జీఎంసి బాలయోగి సైన్స్ పార్క్ రోడ్ లో మొత్తం 8 హాస్టళ్ళు, సోషల్ వెల్ఫేర్ జిల్లా కార్యాలయం, రెండు విద్యుత్ కార్యాలయాలు ఉన్నాయి. ఈ రహదారి గోతుల మయమై బురద బురదగా మారింది. రోజూ రెండు వేల మంది హాస్టల్ పిల్లలు ఉదయం, సాయంత్రం వేళల్లో ఈ బురద నీటిలో నుండే నడుచుకుని వెళ్ళాలి. సోషల్ వెల్ఫేర్ కార్యాలయానికి వచ్చి వెళ్లే ప్రజానీకం, విద్యుత్ కార్యాలయాలకు వచ్చి వెళ్లే ప్రజానీకం, అధికారులు, సిబ్బంది అంతా ఈ బురదలోనే ఈదులాడాలి. రోడ్డు అంతా గోతులమయం. బురద నీటిమయం. స్కూళ్ళకు వెళ్లేందుకు హాస్టల్ పిల్లలు, ప్రత్యేకించి ఆడపిల్లలు నరకయాతన అనుభవిస్తున్న పట్టించుకున్న నాథుడు లేడు. విద్యార్థి సంఘాలు ఆందోళన చేసినా ప్రభుత్వానికి, అధికారులకు చీమకుట్టినట్టు లేదు. అమీనా పేట. బాలయోగి సైన్స్ పార్క్ రోడ్డు లో ఉన్న ఎస్సి, బీసీ ప్రీమెట్రిక్, పోస్ట్ మెట్రిక్ బాలికలు నిత్యం నడిచే రహదారి వర్షం వస్తే రోడ్డు నిండా డ్రైనేజీ వాటర్ నిలిచిపోయి నడవలేని పరిస్థితి. నిత్యం మురిగినీటిలో నడవడంతో బాలికలు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారిలో వెంటనే సీసీ రోడ్డు వేసి విద్యార్థులు ఇబ్బందులు తొలగించాలని పీడీఎస్‌యు ఉమ్మడి గోదావరి జిల్లా కమిటీ డిమాండ్ చేసింది అనంతరం పీడీఎస్‌యు అధ్యక్ష కార్యదర్శులు కాకి నాని , నంబూరు మహర్షి సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ విశ్వమోహన్ రెడ్డికి వినతి పత్రం సమర్పించారు.



# బీసీ వెల్ఫేర్ సమస్యలను పరిష్కరించాలి : ఎఐఎస్ఎఫ్

టీపీఎన్, నూజివీడు : నూజివీడు బీసీ వెల్ఫేర్ హాస్టల్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద విద్యార్థులు మంగళవారం ధర్నా చేశారు. తొలుత బాలుర వసతి గృహం నుండి ప్రధాన వీధుల గుండా ర్యాలీగా సబ్‌కలెక్టరేట్ కు చేరుకున్నారు. అనంతరం ధర్నా చేశారు. ధర్నానుద్దేశించి ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం సాయికుమార్, ఏలూరు జిల్లా అధ్యక్షులు డి. శివ కుమార్ మాట్లాడుతూ సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో పెద్ద ఎత్తన సమస్యలు తిష్ట వేశాయన్నారు. నూజివీడు ఆర్ఆర్ పేట బీసీ బాలుర వసతి గృహం లో గత ఏడు నెలల నుంచి విద్యార్థులకు వంట మనిషి లేకపోవడంతో ఆకలితో అల్లాడుతున్నారన్నారు. విద్యార్థులే స్వయంగా వారి ఆహారాన్ని వారే తయారు చేసుకోవాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ఈ సమస్యలను పరిష్కరించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సబ్ కలెక్టర్ బచ్చు స్మరణ్ రాజ్ కు వినతిపత్రం ఇచ్చారు. వెంటనే హాస్టల్‌లో కుక్‌ను, కమోడిటీ వాచ్‌మన్, సిబ్బందిని నియమించి విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో ఎఐఎస్ఎఫ్ ఏలూరు జిల్లా కోశాధికారి, ఎం. క్రాంతి కుమార్, నూజివీడు టౌన్ అధ్యక్షులు, ఆకాష్, సెక్రటరీ ప్రవీణ్, మురళి, నవీన్, విద్యార్థులు పాల్గొన్నారు.

# గంజాయి అక్రమ వ్యాపారంతో సంపాదించిన ఆస్తులు సీజ్..!

టీపీఎన్, విజయనగరం : రామభద్రపురం పోలీసు స్టేషను పరిధిలో నమోదైన గంజాయి కేసులో నిందితుడిగా అరెస్టైన గంజాయి వ్యాపారి శెట్టి ఉమా మహేశ్వరరావు అలియాస్ హుస్సేన్ అలియాస్ పుతిన్కు చెందిన రూ.1,89,84,768 విలువైన స్థిర, చరాస్తులను అటాచ్ చేస్తున్నట్లుగా విజయనగరం జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. విశాఖపట్నంలో నివాసం ఉంటున్న శెట్టి ఉమా మహేశ్వరరావు అలియాస్ హుస్సేన్ అలియాస్ పుతిన్ అనే వ్యక్తి కొంతమంది వ్యక్తుల సహకారంతో 147కిలోల గంజాయిని తరలిస్తుండగా రామభద్రపురం మండలం కొట్టక్కి చెక్ పోస్టు వద్ద పట్టుబడగా, ఈ కేసుతో ప్రమేయం ఉన్న ఆరుగురు నిందితులను అరెస్టు చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ తెలిపారు. విచారణలో శెట్టి ఉమామహేశ్వరరావు అలియాస్ హుస్సేన్ అలియాస్ పుతిన్ అనే వ్యక్తిని ప్రధాన నిందితుడిగా గుర్తించి, పిటి వారంట్ తీసుకొని తే. 25042025 దిన రామభద్రపురం పోలీసులు అరెస్టు చేసారన్నారు. ఇటీవల ప్రభుత్వం గంజాయి అక్రమ రవాణను నియంత్రించుటలో భాగంగా గంజాయి వ్యాపారంతో కూడబెట్టిన అక్రమ ఆస్తులను అటాచ్ చేయాలని నిర్ణయించి, ఉత్తర్వులు జారీ చేయడంతో, చట్టపరమైన చర్యలకు ఉపక్రమించామన్నారు. విజయనగరం జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశాలతో గంజాయి కేసుల్లో అరెస్టు కాబడిన నిందితులు, వారు ఇటీవల కాలంలో సంపాదించిన అక్రమ ఆస్తులను వెలికి తీయాలని ఇచ్చిన ఆదేశాల మేరకు, ఒక్కొక్క గంజాయి కేసులో నిందితుల ఆస్తులపై పోలీసులు విచారణ చేపట్టారన్నారు. నిందితుడు శెట్టి ఉమామహేశ్వరరావుపై ఇప్పటికే అల్లూరి సీతారామరాజు జిల్లా, విజయనగరం, విశాఖపట్నం సిటీ పరిధిలో ఏడు గంజాయి కేసులు నమోదైనట్లు, లాభసాటి వ్యాపారంగా భావించి, గంజాయి అక్రమ రవాణకు పాల్పడుతున్నట్లుగా గుర్తించామన్నారు. విచారణలో భాగంగా అదనపు ఎస్పీ పి.సౌమ్యలత ఆధ్వర్యంలో బొబ్బిలి రూరల్ సిఐ నారాయణరావు, ఎస్ఐ వి.ప్రసాదరావు మరియు ఇతర పోలీసు అధికారులు, పలు రికార్డులను, డాక్యుమెంట్లును తనిఖీ చేసి, నిందితుడు శెట్టి ఉమామహేశ్వరరావు, తన భార్య స్వరూపరాణి, సోదరుడు వెంకటరావుల పేరున 2019 నుండి 2025 మధ్య కాలంలో గంజాయి వ్యాపారంతో సంపాదించిన స్థిర, చరాస్థుల మార్కెట్ విలువ రూ.1,89,84,768/ఉంటుందని గుర్తించామన్నారు. గంజాయి వ్యాపారంతో సంపాదించిన అక్రమ ఆస్తులను ఎవరికీ విక్రయించకుండా చట్ట పరిధిలో ఫ్రీజ్ చేసినట్లుగా నోటీసులు కూడా జారీ చేసామన్నారు. ఫ్రీజ్ చేసిన ఆస్తులు చెన్నైలోని కాంపింటెంట్ అథారిటీ పరిధిలోకి వెళ్ళిపోయినట్లు, సదరు ఆస్తులను ఎవరి కొనుగోలు చేసినా, చెల్లనేరవని, ప్రజలు గమనించాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. ఈ ప్రక్రియలో క్రియాశీలకంగా పని చేసిన అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, బొబ్బిలి రూరల్ సిఐ కే.నారాయణరావు, రామభద్రపురం ఎస్ఐ వి. ప్రసాదరావు మరియు ఇతర పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ అభినందించారు.






1. George Fernandes in shackles 2. Indira Gandhi with son Sanjay in Delhi 3. Jayaprakash Narayan addressing a crowd in Patna on June 5, 1974 4. Mrs Gandhi addressing the nation during Emergency 5. The then PM posing for a photograph, December 1976 6. The Statesman, June 26, 1975 7. Stickers with state slogans on a car

# స్వేచ్ఛా గొంతుకలు నొక్కివేయబడ్డ రోజు..!

**టీపీఎన్ ప్రతినిధి :**

భారత ప్రజాస్వామ్య చరిత్రలో అవి మర్చిపోలేని చీకటి రోజులు. యాభై ఏళ్ళ క్రితం ఈ రోజే దేశంలోని ప్రజాస్వామ్య హక్కులను ప్రభుత్వం అణచి వేసిన రోజు. వాక్ స్వాతంత్ర్యానికి సంకెళ్ళు వేసిన రోజు. భారత రాజ్యాంగ విలువలు కాలరాసిన రోజు. అత్యవసర పరిస్థితి ఆరంభమైన రోజు. ఆల్ ఇండియా రేడియో ద్వారా ఆ రాత్రి రాష్ట్రపతి చేసిన ప్రకటనతో దేశం ఒక్క సారిగా షాక్‌కు గురైంది. "దేశంలో పరిస్థితుల దృష్ట్యా ఎమర్జెన్సీ విధించ బడినది" అని ప్రకటించడమే ప్రజల స్వేచ్ఛా స్వాతంత్ర్యానికి ఓ ముగింపు పాట. ప్రజాస్వామ్యాన్ని కాపాడే ప్రయత్నంలో భాగంగా ఎదిరించిన వేలాది మంది దేశవ్యాప్తంగా నిర్బంధానికి గురయ్యారు. పౌరహక్కుల కోసం, ప్రభుత్వ నియంతృత్వాన్ని వ్యతిరేకిస్తూ గళమెత్తినవారిని మీసా చట్టం కింద అరెస్టు చేశారు. వారిలో ప్రముఖ రాజకీయవేత్తలు, సంఘటన నాయకులు, జర్నలిస్టులు, సామాన్య పౌరులు ఉన్నారు. పత్రికల నోటికి తాళాలు వేశారు. జూన్ 25, 1975 నుంచి మార్చ్ 21, 1977 వరకూ 21 నెలలపాటు దేశం యావత్తూ భయం గుప్పిట్లో బ్రతుకు వెళ్లదీసింది. నియతృత్వానికి నిజమైన అర్థాన్ని చవిచూసింది. భర్తలు జైళ్లపాలైతే, భార్యా పిల్లల వేదన విన్న నాథుడు లేక దేశం కన్నీటి పర్యంతమైంది.

**భరతమాతకు గ్రహణం**

ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడ్డ రోజు
స్వేచ్ఛాగోంతుకలు నొక్కివేయబడ్డ రోజు
కళ్ళుండీ చూడలేని ధృతరాష్ట్రులు
చెవులుండీ వినలేని ద్రోణాచార్యులు
నోరుండీ మాట్లాడలేని భీష్ములు
మీసా (MISA)లు మెలేసిన రోజు
నిజాయితీని జైళ్ల గోడల్లో బంధించిన రోజు
నిలదీసే వారిని నిర్బందించిన రోజు
న్యాయదేవత కళ్ళకు గంతలు కట్టి
గాంధారిలా మార్చిన రోజు
నాయకుల నియంతృత్వంతో
భారతావని గ్రహణంలో మగ్గిన తొలి రోజు

ఎమర్జెన్సీ అధికారాన్ని ప్రశ్నిస్తూ రాజమండ్రి జైలు గోడల నుంచి ప్రజాస్వామ్య ఘోష


భారత ప్రజాస్వామ్య చరిత్రలో అత్యంత చీకటీదినంగా నిలిచిన ఎమర్జెన్సీ (197577)

రాజమండ్రి జైలు అధికారులు బ్యాన్ చేసిన కొమరగిరి క్రిష్ణ మోహన్ రావు ఉత్తరం

సెప్టెంబర్ 13, 1976 న తన భార్యకు లేఖరాస్తూ ప్రభుత్వ విధానాలను ఎండగట్టిన కొమరగిరి

ప్రజాస్వామ్యం ఉనికికే సవాలుగా నిలిచిన 1975 అత్యవసర పరిస్థితి (ఎమర్జెన్సీ) రోజుల్లో, దేశం నలుమూలలా నిశ్శబ్దం ఆవరించింది. భారత ప్రజాస్వామ్య చరిత్రలో అత్యంత నల్లదినంగా నిలిచిన ఎమర్జెన్సీ (1975 77) సమయంలో, అమాయకులైన ప్రజలు, రాజకీయ నాయకులు, సామాన్య కార్యకర్తలు, పత్రికాధిపతులు నిర్బంధించబడ్డారన్న సంగతి తెలిసిందే. అలాంటి వారిలో కొమరగిరి కృష్ణమోహన్ రావు ఒకరు. ఎమర్జెన్సీలో మొట్టమొదట అరెస్ట్ కాబడిన నాయకులలో ఒకరైన కృష్ణమోహన్ 19 నెలలపాటు మీసా (MISA) చట్టం కింద డిటెన్యూగా నిర్బంధంలో ఉన్నారు. ఎక్కడికక్కడ స్వరం వినిపించలేక, ప్రజలు భయంతో రోజులు గడిపిన సమయం, జైల్లో ఉన్న కృష్ణ మోహన్ రావు దేశంలో నెలకొన్న మౌనాన్ని తన లేఖ ద్వారా చెదరగొట్టాలనుకున్నారు, కానీ అధికారం ఆ లేఖను తొక్కిపెట్టింది. అదే రాజమండ్రి సెంట్రల్ జైలు నుంచి తన భార్య జయకు రాసిన రాజకీయ నిర్బంధితుడు, కోమరగిరి కృష్ణమోహన్ రావు గంభీరమైన లేఖ. ఇప్పుడు మీకోసం ట్రూ పాయింట్ అందిస్తున్న వివరాలు ఆయన రాసిన జైలు గోడల నుంచి తన భార్యకి, మరదలికి,కొడుకు చంద్రశేఖర్ కి రాసిన వందకు పైగా లేఖల్లో ఒకటి. వాటిలో ఆనాటి ప్రభుత్వం నిషేదించిన ఐదు లేఖలలో మొదటి లేఖలోని సమగ్ర సమాచారం. ఇందులో ఆయన తన వ్యక్తిగత వేదనతో పాటు దేశ ప్రజాస్వామ్య వ్యవస్థ పై పడిన నివురుగప్పిననిప్పును స్పష్టంగా వివరించారు కృష్ణమోహన్.

"ప్రియమైన జయ," అంటూ తన భార్యను సంబోధిస్తూ, ప్రారంభమైన ఈ లేఖ మొదటి నుంచే వేదనతో నిండి ఉంది. "ఈ స్వతంత్ర భారతంలో నీలాంటి నిర్భాగ్యులు కొన్ని వేల మంది భర్తలను, పుత్రులను దూరం చేసుకొని గత 14 నెలల నుండి అనేక యిక్కట్లననుభవిస్తూ మానసిక ఆందోళనలతో జీవనయాత్ర కొనసాగిస్తున్నారు" అని ఆయన ఆ లేఖలో పేర్కొన్నాడు. ఈ పదాల్లోనే అతని బాధ ఎంత లోతుగా ఉందో అర్థమవుతుంది. ఈ లేఖలో ముఖ్యంగా ఒక అంశం నిర్బంధితులైన నిర్దోషుల గురించి స్పష్టం చేస్తుంది. "ఏ నేరం చేయని వారిని జైల్లో పెట్టడం ఎలా న్యాయమవుతుంది? అని ప్రశ్నించడంతోపాటు, నిర్దోషులనూ, ప్రజాస్వామ్యాన్ని ప్రేమించే వారినీ మీసా చట్టం కింద నిర్బంధించడం అన్యాయం" అంటూ ఆనాటి ప్రభుత్వ దురుద్దేశాన్ని ఎండగట్టారు. "ప్రజలపై భయాన్ని కలిగించడం, ప్రజాస్వామ్యంపై బుదరజల్లడమే, ప్రభుత్వ చర్యల ఉద్దేశ్యం" అని ఆయన పేర్కొన్నారు.ఈ లేఖలో ప్రధానంగా ఆనాటి ప్రధాని ఇందిరా గాంధీ, అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు, కాంగ్రెస్ నాయకులు బ్రహ్మానందరెడ్డి, ఓం మెహతా వంటి నాయకుల పాత్రలపై తీవ్ర విమర్శలు గుప్పించారు. "జైళ్ళలో వున్నవారు ఎక్కువమంది స్మగ్లర్లే" అని ఓం మెహతా ప్రకటించడం, "మీసా కింద అరెస్ట్ అయిన వారు చాలా తక్కువ" అని బ్రహ్మానందరెడ్డి చెప్పడాన్ని ఆయన తన లేఖలో నిరసించారు. "ఎవరి మీద మీసా వేసారో చెప్పాల్సిన అవసరం లేదన్న నిబంధన వల్లే, వేల మంది అమాయకులు న్యాయస్థానాల ముందుకు వెళ్లే అవకాశాన్ని కోల్పోయారు" అని ఆనాటి పరిస్థితులని స్పష్టంగా బయట పెట్టే ప్రయత్నం చేశారు. ఇందిరా గాంధీ గురించి 'శ్రీమతి గాంధీ' అని పేర్కొంటూ, ఆమె చెప్పే "ఇరవై సూత్రాలు" దేశానికి కొత్తవేమీ కాదని, అవన్నీ ఇప్పటికే జనసంఘం వంటి ప్రతిపక్షాలు 20 ఏళ్లుగా చెబుతూనే ఉన్నాయని గుర్తు చేశాడు. అతని లేఖలో కనిపించే మరో ముఖ్యమైన అంశం ప్రస్తావిస్తూ "పత్రికలు మూయబడ్డాయి, అభిప్రాయాల వ్యక్తీకరణకు భంగం వాటిల్లింది. ప్రజాస్వామ్యం పేరుతో నియంతృత్వ పాలన కొనసాగుతోంది" అనే ఆవేదన వెలిబుచ్చారు. ప్రతిపక్షాలను లోంగదీసుకునే ప్రయత్నాన్ని ఎండగడుతూ, "ప్రజాస్వామ్యం అంటే మేం చెబితే వినాలి కాదు, ప్రజల ఆలోచనలకు విలువ ఇవ్వాలి" అని వాపోయాడు. ప్రతిపక్షాలు లేకపోతే ప్రజాస్వామ్యం ఎలా వృద్ధి చెందగలదు? అనే ప్రశ్నలు లేఖలో చాలా దృడంగా కనిపిస్తాయి. "విమర్శలను సహించలేని ప్రభుత్వానికి ప్రజాస్వామ్యం అంటే అర్థమే లేదు" అన్న వీరి వాదన నేటి పరిస్థితులకి కూడా సరిపోతుంది. కృష్ణ మోహన్ రావు ఈ లేఖలో అప్పటి కేంద్ర ప్రభుత్వ రాజ్యాంగ 44వ సవరణపై గంభీరమైన విశ్లేషణ చేశారు. "ఇది రాజ్యాంగ సవరణ కాదు - రాజ్యాంగాన్ని తిరగ రాయడమే" అని వ్యాఖ్యానించాడు. "ప్రజలు కోర్టుకు వెళ్లలేరు, న్యాయవ్యవస్థ హక్కులు తగ్గించబడ్డాయి, ప్రభుత్వ చర్యలపై ప్రశ్నించాల్సిన కోర్టులే శక్తి హీనంగా మారాయి" అన్న వాస్తవాలను ఉద్దేశపూర్వకంగా నిశితంగా వివరించాడు. "న్యాయస్థానాల మీద ప్రజల విశ్వాసాన్ని విచ్చిన్నం చేయడం, సుప్రీంకోర్టు హక్కుల్ని పరిమితం చేయడం, ఉద్యోగులకే ట్రిబ్యునల్స్ ద్వారా న్యాయం దూరం చేయడం" వంటి అంశాలు నాటీ భయానక పరిస్థితులని కళ్ళకు కడతాయి. అంతేగాక, కేంద్ర సాయుధ బలగాలను రాష్ట్రాల్లోకి పంపే అధికారాన్ని కేంద్రం పొందడాన్ని ఆయన తీవ్రంగా విమర్శించారు. "ఇది కేంద్ర నియంతృత్వాన్ని రాష్ట్రాలపై మొండిగా రుద్దే ప్రయత్నం" అన్న వ్యాఖ్యలు నేటికీ చర్చలకు దారితీసేలా ఉన్నాయి.కృష్ణ మోహన్ రావు రాసిన ఈ లేఖ, కేవలం భార్యకు రాసిన ప్రేమపూరిత ఉత్తరం కాదు. ఇది అధికారపక్షం పై విసిరిన ఘాటైన విమర్శల అస్త్రం.నాటి పరిస్థితులని ఏకరువుపెట్టి, ఆలోచింపజేసే ప్రయత్నం. ఇది రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని ప్రేమించిన ఓ నిజమైన దేశభక్తుని గుండె చప్పుడు అని చెప్పవచ్చు. "ప్రతి పౌరుడూ మాట్లాడే హక్కు కోసం పోరాడాలి, లేకపోతే ప్రజాస్వామ్యమే ప్రమాదంలో పడుతుంది" అని లేఖలో కృష్ణమోహన్ రావు రాసిన చివరి వాక్యాలు నేటికీ రాజకీయ చైతన్యం కలిగించేలా ఉన్నాయి. ఈ లేఖ ద్వారా ఆయన ఆనాటి దుర్భర పరిస్థితులని ప్రపంచానికి చేరువ చేయాలనే ప్రయత్నం స్పష్టంగా గోచరిస్తుంది. ఆ లేఖ బయటకు వెళితే ఎలాంటి విప్లవానికి నాంది పలుకుతుందో అన్న భయంతోనే ఆనాటి ప్రభుత్వం ఇలాంటి లక్షలాది లేఖలని తొక్కిపెట్టిందనడానికి ఈ లేఖ ఒక సాక్ష్యం. 50 ఏళ్లు నిండిన ఎమర్జెన్సీ నాటి చీకటి రోజుల్లో భయంతో నిశ్శబ్దంగా గడిచిన భారతీయులు మళ్ళీ ప్రజాస్వామ్యం విలువను గుర్తు చేసుకోవడంలో ఇలాంటి లేఖలు వేల కొద్దీ రాయబడ్డాయి. అవన్నీ నిషేదించబడ్డాయి. కొమరగిరి కృష్ణ మోహన్ రావు వంటి దేశభక్తులు రాసిన ఇలాంటి లేఖలు నేటికీ ప్రజాస్వామ్యాన్ని ఇష్టపడే ప్రతి వ్యక్తికీ ఒక స్ఫూర్తి, ప్రజాస్వామ్యానికి తూట్లు పొడిచే వారికి ఒక హెచ్చరిక, ప్రతి భారతీయునికీ ఈ లేఖల్లో సారాంశం ఒక విలువైన పాఠం. ప్రజాస్వామ్య యోధుడు, విలువల రచయిత కొమరగిరి కృష్ణమోహనరావు మచిలీపట్నం రామానాయుడుపేటకు చెందిన కొమరగిరి కృష్ణమోహనరావు (1936) ఆంధ్రప్రదేశ్ రాజకీయ, సాహిత్య, సామాజిక రంగాల్లో చిరస్మరణీయ స్థానం సంపాదించారు. శ్రీవాణి పత్రిక సంపాదకులుగా, ఆంధ్రప్రదేశ్ ట్యుటోరియల్స్ & కాన్వెంట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా, నైతిక మానవతా విలువల అధ్యయన కేంద్రం వ్యవస్థాపకులుగా ప్రజలలో చైతన్యం తీసుకువచ్చారు. వీరు భూమిశిస్తు సత్యాగ్రహం, విశాఖ ఉక్కు ఉద్యమం, జై ఆంధ్ర ఉద్యమం, జయప్రకాశ్ నారాయణ ఉద్యమం , లోక్ సత్తా ఉద్యమం వంటి అనేక ప్రజాహిత ఉద్యమాల్లో పాల్గొన్నారు. 1974, 1978లో జగ్గయ్యపేట శాసనసభ స్థానానికి పోటీచేశారు. జై ఆంధ్ర ఉద్యమంలో రెండు నెలలు, అత్యవసర పరిస్థితిలో 19 నెలల పాటు డిటెన్యూగా జైలు జీవితం గడిపారు.రచయితగా ఆయన బాలవిజ్ఞానకోశము, రామాయణ పాత్రలు, ప్రేమజ్యోతి, శ్రీ సత్యసాయి శతకము, సాయి చమత్కారవాణి, కొమరగిరి కారాగార లేఖలు, నైతిక విద్య ఆవశ్యకత వంటి అనేక పలు గ్రంథాలు రచించారు.




**ప్రజాస్వామ్యంపై దాడి జరిగిన చీకటి రోజు _ కొమరగిరి జయప్రద, విజయవాడ**


తన భర్త కొమరగిరి కృష్ణ మోహన్ తనకు రాసిన రాజకీయ లేఖలపై ట్రూ పాయింట్ తో కొమరగిరి జయప్రద మాట్లాడుతూ, అనాటి ఘటనని గుర్తుచేసుకుని చలించిపోయారు. ఆమె మాటల్లో.. జూన్ 26, 1975 ఉదయం 10:30 గంటలకు నందిగామలోని నెహ్రూ నగర్‌లో ఉన్న జ్యోతిభవన్ - వివేకానంద విద్యానికేతన్ ప్రాంగణానికి మఫ్టీలో ఉన్న పోలీసులు వచ్చి చుట్టుముట్టారు. తన మరిది ప్రశ్నిస్తున్నా సమాధానం చెప్పకుండా కొమరగిరి కృష్ణమోహన్ రావుని వాహనంలో ఎక్కించారని ఆమె తెలిపారు. అదే సమయంలో తన తండ్రి మరణించడం వల్ల తాను పుట్టింట్లో ఉన్నానని, అదే సమయంలో భర్త వచ్చి తాను పని మీద ఊరు వెళుతున్నానని తిరిగిరావడాంకి ఎంతకాలం పడుతుందో తెలీదని చెప్పారు, పూర్తి వివరాలు తన భర్త సోదరుడైన రామ మోహ్హన్ వివరంగా చెబుతాడని వెళ్ళిపోయారు అని ఆయన చెప్పిన మాటలు తనకు ఇప్పటికీ గుర్తున్నాయని ఆమె ఆవేదనతో చెప్పారు. ఆ తర్వాత రెండు రోజులకి కానీ తన భర్తని అరెస్ట్ చేశారని, విజయవాడ సబ్ జైల్లో ఉన్నట్లు తెలిసిందని, అతనికి బట్టలు తీసుకురమ్మన్నారని తెలిపారు. ఆ తర్వాత రాజకీయ ఖైదీగా రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారని తెలిసిందని, జనవరి 21, 1977 వరకు పెరోల్ రాకుండా జైలులోనే ఉన్నారని ఆమె గుర్తుచేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ లో మొట్టమొదట అరెస్ట్ అయిన ఆయనతో పాటు విజయవాడకు చెందిన లాయర్లు గొట్టిపాటి మురళీ మోహన్, ఎం.వి. రామమూర్తి, విజయవాడ మేయర్ శ్రీ ఐతా శ్రీ రాములు, గన్నవరం సమితి సభ్యుడు అట్లూరి శ్రీమన్నారాయణ, గుంటూరు ఎమ్మెల్సీ జూపూడి యజ్ఞనారాయణ వంటి నాయకులు ఉన్నారని ఆమె తెలిపారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు, నైతిక మానవతా విలువల ప్రచారానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయాలు. కృష్ణమోహన్ రావు వంటి నాయకుల పోరాట గాథ రాష్ట్ర ప్రజాస్వామ్య చరిత్రలో చిరస్థాయిగా నిలిచి ఉంటుంది. జూన్ 25ను గుర్తుచేసుకోవడం అంటే, ప్రజాస్వామ్య విలువలను గుర్తుచేసుకోవడమే కాదు, విలువల కోసం పోరాడిన అలాంటి మహాత్ముల త్యాగాలను గుర్తుచేసుకోవడం కూడా!










# ఎమర్జెన్సీకి దారితీసిన పరిస్థితులు..!

• **రాజమండ్రి మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్....**

జూన్ 25, 1975న భారతదేశంలో ఎమర్జెన్సీ విధించబడింది. ఈ సంవత్సరానికి యాభై ఏళ్ళు పూర్తయ్యాయి! నిజానికి 1962 నుండి 1968 వరకూ మన దేశంలో ఎమర్జెన్సీ విధించబడిన విషయం మనకెవ్వరికీ తెలీదు. చైనా యుద్ధం వల్ల ఆనాటి ప్రెసిడెంట్ సర్వేపల్లి రాధాకృష్ణన్ దేశంలో అత్యున్నత పరిస్థితిని విధించారు. అలాగే 1971 నుండి 77 వరకు బంగ్లాదేశ్ యుద్ధ సమయంలో వి.వి.గిరి గారు అత్యున్నత స్థితి విధించారు. అంటే ఇందిరాగాంధీ మొట్టమొదటి సారి ప్రమాణస్వీకారం చేసిన 1966లోనూ, రెండవసారి ప్రధానమైన 1971లోనూ మనదేశం అత్యవసర పరిస్థితుల్లోనే వుంది! అయితే ప్రజలమీద ఆ పరిస్థితి ప్రభావం లేదు!!

1975లో మొదటిసారి అంతర్గత ఎమర్జెన్సీ విధించబడింది. అత్యంత వివాదాస్పద నిర్ణయం తీసుకున్న ఇందిరా గాంధీ మీద ఆ 'మచ్చ' ఇప్పటికీ తొలగిపోలేదు. అయితే 1975 నాటి పరిస్థితులు, రాజకీయాలు ఒకసారి జ్ఞాపకం చేసుకుందామని, ఇప్పటి తరానికి తెలియజేద్దామని ఈ చిన్న ప్రయత్నం. ఇందిరా గాంధీ ఎమర్జెన్సీ విధించడానికి ముందు భారత దేశంలో రెండుసార్లు ఆరేసి ఏళ్ళ చొప్పున ఆత్యయిక పరిస్థితి కొనసాగుతోంది. అయితే ఇందిర పెట్టిన అత్యవసర పరిస్థితి మాత్రం తీవ్ర ప్రజా వ్యతిరేకతకు దారి తీసింది. అర్ధ శతాబ్ది గడిచినా ఇంకా ఆ నీలి నీడలు ఇందిరమ్మ వ్యక్తిత్వాన్ని వెంటాడుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యాన్ని తెలియజేసేదే ఈ వ్యాసం..

జవహర్ లాల్ నెహ్రూ కూతురు కాకుండా ప్రధానమంత్రి అంతరంగిక వ్యవహారాలన్నీ చక్కబెట్టే సలహా కూడా ఇందిరా కాంగ్రెస్ వారందరికీ చిరపరిచితురాలు. 1959లోనే కాంగ్రెస్ అధ్యక్షురాలుగా నియమింపబడి కేరళలో కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని రద్దు చేయటం, చైనాకు వ్యతిరేకమైనా లెక్క చేయకుండా టిబెట్ బౌద్ధ మతగురువు దలైలామాకు భారతదేశంలో ఆశ్రయం కల్పించడం వంటి కీలక నిర్ణయాలు తీసుకోవడంలో ప్రధానపాత్ర వహించారు. 1964లో తండ్రి నెహ్రూ ఆకస్మిక మరణాంతరం లాల్ బహదూర్ శాస్త్రి ప్రధాని బాధ్యతలు చేపట్టినప్పుడు, ఆయన అభ్యర్థన మేరకు ప్రభుత్వంలో మంత్రిగా చేరారు. మంత్రిగా ఉండాలంటే ఎం.పి.గా ఉండక తప్పదు కాబట్టి రాజ్యసభ సభ్యురాలయ్యారు. (నెహ్రూ కూతురైనా, అప్పటి వరకు ఆమె ఏ చట్టసభలోనూ సభ్యురాలు కాదు.)

1966లో శాస్త్రి గారి హఠాన్మరణంతో మళ్ళీ రాజకీయ నాయకత్వ శూన్యత ఏర్పడింది. మొరార్జీ దేశాయ్ ప్రధాని పదవికి అన్ని అర్హతలూ ఉన్న నాయకుడు! ఆయనతో వై.బి. చవాన్ పోటీపడొచ్చునని లేదా వారిద్దరికీ రాజీ చేయగలనని పరిశీలకుల అంచనా!!

శాస్త్రిగారి మరణ వార్త వినగానే హుటాహుటిన ఢిల్లీ చేరుకున్న మద్రాస్ ముఖ్యమంత్రి కామరాజ్ నాడార్ ఆలోచన వేరేవిధంగా ఉంది. నెహ్రూ గారి కూతురుగానే కాకుండా ఆయన ముఖ్య సహాయకురాలిగా ఇందిర ప్రపంచమంతా తిరిగిన మనిషి. ప్రధానిగా ఇందిరైతే వచ్చే ఏడు ఎన్నికల్లో కాంగ్రెస్ గెలవటం సులువవుతుందని కామరాజు అంచనా. అయితే ఆమె నెహ్రూ లాగే సోషలిజం వైపు మొగ్గు చూపుతుందని అందరికీ తెలుసు! అతుల్యఘోష్, ఎస్.కె. పాటిల్, మొరార్జీ దేశాయ్ వంటి నాయకులకు ఇందిర, నెహ్రూల సోషలిస్టు భావాల మీద సదభిప్రాయం లేదు. ప్రధాని పదవికి పోటీ తప్పని సరయ్యింది. దాంతో పార్లమెంట్ భవనంలో జరిగిన ఎన్నికలో ఇందిరకు 355, మొరార్జీకి 169 ఓట్లు వచ్చాయి. (ఉభయ సభలకు చెందిన కాంగ్రెస్ ఎంపీలందరూ ఈ ఓటింగ్‌లో ఉన్నారు.) 24.1.1966న ఇందిరాగాంధీ భారత ప్రధాని అయ్యారు. సోషలిస్టు భావాలున్న ఇందిరకు కేపిటలిస్ట్ భావజాలాన్ని బలపరిచే మొరార్జీ వంటి నాయకుల నుంచి అడుగడుగునా అవరోధాలు ఎదురవుతూనే వచ్చాయి. 1967 సార్వత్రిక ఎన్నికల్లో (అసెంబ్లీలకూ, పార్లమెంట్‌కు కలిసి జరిగిన ఆఖరి ఎన్నికలు) కాంగ్రెస్ పార్టీ గెలిచి ఇందిర ప్రధానిగా ఎన్నికైనా... ఫలితాలు కాంగ్రెస్ బలహీనత పడుతోందనే సంకేతాలు స్పష్టంగా పంపాయి. రాజగోపాలాచారి, ఎన్జీ రంగాల స్వతంత్ర పార్టీ 44 స్థానాలు గెలిచి ప్రధాన ప్రతిపక్షంగా నిలిచారు. గుజరాత్, మద్రాస్, ఒరిస్సా, రాజస్థాన్, వెస్ట్ బెంగాల్, కేరళ రాష్ట్రాల్లో కాంగ్రెస్ మెజార్టీ స్థానాలు గెలుచుకోలేకపోయింది. 1962లో నెహ్రూ నాయకత్వంలో 361 సీట్లు గెలిచిన కాంగ్రెస్ 1967లో ఇందిర నాయకత్వంలో 243 స్థానాలతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. అంటే 78 స్థానాలు కోల్పోయింది. నెహ్రూ ఇందిరల సొంత రాష్ట్రం, దేశంలో అతి పెద్ద రాష్ట్రం అయిన ఉత్తర ప్రదేశ్ అసెంబ్లీలో కూడా కాంగ్రెస్ 249 నుంచి 199 స్థానాలకు పడిపోయి అధికారం కోల్పోయింది. భారతీయ జనసంఘ్ (ఇప్పటి బి.జె.పి.), కమ్యూనిస్టులు, ఇంకా ఇతర కాంగ్రెస్ వ్యతిరేక పార్టీల మద్దతుతో చౌదరీ చరణ్ సింగ్ ముఖ్యమంత్రి అయ్యారు. నెహ్రూ కూతుర్ని ముందు పెట్టుకుని ఎన్నికలకి వెళ్తే కాంగ్రెస్ లాభపడుతుందన్న కామెరాజ్ ప్రయోగం ఫలించలేదు!

ఏదైనా సంపూర్ణ చికిత్స చేస్తే గానీ కాంగ్రెస్ నిలబడే అవకాశాలు కన్పించటం లేదు. ఆ సమయంలో ప్రధాని ఇందిర తన తండ్రి సంకల్పించి, అమలు చేయలేకపోయిన 'ఆవడి' కాంగ్రెస్ తీర్మానాలను దులిపి బైటకు తీసింది. ఉప ప్రధాని మొరార్జీ చేతుల్లో ఉన్న ఆర్థిక శాఖను తానే తీసేసుకుంది (ఫలితంగా మొరార్జీ ఉపప్రధాని పదవికి రాజీనామా చేశారు).

**వెంటనే బ్యాంకుల జాతీయకరణను ప్రకటించింది ఇందిరాగాంధీ.**

15.7.1969 నాటికి రూ.50 కోట్లు మించి డిపాజిట్లున్న 14 బ్యాంకులను ప్రభుత్వపరం చేస్తూ ఆర్డినెన్స్ జారీ అయింది. 'దారిద్ర్యం తొలగిద్దాం' గరీబీ హఠావో అనే నినాదంతో ఇందిరాగాంధీ సొంత ఎజెండాను అమలుచేయడం ప్రారంభించింది. కాంగ్రెస్ లో అంతర్గత విభేదాలు రచ్చకెక్కాయి. భారత రాష్ట్రపతి పదవికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నీలం సంజీవరెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. ఆయన నామినేషన్‌ను స్వయంగా ప్రధాని ఇందిర బలపరుస్తూ సంతకాలు కూడా చేశారు. అప్పటి ఉపరాష్ట్రపతి వి.వి.గిరి పోటీగా నామినేషన్ దాఖలు చేశారు. "రాజేంద్ర ప్రసాద్ సమయంలో ఉపరాష్ట్రపతిగా ఉన్న సర్వేపల్లి రాధాకృష్ణన్ రాష్ట్రపతి అయ్యారు.. సర్వేపల్లి సమయంలో ఉపరాష్ట్రపతిగా ఉన్న జాకీర్ హుస్సేన్ రాష్ట్రపతి అయ్యారు. అయ్యారు.. నా దగ్గరకొచ్చేసరికి ఎందుకు నన్ను తప్పిస్తున్నారు" అనేది ఆయన వాదన!

కాంగ్రెస్ వ్యతిరేక పక్షాలన్నీ సి.డి. దేశముఖ్ గార్ని నిలబెట్టాయి. ఈయన రిజర్వ్ బ్యాంకు గవర్నర్ గాను, నెహ్రూ క్యాబినెట్ లో మంత్రిగాను పని చేసిన వ్యక్తి (మన దుర్గాబాయమ్మ గారి భర్త).

మొరార్జీ, ఎస్.కె. పాటిల్, అతుల్యఘోష్ వంటి 'సిండికేట్' అని పిలవబడే సోషలిస్టు వ్యతిరేక నాయకులందరూ బలపరిచిన సంజీవరెడ్డి గెలిస్తే.. ఇందిర కథ ముగిసినట్లే! కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ప్రతిపాదించిన 'సంజీవరెడ్డిని ఓడించండి' అని పిలుపునిస్తే.. ప్రధాని పదవి నుంచి తప్పుకోవాలి: అలాగా కథ ముగిసినట్టే!! ఇందిరాగాంధీ సొంత మనుషులందరూ వి.వి.గిరికి ప్రచారం మొదలుపెట్టేశారు. మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి డి.పి. మిశ్రా. యంగ్ టర్క్స్ పిలవబడే చంద్రశేఖర్, మోహన్ ధారియా,... ఇందిరకు అండగా వి. వి. గిరినే బలపరుస్తున్నారు. కాంగ్రెస్ నిట్టనిలువునా చీలిపోయింది. ఆ సమయంలో కాంగ్రెస్ అధ్యక్షుడు నిజలింగప్ప చేసిన ఒక ప్రకటన ఇందిరకు వరమయ్యింది. సంజీవరెడ్డి ఓడిపోతారేమోనన్న

**భయంతో నిజలింగప్ప భారతీయ జనసంఘ్, స్వతంత్ర పార్టీల మద్దతు కోరడమే ఆ పెద్ద తప్పు!**

కాంగ్రెస్ విధానాలను ముందు నుంచీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్న 'జనసంఘ్' (ఇప్పటి భారతీయ జనతా పార్టీ) వంటి పార్టీల మద్దతు కోరటం ద్వారా కాంగ్రెస్ కాంగ్రెస్ పార్టీకి అధ్యక్షుడు నిజలింగప్ప పాత్ర ద్రోహం అని.. 'కాంగ్రెస్ వారంతా అంతరాత్మ ప్రబోధం ప్రకారం ఓటు వేయాలని...' ఇందిర బహిరంగంగా ప్రకటించింది. 20.08.1969న జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో వి.వి.గిరి అంత సులువుగా గెలవలేదు.. మొదటి లెక్కింపులో వి.వి.గిరికి నెగ్గటానికి కావల్సినన్ని ఓట్లు రాలేదు. రెండవ లెక్కింపులో వి.వి.గిరి గెలిచారు. అత్యంత ఉద్రిక్తతల నడుమ జరిగిన లెక్కింపు సమయంలో ఇందిరతో నున్న డి.పి. మిశ్రా తన ఆత్మకథలో ఇలా వ్రాసుకున్నారు. (డి.పి. మిశ్రా కుమారుడే వాజపేయి ప్రధానిగా ఉన్నప్పుడు ప్రిన్సిపాల్ సెక్రటరీగా పని చేసిన బ్రజేష్ మిశ్రా). "వి.వి.గిరి ఓడిపోతున్నారు... ఇప్పుడు నేనేం చెయ్యాలి" అని ఇందిర అడిగితే 'వెంటనే రాజీనామా చెయ్యాలి' అన్నారట మిశ్రా! రాజీనామా రాష్ట్రపతి కివ్వాలంటే రాష్ట్రపతి లేరు.. హుస్సేన్ మరణం వల్లనే ఈ ఎన్నిక.. సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ జాకి ఇవ్వాలన్న మాట...

అయితే మొదటి లెక్కింపులో నెగ్గకపోయినా ఆ తర్వాత లెక్కింపుల్లో పడ్డ రెండో ప్రాధాన్యతా ఓటుతో వి.వి.గిరి గెలిచారు. అయినా అక్కడితో ఇందిర అధికార కష్టాలు ఆగిపోలేదు. కాంగ్రెస్ ప్రాథమిక సభ్యత్వం నుంచి ఇందిరను సస్పెండ్ చేశారు. పార్లమెంట్‌లో కాంగ్రెస్ సభ్యులు 429 మంది (లోకసభ రాజ్యసభ కలిపి) 310 మంది ఇందిర వైపు నిలిచారు. అయినా లోక్ సభలో ఇందిర మెజార్టీ కోల్పోయింది. ఇందిరను ప్రధాని పదవి నుంచి వెంటనే దింపేయాలన్న విరోధుల ప్రయత్నాలు సి.పి.ఐ., డి.ఎమ్.కె. పార్టీలు, మరికొందరు ఇంటిపెండెంట్లు తీసుకున్న ఇందిరానుకూల నిర్ణయం వల్ల అమలు కాలేదు. ఇందిరాగాంధీ తెచ్చిన "బ్యాంకుల జాతీయకరణ" ఆర్డినెన్స్‌ను సుప్రీం కోర్టు కొట్టి వేసింది. రాజభరణాలు (ప్రీవీ పర్సులు) రద్దు చేస్తూ ఇందిర తీసుకున్న నిర్ణయం లోక్సభ ఆమోదించినా... రాజ్యసభలో పాస్ కాలేదు. మరోపక్క దేశాన్ని మిలటరీ స్వాధీనం చేసుకుంటుందన్న పుకార్లు బలంగా వ్యాపించాయి. 1970 డిసెంబర్‌లో ఇందిరా గాంధీ లోక్‌సభను రద్దుచేసి మధ్యంతర ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించింది. 'గరీబీ హఠావో' అంటూ ఇందిర... 'ఇందిర హఠావో' అంటూ వ్యతిరేకూలూ నినదించిన ఆ ఎన్నికల్లో 'ఆవుదూడ' గుర్తు మీద దేశవ్యాప్తంగా కాంగ్రెస్ (ఆర్) ఘనవిజయం ఉంది. ('ఆర్' అంటే రిక్విజిషన్) సొంత ఎజెండా, సొంత బలంతో ఇందిర ప్రధానిగా ఎన్నికైంది. స్వయంగా మూడొందల పబ్లిక్ మీటింగ్ మాట్లాడింది. 36,000 మైళ్ళు తిరిగింది. ర్యాలీలు, ఊరేగింపులు, బహిరంగ సభలూ అంతటా తానై నిలిచాయి. ఇందిరకు భారత ప్రజలు బ్రహ్మరథం పట్టారు. అధికారం కట్టబెట్టారు. బ్యాంకుల జాతీయకరణ, రాజభరణాల రద్దు, పేదలకు ఇళ్ల స్థలాలు, బ్యాంక్ లోన్లు, భూ పరిమితి చట్టం అమలు, లక్షలాది ఎకరాలు నిరుపేదలకు పంపిణీ.. మన శత్రుదేశం పాకిస్తాన్ నుండి విడగొట్టి 'బంగ్లాదేశ్' అనే ఒక దేశాన్ని ఏర్పాటు చేయటంలో ఇందిర ప్రధాన పాత్ర... ఇవన్నీ ఇందిరను జాతీయ అంతర్జాతీయ నాయకురాలుగా నిలబెట్టాయి. 1972లో జరిగిన వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో కూడా ఇందిర పేరు మార్మోగింది. నిరుపేదల మనస్సుల్లో ఇందిర 'ఇందిరమ్మ'గా అవతరించింది. అత్యంత ప్రసిద్ధ కలిగిన నాయకురాలుగా ఎదిగిపోయిన ఇందిరను ఎదుర్కోగలిగిన, దేశంలో ఆమెను మించి పేరు ప్రఖ్యాతులున్న నాయకులెవ్వరూ లేరు. 1974లో గుజరాత్‌లోని ఒక ఇంజనీరింగ్ కాలేజీలో హాస్టల్ మెస్ చార్జీల పెంపుదలను వ్యతిరేకిస్తూ ప్రారంభమైన విద్యార్థుల ఆందోళన.. అప్పటి గుజరాత్ ముఖ్యమంత్రి చిమన్ భాయ్ పటేల్ (కాంగ్రెస్) వ్యతిరేక ఉద్యమంగా నవనిర్మాణ ఆందోళనగా రూపాంతరం చెందింది. కాంగ్రెస్ వ్యతిరేక పార్టీలన్నీ ఉద్యమాన్ని తీవ్రతరం చేశాయి. పైకి ఈ ఉద్యమం చిమన్ భాయ్ పటేల్ కి వ్యతిరేకంగా జరుగుతున్నట్లు కనిపించడానికి వాస్తవంగా ఇది ఇందిరా గాంధీకి వ్యతిరేకంగా చేస్తున్న ఉద్యమమే. తరువాత జరిగిన సంఘటనలు ఈ మరింత బలపరిచాయి. సాక్షాత్తు జయప్రకాశ్ నారాయణ్ దిగడంతో.. దాని విలువ విపరీతంగా పెరిగింది. డెబ్బై ఏళ్ళ వయసున్న జయప్రకాశ్ సోషలిస్టు భావాలుగల స్వాతంత్ర్య సమరయోధుడు. విదేశాల్లో చదువుకున్న జయప్రకాశ్, నెహ్రూ గారికి అత్యంత సన్నిహితుడిగా గాంధీగారి ముఖ్య అనుచరుడిగా.. దేశమంతటికీ తెలిసిన వ్యక్తి.

1972లో చంబల్ లోయలోని బందిపోట్లతో సమాలోచనలు జరిపి వారి కష్టాలు తెల్సుకుని వారిని మంచి జీవితాల వైపు మళ్ళించిన జయప్రకాశ్ నారాయణ.. మరోసారి హీరోగా పతాక శీర్షికల్లో కొనియాడ! ఏనాడూ ఏ పదవీ ఆశించని ఈ గాంధేయ విప్లవకారుడు.. గుజరాత్ ఉద్యమంలోకి రావటంతో అతనికి కష్టాలు మొదలయ్యాయి!! మిగిలిన రాజకీయ వాదుల్ని చూసినట్లు ఆమె మచ్చలేని మహామనిషి జయప్రకాశం చూడలేదు కదా.. చిమన్ భాయ్ పటేల్ అవినీతికి వ్యతిరేకంగా గుజరాత్ నవనిర్మాణ సమితి ఆందోళన హింసాత్మకంగా మారటం, కఠినంగా వ్యవహరించడానికి వీల్లేకుండా జయప్రకాశ్ అందులో ముందుండటం.. వంటి కారణాల నేపథ్యంలో 1974 ఫిబ్రవరిలో చిమన్ భాయ్ పటేల్ ప్రభుత్వాన్ని రద్దుచేసి రాష్ట్రపతి పాలన ప్రవేశపెట్టారు ఇందిర! సంవత్సరం గడిచినా రాష్ట్రపతి పాలనే కొనసాగుతోంది. వెంటనే ఎన్నికలు జరిపించాలంటూ మొరార్జీ స్థాయి వ్యక్తి ఆమరణ దీక్ష చేపట్టడంతో ఇందిరకు మింగలేని పరిస్థితి.

జూన్ 1975లో గుజరాత్ ఎన్నికలు జరిగాయి. ముఖ్యమంత్రిగా తొలగించబడిన చిమన్ భాయ్ పటేల్ సొంతపార్టీ పెట్టుకుని పోటీ చేసి 12 సీట్లు గెలిచారు. కాంగ్రెస్(ఓ) ('ఓ' అంటే ఆర్గనైజేషన్) జనసంఘ్ భారతీయ లోక్ దళ్ సోషలిస్టు పార్టీలు కలిసి పోటీ చేసి 88 సీట్లు గెలిచాయి. 182 స్థానాలున్న గుజరాత్ అసెంబ్లీలో అధికారంలోకి రావాలంటే 92 సీట్లు గెలవాలి. కాంగ్రెస్(ఆర్) ఇందిరాగాంధీ 75 సీట్లు గెలిచింది. చివరికి.. ఏ చిమన్ భాయ్ పటేల్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా జయప్రకాశ్ నేతృత్వం వహించేంత వరకు ఉద్యమం నడిచిందో అదే చిమన్ భాయ్ పటేల్ 12 మద్దతుతో ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఉద్యమం చిమన్ భాయ్ పటేల్ మీద కాదు, ఇందిరాగాంధీ మీదేనని స్పష్టమైంది!! జయప్రకాశ్ నారాయణ్ ఈ ఉద్యమంలో దిగడంతో ఇందిరా వ్యతిరేక వర్గం వైపు బలం మొగ్గు చూపింది. ఈ ఉద్యమం ఎటువైపు దారితీసేదో ఊహించలేము కానీ మరో అనూహ్య సంఘటన దీన్ని అనుకోని మలుపు తిప్పింది. సరిగ్గా గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెల్లడవుతున్న జూన్ 12, 1975 నాడే... ఇందిర శిబిరంలో మరో బాంబు పేలింది. అలహాబాద్ హైకోర్టు రాయబరేలీ నుంచి లోక్‌సభకు ఎన్నికైన ఇందిరాగాంధీ ఎన్నిక చెల్లదని తీర్పిచ్చింది. ఆ ఎన్నికల్లో ఓటమి పాలైన రాజ్ నారాయణ్ పిటిషన్‌లో చేసిన ఆరోపణలపై విచారించిన జస్టిస్ ఇందిర సిన్హా రెండు కారణాల వల్ల ఎన్నిక చెల్లదన్నారు.

1. ప్రభుత్వోద్యోగి యశపాల్ కపూర్ ఉద్యోగానికి రాజీనామా ఆమోదించబడక ముందే ఇందిరాగాంధీ ఎన్నికలో పాల్గొన్నాడనీ.

2. ఇందిర ప్రసంగించిన వేదిక ఖర్చు, వేదికకు సప్లై చేసిన విద్యుత్ చార్జీలు ప్రభుత్వమే చెల్లించిందనీ....

మిగిలిన ఆరోపణలు ఓట్లు కొన్నారనీ, హెలికాప్టర్ ఖర్చు పెట్టారనీ, ఆవు దూడ గుర్తుతో సెంటిమెంట్ రెచ్చగొట్టారనీ.. ఈ ఆరోపణల కేసు అలహాబాదు కోర్టు కొట్టివేసింది ఇందిరాగాంధీని అనర్హురాలిగా తీర్చిస్తూ.. అప్పీలు చేసుకోవటానికి కోర్టు 20 రోజుల టైమిచ్చింది కూడా..! యావద్భారతంలో ప్రతిపక్షాలన్నీ నిరసనలు మొదలయ్యాయి. జయప్రకాశ్ నారాయణ్, మొరార్జీ వంటి అగ్రనాయకులు వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నానీ ఫాల్కీవాలా అత్యంత ప్రతిభావంతుడైన రాజ్యాంగ నిపుణుడు. ఇందిర అనర్హత చట్టం విరుద్ధమని సుప్రీంకోర్టులో ఇందిర తానే హాజరయ్యాడు. (సుప్రీంకోర్టు వేసవి సెలవుల్లో ఉంది. ఒక్క వెకేషన్ బెంచి మాత్రమే పని చేస్తోంది. అందుచేత అత్యవసరమైనా ఈ కేసు వెంటనే ఉంది. విచారించలేకపోయారు.) అప్పటిదాకా అలహాబాద్ తీర్పును 'స్టే' చెయ్యాలని నానీ ఫాల్కీవాలా బలంగా వాదించారు. న్యాయమూర్తి కృష్ణయ్యర్ కండిషనల్ 'స్టే' చేశారు.. ప్రధానమంత్రిగాను, పార్లమెంట్ సభ్యురాలిగాను కొనసాగిస్తానని.. అయితే లోకసభ సభ్యురాలిగా ఓటు వేసే హక్కు ఉండదనీ ఆదేశాలు ఇచ్చారు! అలహాబాద్ హైకోర్ట్ తీర్పు చెప్పిన పదిరోజులకి జూన్ 22న ఈ 'స్టే' రావటంతో పూర్తి తీర్పు ఇచ్చేవరకూ 'ఇందిరా గాంధీ ప్రధాన పదవికి ఇబ్బంది లేదు' అందరూ భావించినా... అలా జరగలేదు. ఢిల్లీ రామ్ లీల మైదానంలో జరిగిన బ్రహ్మాండమైన బహిరంగ సభలో జయప్రకాశ్ నారాయణ్ మాట్లాడారు. అర్హత కోల్పోయిన ప్రస్తుత ప్రభుత్వ ఉత్తర్వులను పాటించకూడదని మిలటరీ, పోలీసులకు సమర్పించారు. విద్యార్థులు కాలేజీలకు వెళ్ళడం మానేసి, మరో స్వాతంత్ర్య పోరాటంలోకి దూకాలన్నారు. మొరార్జీ దేశాయ్ గారు అయితే, ఒక విదేశీ జర్నలిస్టు 'ఒరియానా ఫాలసీ'తో ప్రత్యేకంగా మాట్లాడుతూ. "రేపట్నుంచి ఇందిరను ఇంట్లోంచి బైటకు రానివ్వం... రాజీనామా చేసేవరకూ ఇంట్లోకి బైటకు రాకపోకలు బంద్" అని ప్రకటించారు. ఇలా ప్రకటించిన వీరిద్దరూ ఛోటా నాయకులు కారు! ఇందిర కన్నా సీనియర్లు... పైగా ఆమె తండ్రి జవహర్ లాల్ నెహ్రూతో పని చేసిన దేశ నాయకులు!!.

25.06.1975 అర్ధరాత్రి, ఆర్టికల్ 352(1)ని అనుసరించి భారత అధ్యక్షుడు 'ఫక్రుద్దీన్ అలీ అహ్మద్' దేశంలో అత్యవసర పరిస్థితి అమలులోకి వచ్చింది. ఇందిరా ప్రెసిడెంట్‌కి వ్రాసిన అత్యవసర స్థితిని సిఫార్సు చేసిన ఉత్తరంలోనే క్యాబినెట్ నిర్ణయం తీసుకోకుండానే ఈ సిఫార్సు చేస్తున్నాను, ఆవిధంగా చేయడం బిజినెస్ రూల్స్ ప్రకారం రూల్ 12కి లోబడే చేస్తున్నానని ఆమె చెప్పింది. రేపు తెల్లవారగానే క్యాబినెట్ మీటింగ్ పెడ్తున్నానని కూడా ఆ లేఖలో ప్రస్తావించారు. ఆ విధంగా రాజ్యాంగానికి లోబడే అత్యవసర స్థితి ప్రకటించబడింది. 07.11.1975న సుప్రీంకోర్టు ఐదుగురు జడ్జిల బెంచ్ అలహాబాద్ తీర్పును కొట్టివేసింది (కానీ ఎమర్జెన్సీ ప్రకటించినందుకు నిరసనగా పాల్కీవాలా అభ్యర్థి తరపున వాదించలేదు). ఎమర్జెన్సీ ప్రకటించిన నెలపే... అంటే 230775న లోక్‌సభ ఎమర్జెన్సీ నిర్ణయాన్ని ఆమోదించింది. రెండు రోజుల చర్చ తర్వాత 336 మంది అనుకూలం గానూ, 59 మంది వ్యతిరేకం గానూ ఓటు చేశారు. ఇందిర 'ఎమర్జెన్సీ' ఉదంతం జరిగి యాభై ఏళ్ళు పూర్తయింది! ఇప్పటికీ అదొక చీకటి రాజ్యమని.. ఆమె ఒక నియంత అని, రాజ్యాంగాన్ని తుంగలో తొక్కిందనీ, ఆమె వ్యతిరేకులు అంటూనే ఉంటారు. రాజ్యాంగంలోంచే ఆర్టికల్ 352 తీయబడిందనీ, ఆ అధికరణం ప్రకారం ఎమెర్జెన్సీ ప్రకటించటం రాజ్యాంగ విరుద్ధమెలా అవుతుందనీ నాలాంటి వాళ్ళకనిపించినా... కాంగ్రెస్ పార్టీయే 'సారీ' చెప్పాక అది తప్పి అయివుంటుంది అనుకుని... ఇక మాట్లాడలేదు!

జూన్ 22న అలహాబాద్ హైకోర్టును సుప్రీంకోర్టు 'స్టే' చేసినా, జయప్రకాశ్ గారూ, మొరార్జీ గారూ ఇందిర రాజీనామా చేయాల్సిందేనని భీష్మించుకుని కూర్చోవటం.. దేశమంతా అల్లకల్లోలం అయిపోయేలా పోలీసులు, మిలట్రి, ప్రభుత్వదేశాలు పాటించవద్దనీ విదార్థులు కాలేజిల్లోంచి పోరాటంలోకి రావాలనీ' సాక్షాత్తు జయప్రకాశ్ స్థాయి నాయకుడు పిలుపివ్వటం.. ఏ రకంగా సమంజసమో నాకైతే అర్థంకాలేదు. 1976 మార్చిలోపు ఇందిర మళ్ళీ ఎన్నికల కెళ్ళే టైం వచ్చేస్తుంది. ఆర్నెల్ల సమయం మాత్రమే మిగిలింది ఇందిరకు. ఆర్నెల్లలో దేశ ఇందిర వ్యతిరేక ప్రచారం చేసుకునే అవకాశం ఉంది.. వెంటనే రాజీనామా చేయకపోతే 'ఇంట్లోంచి బైటకు రానివ్వం... పోలీసులు, మిలటరీ తిరగబడండి' అని అనవల్సిన అవసరమేంటో...!

యశపాల్ కపూర్ అనే 'ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ' తన రాజీనామాను ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియాకు జనవరి 13న పంపించాడు. 25171న ప్రెసిడెంట్ ఆమోద ముద్రపడింది. ఆ ఉత్తర్వుల్లోనే జనవరి 14 నుంచి అతను ఉద్యోగంలో లేడని స్పష్టంగా వుంది (విత్ రెట్రాస్పెక్టివ్ ఎఫెక్ట్). అయినా 25కి ముందే ఆయన ఇందిర తరపున పార్టీ మీటింగుల్లో పాల్గొన్నాడని ప్రధాని పదవి రద్దయిపోయింది. సుప్రీంకోర్టులో న్యాయమూర్తి కృష్ణయ్యర్ వంటి జడ్జి 'స్టే' ఇచ్చిన "లెక్క చేయం.. నువ్వు రాజీనామా చేయాల్సిందే" అనటం అంత పెద్ద నాయకుల స్థాయికి తగుతుందా!?


సరే.. ఎమర్జెన్సీ ఎత్తేయటం, ఎన్నికలకు పిలుపునివ్వటం, ఆ ఎన్నికల్లో ఇందిరా గాంధీ పార్టీ ఓడిపోవటం.. ఆవిడ కూడా ఎమ్.పి.గా గెలవలేకపోవటం.. నిశ్శబ్దంగా అధికార మార్పిడి జరిగిపోవటం.. ఈ చర్యలు కూడా ఆవిడ నియంత్రణలో భాగమేనా!?

1952 నుంచి ఇప్పటి వరకూ ఏ ఎన్నికల్లోనూ ఏ పార్టీ కూడా 50% ఓట్లు సంపాదించి గెలవలేదు. 1984లో ఇందిర హత్యానంతరం 404 లోక్‌సభ సీట్లు గెలిచినప్పుడు కూడా కాంగ్రెస్‌కు పోలైన ఓట్లు 50% లేవు. అలాంటిది.. ఒక 'స్టే' చెయ్యబడ్డ.. పూర్తిగా టెక్నికల్ అయిన కోర్టు తీర్పును అడ్డుపెట్టుకొని ప్రధాని గద్దె దిగాలంటే.. ఎలాంటి దృష్టాంతం (ప్రెసిడెంట్) ఏర్పడుతుంది!?

జయప్రకాష్ నారాయణలాంటి, నెహ్రూ ఇందిరల కన్నా ప్రముఖుడైన సోషలిస్టు, అమెరికా విస్కాన్సిన్ విశ్వవిద్యాలయంలో మార్క్సిజం గురించి అధ్యయనం చేసిన వామపక్షం మేధావి నాయకత్వంలో.. స్వతంత్ర, జనసంఘ వంటి క్యాపిటలిస్టు పార్టీలు నడుస్తూ, సోషలిస్టు ఇందిరను ఎలాగైనా దింపెయ్యాలి అనుకున్నప్పుడు... లొంగిపోవాలా! తిరగబడాలా!!

ఇందిరా గాంధీ తిరగబడింది.. పర్యావసానంగా ఎన్నికల్లో ఓడిపోయింది. పరస్పర విరుద్ధ సిద్ధాంతాలు కలిగిన వారందరూ రెండు ఏళ్ళలో ఏం పరిపాలన కలిసి చేశారో కూడా దేశం చూసింది..! 'ఇందిరాకో బులావో.. దేశ్ కో బదావో' (ఇందిరను పిలవండి దేశాన్ని కాపాడండి) అంటూ 1980లో మళ్లీ ఆమెనే పిలిచి ప్రధాన మంత్రిని చేశారు. (ఇప్పటికి 352 ఆర్టికల్ చిన్న సవరణతో అలాగే వుంది.

అంతర్గత అలజడులు (ఇంటర్నల్ డిస్టర్బెన్స్) కు బదులుగా సాయుధ తిరుగుబాటు (ఆర్మ్డ్ రిబిలియన్ అని సవరించారు.)





**ఉండవల్లి అరుణ కుమార్**
**రాజమండ్రి మాజీ ఎంపీ**
**తూర్పుగోదావరి జిల్లా..**



# నేడు ట్రంప్, జెలెన్ స్కీ భేటీ

- **ఉక్రెయిన్-రష్యా యుద్ధంపై చర్చలు**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ , ఉక్రెయిన్ ప్రెసిడెంట్ జెలెన్ స్కీ నేడు భేటీ కానున్నారు. నెదర్లాండ్స్‌లోని హేగ్ నగరంలో జరిగే నాటో శిఖరాగ్ర సమావేశం సందర్భంగా వీరిద్దరూ సమావేశం కానున్నారు. రష్యా ఉక్రెయిన్ యుద్ధంపై ఇరువురు నేతలు చర్చించనున్నట్టు తెలుస్తోంది. రష్యాపై మరిన్ని ఆంక్షలు సహా చమురు ధరలపైనా చర్చించనున్నట్టు సమాచారం. ఈ నెల 15 నుంచి 17 వరకు కెనడాలో జరిగిన జీ7 శిఖరాగ్ర సమావేశం సందర్భంగా జెలెన్ స్కీతో ట్రంప్ భేటీ కావాల్సి ఉంది. కానీ ఇరాన్ ఇజ్రాయెల్ వివాదం నేపథ్యంలో అనూహ్యంగా ట్రంప్ ముందస్తుగానే సమావేశం నుంచి వెళ్లి పోవడంతో మీటింగ్ రద్దు అయింది. ఈ క్రమంలోనే వీరు మరోసారి భేటీ కానుండటంపై ఆసక్తి నెలకొంది.



# ఉగ్రవాదంపై ఉక్కుపాదం:ప్రధాని మోదీ

ఉగ్రవాదంపై భారత్ కఠిన వైఖరి అవలంభిస్తుందని చెప్పారు ప్రధాని మోదీ. ఆపరేషన్ సిందూర్ తో ఈ విషయాన్ని ప్రపంచానికి చాటిచెప్పామని తెలిపారు. పాకిస్తాన్ తో ఘర్షణలో దేశీయంగా తయారు చేసిన ఆయుధాలు అద్భుత ఫలితాలు ఇచ్చాయన్నారు. భారత్ తన రక్షణ అవసరాలను తీర్చుకోవడానికి విదేశాలపై ఆదారపడటం తగ్గుతుందన్నారు. రక్షణ రంగం ఆత్మనిర్భర్ గా మారుతోందన్నారు. 22 నిమిషాల్లోనే శత్రుసైన్యం మోకరిల్లేలా చేసిందని చెప్పారు.



# ఆర్జేడీ అధ్యక్షుడిగా లాలూ 13వ సారి ఏకగ్రీవం

ఆర్జేడీ అధ్యక్షుడిగా లాలూ ప్రసాద్ యాదవ్ 13వ సారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పట్నాలోని RJD కార్యాలయంలో తేజస్వీ యాదవ్, రబ్రీ దేవి, మీసా భారతి, సీనియర్ నాయకుల సమక్షంలో లాలూ నామినేషన్ దాఖలు చేశారు. వేరే అభ్యర్థులు పోటీ చేయకపోవడంతో లాలూ ఎన్నిక కన్ఫామ్ అయ్యింది. లాలూ నాయకత్వం పార్టీకి బలమని, రానున్న బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలుస్తామని తేజస్వీ యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. 1997లో RJD స్థాపించినప్పటి నుంచి ఆ పార్టీకి లాలూ నాయకత్వం వహిస్తుండగా.. బీహార్‌లో OBCలు, దళితులు, ముస్లింల మద్దతుతో RJD బలమైన ప్రతిపక్షంగా ఉంది. 78 ఏళ్ల లాలూ ఆరోగ్య సమస్యలు ఉన్నప్పటికీ తన నాయకత్వం కొనసాగిస్తూ.. కుమారుడు తేజస్వీ యాదవ్ ముఖ్యమంత్రి అభ్యర్థిగా బీహార్ ఎన్నికలకు సిద్ధమవుతున్నారు.

# EPFO సభ్యులకు తీపి కబురు




EPFO సభ్యులకు కేంద్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ తెలిపింది. EPFO ఆటోసెటిల్మెంట్ లిమిట్‌ను రూ.1 లక్ష నుంచి రూ.5 లక్షలకు పెంచుతూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయంతో దాదాపు 7.5 కోట్ల EPFO సభ్యులకు లబ్ధి చేకూరనుంది. ఈ పెంపు వల్ల ఎక్కువ మంది సభ్యులు వేగంగా, ఎలాంటి ఇబ్బందులు లేకుండా సెటిల్మెంట్ పొందగలరు. ఎమర్జెన్సీ పరిస్థితుల్లో డబ్బు అవసరమైన వారికి ఇది ఎంతో ఉపయోగకరం. ఈ విషయాన్ని కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్సుఖ్ మాండవియా ఓ ప్రకటనలో తెలిపారు.

# రైల్వేశాఖ ఛార్జీలు పెంపు..!



పేదవాడి బండి రైలు. సుదూర ప్రాంతాలకు వెళ్లాలంటే ఎవరికైనా వెంటనే మెదడులో వచ్చే ఆలోచన రైలు మాత్రమే. ఏటా కోట్లాది మంది ప్రయాణికులను తమ గమ్యస్థానాలకు చేర్చుతుంది. ఇప్పుడు భారతీయ రైల్వే శాఖ ప్రయాణికులపై ఛార్జీల భారం మోపడానికి రెడీ అయ్యింది. కొన్నాళ్లుగా స్థిరంగా ఉన్న ప్రయాణీ ఛార్జీలను స్వల్పంగా పెంచుతున్నట్టు తెలిపింది. జూలై 1 నుంచి పెరిగిన ఛార్జీలు అమల్లోకి రానున్నాయి. దీంతో పాటు, తత్కాల్ టికెట్ బుకింగ్ విధానంలో కూడా భారతీయ రైల్వే కీలక మార్పులు చేసింది. ఇకపై తత్కాల్ టికెట్ల బుకింగ్‌కు ఆధార్ ప్రామాణీకం కానుంది.

# ఇరాన్ నుంచి అణు ముప్పు ముగిసిందా?

## ఈ యుద్ధంతో ఇజ్రాయెల్ , అమెరికా ఏం సాధించాయి?



ఇజ్రాయెల్ ఇరాన్ యుద్ధం ముగిసింది. దాదాపు 12 రోజులపాటు వార్ సాగింది. ఇరు దేశాలకు చెందిన మిస్సైల్స్, డ్రోన్స్ భారీ విధ్వంసం సృష్టించాయి. అసలు ఈ యుద్ధం యొక్క లక్ష్యం ఏమిటీ? కాల్పుల విరమణకు ముందు అది సాధించారా? యుద్ధంలో టెల్ అవీవ్ నుంచి టెహ్రాన్ వరకు వందల టన్నుల మందుగుండు సామగ్రిని తగలబెట్టిన తర్వాత, ఇరాన్ నుంచి ఇజ్రాయెల్‌కు అణు ముప్పు ఇప్పుడు ముగిసిందా? అంటే మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది.

**యుద్ధంలోకి అమెరికా ఎంట్రీతో..?**

అమెరికా యుద్ధంలోకి ప్రవేశించడంతో ఇరాన్ యొక్క మూడు ముఖ్యమైన అణు కేంద్రాలను లక్ష్యంగా చేసుకుని బంకర్ బస్టర్ బాంబులు దాడి చేసి పెను విధ్వంసం సృష్టించాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్ , ఇజ్రాయెల్ మధ్య కాల్పుల విరమణను ప్రకటించారు. అందరికీ అభినందనలు చెప్పారు. పశ్చిమాసియాలో శాంతి కోసం ప్రయత్నించాలని కోరారు. ఇరుదేశాలు సీజ్ ఫైర్ ను ఉల్లంఘించకూడదని హెచ్చరించారు.

**యుద్ధం లక్ష్యం ఏంటీ?**

ఇరాన్ఇజ్రాయెల్ యుద్ధాన్ని అమెరికా నిర్ణయించిందా? ఇరాన్ యొక్క మూడు అణు కేంద్రాలు అమెరికా లక్ష్యంగా ఉన్నాయా? అణు ఒప్పందంలో విఫలమైన అమెరికా పరిమిత యుద్ధాన్ని ప్రారంభించిందా? ఇరాన్ అణు సామర్థ్యం ఇప్పుడు ముగిసిందా? కాల్పుల విరమణ తర్వాత కొన్ని ప్రశ్నలు అలాగే మిగిలిపోయాయి. అన్నింటికంటే 12 రోజుల పాటు కొనసాగిన ఈ యుద్ధం యొక్క లక్ష్యం ఏమిటనేది ఎవరికీ అర్థంకాని చిక్కుముడిగా మిగిలిపోయింది.

కాల్పుల విరమణకు ముందు ఇజ్రాయెల్‌పై జరిగిన దాడుల్లో నలుగురు ప్రాణాలు కోల్పోవడం ద్వారా ఇరాన్ ప్రతీకారం నెరవేరిందా? యుద్ధంలో వెయ్యి మందికి పైగా ఇరాన్ పౌరులు చనిపోయారు. వందలాది మందికి తీవ్రగాయాలయ్యాయి. శక్తివంతమైన క్షిపణులతో భవనాలు నేలమట్టం అయ్యాయి. అమాయక ప్రజలు నిరాశ్రయులయ్యారు. ఇజ్రాయెల్ టార్గెట్ మాత్రం ఇరాన్ అగ్ర సైనిక కమాండర్లను, ప్రముఖ అణు శాస్త్రవేత్తలను చంపేయడమే. అది నెరవేరింది. ఇరాన్ యొక్క మూడు ప్రధాన అణు కేంద్రాలు, ఫోర్డో, నటాంజ్ ,ఇస్ఫహాన్, అమెరికా బాంబు దాడి కారణంగా భారీ నష్టాన్ని చవిచూశాయి. అధ్యక్షుడు ట్రంప్ ఈ యుద్ధంలో సాధించిన ఏకైక విజయం ఇదేనా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది.

**ఇరాన్ అణు సామర్థ్యం ముగిసినట్టేనా?**

ఇజ్రాయెల్‌ను ఇరాన్‌పై దాడి చేయించడం ద్వారా ట్రంప్ ఇరాన్‌ను అణు ఒప్పందం నిబంధనలకు అంగీకరించేలా చేయడంలో విఫలమయ్యారు. కానీ ట్రంప్ ప్రస్తుతానికి ఇరాన్ నుండి ఎదురయ్యే అణు ముప్పును నివారించగలనని ఖచ్చితంగా విశ్వసిస్తున్నాడు. ఇరాన్‌లోని మూడు అణు కేంద్రాలపై లక్షల కిలోల మందుగుండు సామగ్రిని వర్షంలా కురిపించడం ద్వారా, ఇరాన్ యొక్క అణు సామర్థ్యం ఇప్పుడు ముగిసిందని అమెరికా అంగీకరించింది. కానీ అమెరికా అపోహ వెనుక ఎటువంటి బలమైన ఆధారం లేనట్లు కనిపిస్తోంది.

**90శాతం యురేనియం ఏమైంది?**

అమెరికా దాడి తర్వాత ఇరానియన్ నిల్వల్లో ఉన్న 90 శాతం సుసంపన్న యురేనియం ఎక్కడికి వెళ్లిందో ఎవరికీ తెలియదు. ఇరాన్ యురేనియం శుద్ధి కర్మాగారాలకు జరిగిన నష్టం ఇంకా అంచనా వేయబడలేదు. అయినప్పటికీ ఇరాన్‌పై దాడి చేయడం ద్వారా అమెరికా ఖచ్చితంగా ప్రపంచంలో తన సంకల్పం ఇంకా ప్రబలంగా ఉందని నిరూపించుకుంది.

**యుద్ధంతో ఇజ్రాయెల్ ఏం సాధించింది?**

ఇరాన్ సంపాదించిన అణ్వాయుధ సామర్థ్యం ఇజ్రాయెల్ ఉనికికి ముప్పు అని నెతన్యాహు ఇరాన్‌పై దాడి చేశాడు. యుద్ధం ప్రారంభమైన మొదటి వారంలోనే ఇరాన్ అణు శాస్త్రవేత్తలు, ఉన్నత సైనిక అధికారులందరినీ చంపినట్లు ఇజ్రాయెల్ ప్రకటించింది. ఈ దాడుల్లో ఇరాన్ అణు సామర్థ్యాన్ని పెంచిన సూపర్ బ్రెయిన్‌లను చంపడం ద్వారా ఇజ్రాయెల్ గొప్ప విజయాన్ని సాధించిందని ఎంతో గర్వంగా చెప్పింది. దాడి జరిగిన మొదటి వారంలో 10 మంది ఇరానియన్ అణు శాస్త్రవేత్తలు మరణించగా, రెండో వారంలో మరో 7 మంది అణు శాస్త్రవేత్తలు మరణించారు. ఇది కాకుండా ఇజ్రాయెల్ యొక్క ఖచ్చితమైన వైమానిక దాడిలో ఇరాన్ సైన్యంలోని అనేక మంది అగ్ర సైనిక కమాండర్లు కూడా మరణించారు. ఇది ఈ యుద్ధంలో ఇజ్రాయెల్ సాధించిన విజయం.

**షరతులకు అంగీకరించని ఇరాన్**

ఈ యుద్ధం ఇరాన్‌లో ఖమేనీ శక్తిని పునరుద్ధరించింది. కాల్పుల విరమణ తర్వాత ఇరాన్ సాధించిన అతిపెద్ద విజయం ఏమిటంటే, ఖమేనీ ప్రభుత్వం అమెరికా, ఇజ్రాయెల్ యొక్క డబుల్ దాడి ముందు తలవంచడానికి నిరాకరించింది. ప్రపంచ సూపర్ పవర్ , సూపర్ డిస్ట్రాయర్ అమెరికా బహిరంగంగా యుద్ధంలో చేరినప్పటికీ, ఇరాన్ లొంగిపోలేదు. ఎటువంటి కండీషన్స్ అంగీకరించలేదు. ఇజ్రాయెల్ ఒంటరిగా దానిని నియంత్రించడం సాధ్యం కాదని ఇరాన్ తనను తాను తట్టుకోగలదు. దీని కారణంగా అమెరికా కూడా చివరికి యుద్ధంలోకి దూకాల్సి వచ్చింది.

**అణు కార్యక్రమం కొనసాగుతుంది**

ఈ యుద్ధం నుండి ఇరాన్ సాధించిన రెండవ అతిపెద్ద లాభం దాని అణు కార్యక్రమం. ఇది అన్ని దాడులు జరిగినప్పటికీ నిరంతరాయంగా కొనసాగుతుంది. ఇరాన్ పార్లమెంటరీ కమిటీ ఈ యుద్ధం తర్వాత ఇరాన్ అణు కార్యక్రమం గురించి ఇప్పటివరకు సమాచారాన్ని సేకరిస్తున్న అంతర్జాతీయ అణు ఇంధన సంస్థను మూసివేయాలని నిర్ణయించింది. ఇరాన్ అణు కార్యక్రమాన్ని ఐక్యరాజ్యసమితి తరపున పర్యవేక్షించడానికి IAEA చేసిన ప్రతిపాదనను తిరస్కరించిన జాతీయ భద్రతా కమిటీ బిల్లును ఇరాన్ పార్లమెంట్ ఆమోదించబోతోంది.

**దాడి జరగదని హామీ ఇవ్వకపోతే?**

భవిష్యత్తులో ఇరాన్ అణు కేంద్రాలపై ఎటువంటి దాడి జరగదని హామీ ఇవ్వకపోతే, ఇరాన్ IAE ని ఎటువంటి నిఘా చేయడానికి అనుమతించదని ఇరాన్ చెబుతోంది. ఎందుకంటే అన్ని సహకారాలు ఉన్నప్పటికీ, అమెరికా ఇరాన్ సార్వభౌమత్వాన్ని ఉల్లంఘించి దాని అణు కేంద్రాలపై దాడి చేసింది.

## లోపాలను గుర్తించిన డీజీసీఏ

అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై యావత్ భారత్ మాత్రమే కాదు ప్రపంచం మొత్తం ఒక్కసారిగా షాక్ కు గురైంది. విమాన ప్రమాదాల నివారణకు డీజీసీఏ కీలక నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా విమానయాన భద్రతపై దృష్టి సారించింది. ఇందులో భాగంగా నిర్వహించిన తనిఖీల్లో పలు ప్రధాన ఎయిర్ పోర్ట్స్ లో విమానయాన వ్యవస్థల్లో అనేక లోపాలు ఉన్నట్లు వెలుగులోకి రావడం కలకలం రేపుతోంది. విమానాలు, రన్‌వేలు సహా పలు కీలక విభాగాల్లో ఈ సమస్యలు ఉన్నాయని డీజీసీఏ తెలిపింది. డీజీసీఏ జాయింట్ డైరెక్టర్ జనరల్ నేతృత్వంలోని రెండు ప్రత్యేక బృందాలు ఇటీవల ఢిల్లీ, ముంబై వంటి దేశంలోని ప్రధాన విమానాశ్రయాల్లో సమగ్రమైన తనిఖీలు చేపట్టాయి. ఈ తనిఖీల్లో భాగంగా ఫ్లైట్ ఆపరేషన్స్, ర్యాంప్ సేఫ్టీ, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ వ్యవస్థలు, కమ్యూనికేషన్ అండ్ నేవిగేషన్ పరికరాలు, విమానం ఎక్కే ముందు సిబ్బందికి నిర్వహించే వైద్య పరీక్షలు వంటి అనేక కీలక అంశాలను నిశితంగా పరిశీలించినట్లు అధికారులు తెలిపారు.

# నామాటే ధిక్కరిస్తారా?:ట్రంప్

**కాల్పుల ఉల్లంఘలతో ఇరాన్-ఇజ్రాయెల్ పై ట్రంప్ ఆగ్రహం**



మూడో ప్రపంచ యుద్ధం వచ్చినంత పనిచేసింది. పశ్చిమాసియాలో పరిస్థితులు చూస్తే ఎవరికైనా అదే నిజమవుతుందని అనిపించింది. యుద్ధంలోకి అమెరికా ఎంట్రీ ఇవ్వడం..ఇరాన్ కు రష్యా, చైనా పరోక్షంగా మద్దతు ప్రకటించడంతో థర్డ్ వరల్డ్ వార్ కన్ఫామ్ అని అందరూ అనుకున్నారు. కానీ అగ్రరాజ్యం అధ్యక్షుడు చేసిన సంచలన ప్రకటన యావత్ ప్రపంచం హమ్మయ్యా అని ఊపిరిపీల్చుకుంది. ఇరాన్ఇజ్రాయెల్ సీజ్ ఫైర్ కు అంగీకరించాయని ట్రంప్ ట్వీట్ చేశారు. ఇంకేముంది మొన్నటి వరకు కొట్టుకున్న దేశాలు..ఇప్పుడు శాంతించాయని అనుకున్నారు. కానీ కాల్పుల విరమణ ఒప్పందం వెలువడిన కొన్ని గంటలకే మళ్లీ యథాస్థితికి చేరుకున్నాయి. ఇరు దేశాల నేతలు పరస్పరం ఆరోపించుకున్నాయి. సీజ్ ఫైర్ ను ఇరాన్ ఇజ్రాయెల్ ఉల్లంఘించడంతో ట్రంప్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఇజ్రాయెల్ తీరుపై అమెరికా ప్రెసిడెంట్ అసహనం వ్యక్తం చేశారు.

**ఇరాన్ పై దాడికి ఆదేశం**

కాల్పుల విరమణ ప్రకటన తర్వాత ఇరాన్‌లోని పరిపాలన కేంద్రాలపై దాడులు చేయాలని ఇజ్రాయెల్ రక్షణమంత్రి తమ సైన్యాన్ని ఆదేశించారు. టెహ్రాన్ నడిబొడ్డున ఉన్న పరిపాలన కేంద్రాలతోపాటు ఉగ్ర స్థావరాలపై విరుచుకుపడాలని ఆయన సూచించారు. ఇరాన్ దాడులతో ఉత్తర ఇజ్రాయెల్‌లోని పలు ప్రాంతాల్లో సైరన్లు మోగాయి.పేలుళ్లశబ్దాలు వినిపించినట్లు ఐడీఎఫ్ ప్రకటించింది. ఇరాన్ క్షిపణులను సమర్థవంతంగా అడ్డుకున్నామని తెలిపారు. ట్రంప్ మధ్యవర్తిత్వంతో యుద్ధ విరమణకు అంగీకరించినట్లు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ప్రకటన చేసిన తర్వాత ఇరాన్ వైపు క్షిపణులు దూసుకువచ్చినట్లు ఇజ్రాయెల్ ఆరోపించింది. అయితే ఇజ్రాయెల్ ఆరోపణలను ఇరాన్ తోసిపుచ్చింది. యుద్ధవిరమణ

**నా మాటంటే లెక్కలేదా?**

ఒప్పందం అమల్లోకి వచ్చిన తర్వాత ఇజ్రాయెల్‌పై దాడులు చేయలేదని తెలిపింది. ఇరాన్ఇజ్రాయెల్‌లు యుద్ధ విరమణను ఉల్లంఘించినట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తెలిపారు. ఇరుదేశాల తీరుపై మండిపడ్డారు. ఇరాన్‌తోపాటు ఇజ్రాయెల్ కూడా యుద్ధ విరమణను ఉల్లంఘించినట్లు ట్రంప్ తెలిపారు. వెంటనే పైలెట్లను వెనక్కి పిలవాలని ఇజ్రాయెల్‌కు ట్రంప్ సూచించారు.

# విమానాలు క్యాన్సిల్..ఎందుకో తెలుసా?



మిడిల్ ఈస్ట్ లో ఉద్రిక్తతలతో ఎయిర్ ఇండియాతో పాటు గల్ఫ్ ప్రాంతం నుంచి ప్రయాణించే ఇతర ఎయిర్‌లైన్స్ సంస్థలు కూడా తమ విమాన సర్వీసులను క్యాన్సిల్ చేసినట్టు సమాచారం. ఇప్పటికే బయలుదేరిన కొన్ని విమానాలను ఇతర మార్గాల్లోకి మళ్లించగా. అంతకుముందు కొచ్చి నుంచి ఖతార్‌లోని దోహాకు బయలుదేరిన ఎయిరిండియా విమానాన్ని మస్కట్‌కు దారి మళ్లించారు. పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో దుబాయి, దోహా, బహ్రెయిన్, దామమ్, అబుదాబీ, కువైట్ తిబ్లిసీ నుంచి రాకపోకలు సాగిస్తున్న విమానాలు ఇండిగో విమానాలపై ప్రభావం పడింది.

పలు విమానాలు క్యాన్సిల్ దోహాలోని అమెరికా వైమానిక స్థావరంపై దాడి తర్వాత భారత్‌ఖతార్ మధ్య 2 విమానాలు క్యాన్సిల్ అయ్యాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తత పరిస్థితుల కారణంగా పలు విమానయాన సంస్థలు తమ ఫ్లైట్స్ ను దారి మళ్లించాయి. భారత్ నుంచి ఖతార్ కు వెళ్లే రెండు విమానాలు ఇండిగో, ఎయిరిండియా రద్దు చేసింది. ఇండిగో విమానం ఢిల్లీ నుంచి ఖతార్ ప్రయాణించాల్సి ఉండగా..ఎయిరిండియా విమానం కొచ్చి నుంచి ఖతార్ బయల్దేరాల్సి ఉంది.

**ప్రయాణికుల ఇబ్బందులు**

విమానాల రద్దుతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దుబాయ్, ఖతార్ లో చిక్కుకున్న వారి పరిస్థితి మరింత దారుణంగా ఉంది. యూఎస్ నుంచి ఇతర ప్రాంతాలకు వయా దుబాయ్ వెళ్లే ఫ్లైట్స్ కూడా క్యాన్సిల్ అయినట్టు తెలుస్తోంది. కాల్పుల విరమణ ఒప్పందం కుదిరినా ఎప్పుడు దాడులు జరుగుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. అందుకే ఫ్లైట్స్ ను క్యాన్సిల్ చేయడమే బెటర్ అని విమానయాన సంస్థలు భావించినట్టు అయ్యింది. ఎలాంటి ఉద్రిక్తతలు లేని గగనతలం మీదుగా రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకుంటున్నట్టు చెబుతున్నారు అధికారులు. ప్రయాణికులు తమ విమానాలకు సంబంధించి స్టేటస్ ను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని సూచించింది. ఒకవేళ ఏదైనా ఫ్లైట్ అనుకున్న టైంకి బయల్దేరకపోతే..లేదా రద్దు చేస్తే తమ అధికార వెబ్ సైట్ లో వివరాలను పొందుపర్చాలని సూచిస్తున్నారు. ప్రయాణికుల భద్రతే తమకు ముఖ్యమని చెబుతున్నారు.




# జులైలో టెస్లా కార్లు

టెస్లా కార్లు భారత్ రోడ్డపై పరుగులు పెట్టేందుకు రెడీ అవుతున్నాయి. టెస్లా అధినేత ఎలాన్ మస్క్ ఇండియాలో కార్లను విక్రయించేందుకు రంగం సిద్ధం చేశారు. వచ్చే నెలలోనే ముంబయిలో షోరూమ్ ప్రారంభించనున్నట్లు బ్లూమ్‌బర్గ్ తెలిపింది. యూరప్, చైనా వ్యాప్తంగా ఈ కార్ల అమ్మకాలు ఇటీవల క్షీణించాయి. ట్రంప్ అధ్యక్ష పీఠాన్ని అధిరోహించనున్నారని తెలిసిన క్షణం నుంచి కొంత కాలంపాటు టెస్లా అమ్మకాలు జోరందుకున్నాయి. అయితే ఇటీవల ఇద్దరి మధ్య మాటల యుద్ధం ముదరడంతో అమ్మకాలు డీలా పడ్డాయి. దాంతోపాటు చైనాలోనూ టారిఫ్ భయాలతో టెస్లా అమ్మకాలు పడిపోయాయి. ఇలాంటి పరిస్థితుల్లో మస్క్‌కు భారత్ భారీ మార్కెట్‌గా భావించారు. ఇప్పటికే దేశంలో టెస్లా అమ్మకాలు ప్రారంభిస్తామని కంపెనీ ప్రకటించింది. యూరప్, చైనాల్లో అమ్మకాలు క్షీణించిన నేపథ్యంలో టెస్లా ప్రపంచంలోని మూడో అతిపెద్ద ఆటోమొబైల్ మార్కెట్ అయిన భారత్‌లో తన కార్యకలాపాలు విస్తరించడానికి ప్రయత్నిస్తోంది.



## ఆనంద్ మహీంద్రా ఫిట్ నెస్ సీక్రెట్ అదేనా?

దేశీయ పారిశ్రామిక దిగ్గజం ఆనంద్ మహీంద్రా 70 ఏళ్ల వయసులోనూ చాలా ఫిట్‌గా ఉంటారు. ఆయన హెల్త్ సీక్రెట్ తెలిస్తే షాక్ అవ్వాల్సిందే. వారానికొకసారి తన ఫిట్‌నెస్ షెడ్యూల్‌ను మార్చుకుంటూ ఉంటారు. సాధారణంగా ఈత, ఎలిప్టికల్ ట్రైనర్ వంటివి ఉపయోగించి కార్డియో వ్యాయామాలు చేస్తారు. వారంలో కొన్ని రోజులు కండరాలకు బలాన్నిచ్చే బరువులు ఎత్తే వ్యాయామాలు చేస్తుంటారు. ప్రతి రోజూ ధ్యానం చేస్తారు. ఉదయం కనీసం 20 నిమిషాలపాటు ధ్యానం చేయడం తనకు మానసిక స్పష్టత, ఆత్మవిశ్వాసాన్ని ఇస్తుందని ఓ ఇంటర్యూలో చెప్పారు. శరీరంతో పాటు మనసుకూ శాంతినివ్వగల ఈ ప్రాక్టీస్ వల్లే

# ఆరంభ లాభాలు.. హాం ఫట్!



టీపీఎన్ : దేశీయ స్టాక్ మార్కెట్లు నేడు మోస్తరుగా లాభపడ్డాయి. ఆరంభంలో అదరగొట్టినప్పటికీ ఆఖర్లో బేలా చూపులు చూశాయి. ఇరాన్‌ఇజ్రాయెల్ సీజ్‌ఫైర్ వార్తలే ఇందుకు కారణాలు. రెండు దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరందన్న వార్తలతో ఉదయం బెంచ్‌మార్క్, సెక్టోరల్ సూచీలు గ్యాప్‌డౌన్‌లో మొదలయ్యాయి. మధ్యాహ్నం వరకు గరిష్ఠ స్థాయుల్లో చలించాయి. అయితే సీజ్‌ఫైర్ తమకు అనుకూలంగా జరగలేదని ఇజ్రాయెల్ చెప్పడం, ప్రత్యర్థి దేశం మిసైళ్లు కురిపించిందని చెప్పడంతో సూచీలు ఒక్కసారిగా పతనమయ్యాయి. మొత్తంగా నిఫ్టీ 72, సెన్సెక్స్ 158 పాయింట్ల మేర లాభపడ్డాయి. అయితే నిఫ్టీ 25000 పైస్థాయిలో నిలదొక్కుకోవడం శుభసూచకం.

క్రితం సెషన్లో 81,896 వద్ద ముగిసిన బీఎస్‌ఈ సెన్సెక్స్ మంగళవారం 82,534 వద్ద మొదలైంది. 81,900 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని తాకింది. 83,018 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని అందుకుంది. చివరికి 158 పాయింట్ల లాభంతో 82,055 వద్ద ముగిసింది. 25,179 వద్ద ఓపెనైన ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 24,999 వద్ద కనిష్ఠ, 25,317 వద్ద గరిష్ఠ స్థాయుల్ని అందుకుంది. మొత్తంగా 72 పాయింట్లు పెరిగి 25,044 వద్ద క్లోజైంది. నిఫ్టీ బ్యాంకు 402 పాయింట్లు ఎగిసి 56,461 వద్ద స్థిరపడింది. నిఫ్టీ50లో 33 కంపెనీలు లాభపడగా 17 నష్టపోయాయి. అదానీ పోర్ట్స్, జియో ఫైనాన్స్, శ్రీరామ్ ఫైనాన్స్, గ్రాసిమ్, టాటా స్టీల్ టాప్ గెయినర్స్. ఓఎన్జీసీ, పవర్ గ్రిడ్, ఇండస్ ఇండ్ బ్యాంకు, ట్రెంట్, హెచ్‌సీఎల్ టెక్ అత్యధికంగా నష్టపోయాయి. నేడు పీఎస్‌యూ బ్యాంకు, మెటల్, ఫైనాన్స్, టెలికం, ప్రైవేటు బ్యాంకు, కన్జూమర్ డ్యురబుల్స్, ఆటో, హెల్త్‌కేర్, ఎఫ్ఎంసీజీ, ఫార్మా సూచీలు ఎగిశాయి. మీడియా, చమురు సూచీలు విలవిల్లాడాయి.

ఎన్‌ఎస్‌ఈలో నేడు మార్కెట్ బ్రెడ్త్ బయ్యర్లకు అనుకూలంగా మారింది. 2976 స్టాక్స్ ట్రేడవ్వగా 1966 లాభపడ్డాయి. 917 నష్టపోయాయి. 52వారాల గరిష్ఠాన్ని 44 షేర్లు, 52వారాల కనిష్ఠాన్ని 31 షేర్లు అందుకున్నాయి. అప్పర్ సర్క్యూటును 111, లోయర్ సర్క్యూటును 53 తాకాయి.


భారతీయ రైల్వే ఛార్జీలను పెంచుతారన్న వార్తలు వస్తున్నాయి. నాన్ ఏసీ మెయిల్, ఎక్స్‌ప్రెస్‌కు కిలోమీటరుకు ఒక పైసా, ఏసీ అయితే రెండు పైసల వరకు పెరుగుదల ఉండొచ్చని అంచనా. డాలరుతో పోలిస్తే రూపాయి ఒకశాతం మేర ఎగిసి 85.93 వద్ద స్థిరపడింది. మిడ్‌క్యాప్ షేర్ల వర్గీకరణ చేపట్టాలని మ్యూచువల్ ఫండ్స్ కోరుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం 1520 రోజుల్లో రేర్ ఎర్త్ మెటల్స్ వెలికితీత సబ్సిడీ పథకంపై నిర్ణయం తీసుకుంటుందని కేంద్ర మంత్రి కుమారస్వామి తెలిపారు. బజాజ్ కన్జూమర్ షేర్లు నేడు 20% ఎగిశాయి. ముడిచమురు ధరలు తగ్గడంతో ఇండిగో, స్పైస్ జెట్ షేర్ల ధరలు 4% మేర ఎగిశాయి. వెస్ట్ ఏషియా యుద్ధంతో లాజిస్టిక్స్, ఎనర్జీ రంగాలు కుదుపునకు లోనయ్యాయని గౌతమ్ అదానీ తెలిపారు. తొలిరోజు మధ్యాహ్నానికి గ్లోబ్ సివిల్ ప్రాజెక్ట్స్ ఐపీవోకు 4 రెట్ల స్పందన లభించింది.

**మూర్తి నాయుడు పాదం**
**నిఫ్ట్ మాస్టర్**
**స్టాక్ మార్కెట్ అనలిస్ట్**
**+91 988 555 9709**



# భారత్ లో తగ్గిన విదేశీ కార్ల జోరు

భారత్ లో యూరప్ కారు జోరు తగ్గింది. ఇటీవల భారత్ లో విదేశీ కార్ల అమ్మకాలు మందగించినట్టు తెలుస్తోంది. అందుకే వాహనాల అమ్మకాలను పెంచుకోవడంపై అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. గత మూడేళ్లుగా రెనాల్ట్ , ఫోక్స్ వేగన్, స్కోడా కార్ల అమ్మకాలు క్షీణిస్తూ వస్తున్నాయి. గ్లోబల్ ఆటోమోటివ్ పరిశ్రమ డేటా, అనలిటిక్స్ అందించే జాటో డైనమిక్స్ గణాంకాల ప్రకారం రెనాల్ట్ అమ్మకాలు బాగా తగ్గినట్టు చూపిస్తున్నాయి.



## పెరిగిన స్మార్ట్ ఫోన్ల వినియోగం

ప్రస్తుతం ఫోన్ మనకు నిత్యావసర వస్తువు అయ్యింది. ఒక్క పూట భోజనం చేయకపోయినా ఫర్వాలేదు కానీ.. చేతిలో ఫోన్ లేకుండా ఉండలేకపోతున్నారు. సెల్ ఫోన్ మానవ జీవితంలో ఒక భాగమైపోయింది. ప్రస్తుతం మార్కెట్‌లో తక్కువ ధరకే స్మార్ట్ ఫోన్లు లభించడంతో వాటి వినియోగం గణనీయంగా పెరిగింది. ద్వితీయ, తృతీయ పట్టణాలు, పల్లెల్లోనూ స్మార్ట్ ఫోన్ల వినియోగం పెరిగిందని అంతర్జాతీయ సెమీ కండక్టర్ దిగ్గజం మీడియా టెక్ ఇండియా ఎండీ అంకు జైన్ తెలిపారు. 5 జీ సేవల విస్తరణ , స్మార్ట్ ఫోన్లు తక్కువ ధరకే లభించడంతో వినియోగం పెరిగిందని తెలిపారు. స్మార్ట్ ఫోన్లు, స్మార్ట్ ఉపకరణాలకు ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాలు, టెక్నాలజీ రంగం, యువత వృద్ధి చోదకాలుగా మారతాయని చెప్పారు జైన్.




## దేశంలో తొలి హైడ్రోజన్ ప్లాంట్

దేశంలో తొలి హైడ్రోజన్ ప్లాంట్ ను ప్రారంభించారు ప్రముఖ వ్యాపారవేత్త గౌతమ్ అదానీ . భారత్‌లోనే తొలి ఆఫ్ గ్రిడ్ 5 మెగావాట్ గ్రీన్ హైడ్రోజన్ పైలట్ ప్లాంట్ ను గుజరాత్ లోని కచ్ లో ప్రారంభమైంది. ఈ ప్లాంట్ లక్ష్యం ప్రధానంగా సోలార్, విడ్ వంటి పునరుత్పాదక వనరుల ద్వారా నీటిని ఎలక్ట్రోలైసిస్ ప్రక్రియ ద్వారా విభజించి హైడ్రోజన్ ను ఉత్పత్తి చేస్తారు. దీని కోసం అదానీ గ్రూప్ తన సొంత పునరుత్పాదక ప్లాంట్ ను ఉపయోగించనుంది. గ్రీన్ హైడ్రోజన్ కోసం ఏర్పాటు చేసిన అత్యాధునిక ప్లాంట్ సౌరశక్తితో 100శాతం గ్రీన్ పవర్డ్ , బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ తో అనుసంధానం చేశారు. ఇది పూర్తిగా ఆప్ గ్రిడ్ లో పనిచేస్తుంది. దేశీయ అవసరాల కోసం దిగుమతులపై ఆధారపడకుండా ఉండేందుకు కేంద్రం ప్రారంభించిన గ్రీన్ హైడ్రోజన్ మిషన్ ను, గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తికి హబ్ గా భారత్‌ను నిలపాలనే లక్ష్యానికి అదానీ గ్రూప్ తనవంతుగా సహకారం అందిస్తుందని సంస్థ తెలిపింది.



# ఎంపీతో రింకూ సింగ్ పెళ్లి వాయిదా

భారత క్రికెటర్ రింగూ సింగ్.. సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ ప్రియా సరోజ్.. రీసెంట్ గా నిశ్చితార్థం చేసుకున్న విషయం అందరికీ తెలిసిందే. అయితే ఆ ఇద్దరి పెళ్లి నవంబర్ 19వ తేదీన జరగాల్సి ఉంది. కానీ ఆ పెళ్లి వాయిదా పడినట్లు తెలుస్తోంది. ఇటీవల లక్నోలో చాలా గ్రాండ్‌గా ఎంగేజ్మెంట్ సెర్మనీ జరిగింది. ఆ వేడుకకు మాజీ సీఎం అఖిలేశ్ యాదవ్, నటి జయా బచ్చన్, భువనేశ్వర్ లాంటి ప్రముఖులు హాజరయ్యారు. నవంబర్‌లో క్రికెట్ షెడ్యూల్ బిజీగా ఉన్న కారణంగా.. రింకూ తన పెళ్లిని వాయిదా వేసుకున్నట్లు తెలుస్తోంది.
వీరిద్దరికీ చెందిన కుటుంబాలు ఆ వాయిదాకు అంగీకారం తెలిపినట్లు తెలుస్తోంది. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో రింకూ, సరోజ్ పెళ్లి జరిగే అవకాశాలు ఉన్నాయి. తుది తేదీని త్వరలో అనౌన్స్ చేయనున్నారు. పెళ్లి కోసం వారణాసిలోని తాజ్ హోటల్ ను మొదట బుక్ చేసుకున్నారు. కానీ క్రికెట్ కమిట్ మెంట్ వల్ల ఆ పెళ్లి వాయిదా వేసుకోవాల్సి వస్తోంది. ఆ హోటల్ ను ఇప్పుడు ఫిబ్రవరి చివరి నాటికి బుక్ చేసుకున్నారు. జూన్ 8వ తేదీన ఇద్దరి మధ్య రింగ్ సెర్మనీ జరిగింది. టీ20 స్పెషలిస్టు రింకూ.. ఐపీఎల్‌లో కేకేఆర్‌కు ఆడుతాడు. ప్రియా సరోజ్ .. ఎస్పీ టికెట్‌పై మచిలీషహర్ నుంచి గెలుపొందారు.




# రిషభ్ పంత్.. ఒకే ఒక్కడు!

హెడింగ్లీ వేదికగా ఇంగ్లాండ్, టీమిండియా మధ్య జరుగుతున్న టెస్ట్ మ్యాచ్‌లో భారత వికెట్ కీపర్ రిషభ్ పంత్ హిస్టరీ క్రియేట్ చేశారు. మొదటి, రెండో ఇన్నింగ్స్‌ల్లో సెంచరీలు సాధించాడు. ఇలా ఒక టెస్ట్ మ్యాచ్‌లో రెండు సెంచరీలు సాధించిన మొదటి భారత వికెట్ కీపర్‌గా, ప్రపంచంలో రెండో వికెట్ కీపర్‌గా నిలిచాడు. లీడ్స్ టెస్ట్‌లో నాలుగో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన రిషభ్ పంత్.. ఫస్ట్ ఇన్నింగ్స్‌లో 178 బంతుల్లో 75.28 స్ట్రైక్‌రేట్‌తో 134 పరుగులు సాధించాడు. ఇందులో 12 ఫోర్లు, 6 సిక్స్‌లు ఉన్నాయి. రెండో ఇన్నింగ్స్‌లో 140 బంతుల్లో 84.29 స్ట్రైక్‌రేట్‌తో 118రన్స్ చేశాడు. ఇందులో 15 ఫోర్లు, 3 సిక్స్‌లున్నాయి. ఇలా ఒకే టెస్ట్ మ్యాచ్‌లో రెండు ఇన్నింగ్స్‌ల్లో రెండు సెంచరీలు.. వికెట్ కీపర్ విభాగంలో పంత్‌కంటే ముందు కేవలం ఆండీ ఫ్లవర్ మాత్రమే చేశాడు. ఈ జింబాబ్వే ఆటగాడు 2001లో హరారే వేదికగా దక్షిణాఫ్రికాపై ఆడిన ఓ టెస్ట్ మ్యాచ్‌లో మొదటి ఇన్నింగ్స్‌లో 142 రన్స్ సాధించాడు. రెండో ఇన్నింగ్స్‌లో 199 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. భారత బ్యాటర్లలో సునీల్ గవాస్కర్ మూడు సార్లు, రాహుల్ ద్రవిడ్ రెండు సార్లు ఈ ఫీట్ సాధించారు. ఇక పంత్‌కంటే ముందు దక్షిణాఫ్రికా మీద 2019లో రోహిత్ శర్మ, 2015లో అజింక్య రహానే, 2014లో ఆస్ట్రేలియా మీద విరాట్ కోహ్లీ ఇలా ఒకే మ్యాచ్‌లో రెండు సెంచరీలు చేశారు. మొత్తంగా భారత బ్యాటర్ల జాబితాలో ఏడో వ్యక్తిగా పంత్ స్థానం సంపాదించుకున్నాడు.

# సెప్టెంబర్‌లో నాలుగో సీజన్ వేలం

ఐపీఎల్ తర్వాత క్రికెటర్లపై కోట్లు కుమ్మరించే దక్షిణాఫ్రికా టీ20 లీగ్ నాలుగో సీజన్ వేలానికి సర్వం సిద్ధం చేస్తున్నారు. సెప్టెంబర్ 9న మెగా వేలానికి భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు నిర్వాహకులు. ఆక్షన్‌కు టైమ్ దగ్గర పడడంతో ఫ్రాంచైజీల కీలక అప్‌డేట్ ఇచ్చారు. ఈసారి ఒక్కో జట్టు ఆరుగురుని మాత్రమే అట్టిపెట్టుకునేందుకు అవకాశం కల్పించారు. ఈ టోర్నీ చరిత్రలో ఇంత తక్కువ మందిని రిటైన్ చేసుకోవాలని సూచించడం ఇదే ఫస్ట్ టైమ్.ప్రతి జట్టు ఆరుగురిని మాత్రమే కొనసాగించనున్న నేపథ్యంలోఈ సారి 72 స్లాట్స్ కోసం వేలం జరగనుంది. అంతేకాదు రైట్ టు మ్యాచ్ విధానాన్ని కూడా వినియోగించుకోవచ్చు. మూడో సీజన్‌లో తమకు ఆడిన క్రికెటర్ కోసం ఈ ఫార్ములాను వాడుకునే వీలుంది. అయితే.. వేలంలో సఫారీ ప్రతి ఫ్రాంచైజీలో 11 మంది సఫారీ ఆటగాళ్లు, ఏడుగురు విదేశీ క్రికెటర్లు.. ఉండేలా చూసుకోవాలని ఎస్ఏ20 నిర్వాహకులు తెలిపారు. అంతేకాదు వీళ్లలో అండర్ 23 ఆటగాళ్లు కనీసం ఇద్దరు ఉండాలనే నియయం విధించారు.ఐపీఎల్‌లో ఆడుతున్న ఆరుజట్లకు ఎస్ఏ20లో సిస్టర్ ఫ్రాంచైజీలు ఉన్నాయి.









# ట్రోలింగ్.. ఆ ఇద్దరిని భారత జట్టు నుంచి తీసేయండి

ఇంగ్లాండ్‌తో హెడింగ్లీ వేదికగా జరిగిన ఫస్ట్ టెస్టులో భారత పేస్ బౌలర్లు ప్రసిద్ధ్ కృష్ణ, శార్దూల్ ఠాకూర్ తమ డల్ గా సాగిన ప్రజంటేషన్ తో నిరాశపరిచారు. కీలక సమయంలో పరుగులు కంట్రోల్ చేయడంలో, వికెట్లు తీయడంలో ఘోరంగా విఫలమవ్వడంతో, భారత క్రికెట్ అభిమానుల నుంచి తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్నారు. వీరిద్దరి ప్రదర్శనపై సోషల్ మీడియాలో ట్రోల్స్, మీమ్స్ ట్రోల్ అవుతున్నాయి. ఫస్ట్ ఇన్నింగ్స్‌లో భారత్ 471 పరుగుల భారీ స్కోరు చేయగా, ఇంగ్లాండ్ 465 పరుగులకు ఆలౌటైంది. అయితే, ఈ ఇన్నింగ్స్‌లో భారత బౌలర్ల వైఫల్యం స్పష్టంగా కనిపించింది. ముఖ్యంగా ప్రసిద్ధ్ కృష్ణ, శార్దూల్ ఠాకూర్ ధారాళంగా పరుగులు సమర్పించుకున్నారు. కర్ణాటక పేసర్ ప్రసిద్ధ్ కృష్ణ తొలి ఇన్నింగ్స్‌లో 20 ఓవర్లు బౌలింగ్ చేసి 3 వికెట్లు పడగొట్టినప్పటికీ, ఏకంగా 128 పరుగులు ఇచ్చాడు. అతని ఎకానమీ రేటు 6.40గా నమోదైంది. ఇది టెస్ట్ క్రికెట్‌లో అత్యంత తక్కువ కౌంటింగ్ లో ఒకటిగా నిలిచింది. ఇక రెండో ఇన్నింగ్స్‌లోనూ ప్రసిద్ధ్ తన ఫెయిల్యూర్ ను కంటిన్యూ చేశారు. 6 ఓవర్లు వేసి వికెట్ తీయకుండా 38 పరుగులు ఇచ్చాడు. అతని ఎకానమీ 6.33గా ఉంది.మరోవైపు, పేస్ ఆల్‌రౌండర్‌గా టీమ్ లోకి వచ్చిన లార్డ్శార్దూల్ ఠాకూర్ బంతితో పాటు బ్యాట్‌తోనూ ఫెయిల్ అయ్యారు. ఫస్ట్ ఇన్నింగ్స్‌లో కెప్టెన్ అతనికి కేవలం 6 ఓవర్లు మాత్రమే ఇచ్చాడు. అందులో శార్దూల్ వికెట్ తీయకుండా 38 పరుగులు సమర్పించుకున్నాడు. రెండో ఇన్నింగ్స్‌లో అయితే పరిస్థితి మరింత దారుణంగా మారింది. కేవలం 3 ఓవర్లు వేసి 17 పరుగులు ఇచ్చాడు. రెండు ఇన్నింగ్స్‌లలోనూ ఒక్క వికెట్ కూడా పడగొట్టలేకపోయాడు.ఈ క్రమంలో ఇద్దరు బౌలర్లు ఓవర్లకి సగటున 6కు పైగా పరుగులు ఇవ్వడం అభిమానులకు తీవ్ర ఆగ్రహం తెప్పించింది. టెస్ట్ మ్యాచ్‌లో ఈ స్థాయిలో పరుగులు ఇవ్వడం జట్టు విజయావకాశాలను దెబ్బతీస్తుందని వారు విమర్శించారు.శార్దూల్ రెండు ఇన్నింగ్స్‌లలో ఒక్క వికెట్ కూడా తీయలేకపోయాడు.ప్రసిద్ధ్ కృష్ణరెండో ఇన్నింగ్స్‌లో చేతులెత్తేశాడు. కీలక భాగస్వామ్యాలను విడదీయడంలో వీరిద్దరూ విఫలమయ్యారు.ఈ కారణాలతో భారత క్రికెట్ అభిమానులు సోషల్ మీడియాలో ప్రసిద్ధ్ కృష్ణ, శార్దూల్ ఠాకూర్‌లను లక్ష్యంగా చేసుకుని విపరీతంగా ట్రోల్ చేస్తున్నారు.

# లీడ్స్ టెస్ట్‌లో ఫలితం కన్ఫార్మ్: కేఎల్ రాహుల్

హెడింగ్లీ వేదికగా ఇంగ్లాండ్, టీమిండియాటీమ్స్ మధ్య ఫస్ట్ టెస్ట్ మ్యాచ్ జరుగుతోంది. ఈ పోరు దాదాపు ఫైనల్ కు చేరుకుంది. ఈ మ్యాచ్‌లో ఖచ్చితంగా ఫలితం తేలుతుందని నాలుగో రోజు ఆట ముగిసిన తర్వాత కేఎల్ రాహుల్ అన్నాడు. అలాగే జట్టులో తనకు విభిన్న బాధ్యతలు, పాత్రలు ఇవ్వడం సంతోషంగా ఉందన్నాడు. తనకు సరిపోయే బ్యాటింగ్ ఆర్డర్ ఏంటో తిరిగి తెలుసుకున్నందుకు ఆనందంగా ఉందన్నాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండు సంవత్సరాలుగా, బ్యాటింగ్ ఆర్డర్‌లో నా స్థానం ఏంటి? నాకు ఏది సౌకర్యంగా ఉందో.. నేను మర్చిపోయాను అని, నాకు విభిన్న బాధ్యతలు, పాత్రలు ఇవ్వడం సంతోషంగా ఉంది. ఇది నాలో చాలా ఉత్తేజం నింపింది అని అన్నారు. అంతేకాకుండా ప్రతి స్టెప్ లోనూ నాకు నేను సవాలు విసురుకోవడానికి సాయపడింది. నన్ను మరింత రాటుదేలేలా చేసింది. నేను ఈ ప్రయాణాన్ని ఆస్వాదించానుఅని నాలుగో రోజు ఆట ముగిసిన అనంతరం కేఎల్ రాహుల్ అన్నాడు. అలాగే ఫస్ట్ టెస్ట్ మ్యాచ్ చివరిరోజు కచ్చితంగా ఫలితం తేలుతుందని అతడు ఆశాభావం వ్యక్తంచేశాడు. భారత బౌలర్లు ఇంగ్లాండ్‌ను ఆలౌట్ చేసి, సిరీస్‌లో 10 ఆధిక్యం సాధిస్తారని విశ్వాసం వ్యక్తంచేశాడు. మొదటి టెస్ట్ మ్యాచ్‌కు బ్లాక్ బస్టర్ ముగింపు రానుంది. కచ్చితంగా ఫలితం తేలుతుంది. ఇంగ్లాండ్ వాళ్లూ ఈ విషయాన్ని చెప్పారు. మా బౌలర్లు 10 వికెట్లు తీసుకొని టీమిండియా విజయాన్ని అందిస్తారుఅని కేఎల్ రాహుల్ చెప్పుకొచ్చారు.భారత జట్టు రెండో ఇన్నింగ్స్‌లో కేఎల్ రాహుల్ 137 పరుగులు చేశాడు. అలాగే నాలుగో రోజు చివర్లో 6 ఓవర్లు బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ 21 పరుగులు చేసింది.




# పాకిస్థాన్‌కు షాక్ తగలనుందా?

క్రికెట్ వరల్డ్ లో ఆసియా కప్ అనేది అత్యంత ప్రతిష్టాత్మక టోర్నమెంట్. ఆసియాలోని టాప్ టీమ్స్ ఈ టోర్నమెంట్‌లో తమ సత్తా చాటడానికి పోటీ పడుతుంటాయి. అయితే, రాబోయే ఆసియా కప్ 2025 గురించి రీసెంట్ గా కొన్ని ఊహాగానాలు చక్కర్లు కొడుతున్నాయి. ముఖ్యంగా పాకిస్థాన్ ఈ టోర్నమెంట్ నుంచి ఔట్ అయ్యే అవకాశం ఉందని, టోర్నమెంట్ ప్రోమోలో కేవలం మూడు దేశాల కెప్టెన్లు మాత్రమే ఉండటం ఈ ఊహాగానాలకు మరింత బలం చేకూర్చింది. మరి దీనికి కారణాలు చూసుకున్నట్లయితే..భారత్, పాకిస్థాన్.. ఈరెండు దేశాల మధ్య నెలకొన్నఉద్రిక్తతలు క్రికెట్‌పై కూడా ప్రభావం చూపుతున్నాయి. భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు పాకిస్థాన్‌లో ఆడటానికి నిరాకరించడం, పాకిస్థాన్‌ను ఆసియా క్రికెట్ కౌన్సిల్నుండి సపరేట్ చేయాలని చూస్తుండటం ప్రధాన కారణాలు.అంతేకాకుండాACC చైర్మన్‌గా పాకిస్థాన్ క్రికెట్ బోర్డు చైర్మన్, పాకిస్థాన్ ప్రభుత్వంలో అంతర్గత వ్యవహారాల మంత్రిగా ఉన్న మోసిన్ నఖ్వీ ఉండటం కూడా బీసీసీఐఆసియా కప్‌కు దూరంగా ఉండటానికి ఒక కారణం. నఖ్వీ నేతృత్వంలో జరిగే టోర్నీల్లో భారత్ పాల్గొనబోదని బీసీసీఐ తెలిపిందని అర్థం అవుతుంది. దీంతోపాటు ఒకవేళ భారత్ ఆసియా కప్ నుంచి తప్పుకుంటే, స్పాన్సర్‌లు, ప్రసార హక్కుల ద్వారా వచ్చే ఆదాయం భారీగా తగ్గుతుంది. ఇది పాకిస్థాన్ క్రికెట్ బోర్డుకు ఆర్థికంగా తీవ్ర నష్టాన్ని కలిగిస్తుంది.ఇక జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడి వంటి సంఘటనల నేపథ్యంలో భారత్, పాకిస్థాన్ మధ్య భద్రతా ఆందోళనలు కూడా ఆసియా కప్ నిర్వహణకు అడ్డంకిగా మారాయి.సాధారణంగా, ఆసియాలోని ప్రధాన క్రికెట్ ఆడే దేశాలైన భారత్, పాకిస్థాన్, శ్రీలంక, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్థాన్ కెప్టెన్లు ప్రోమోలో కనిపిస్తుంటారు. అయితే, ఈసారి ప్రోమోలో కేవలం భారత్, శ్రీలంక, బంగ్లాదేశ్ కెప్టెన్లు మాత్రమే ఉన్నట్లు తెలుస్తుంది.ప్రస్తుతానికి పాకిస్థాన్ ఆసియా కప్ నుంచి అధికారికంగా ఔట్ అయినట్లుగా ఎటువంటి ప్రకటన లేదు. మరి ఆసియా క్రికెట్ కౌన్సిల్, సంబంధిత బోర్డుల నుంచి అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి చూడాలి.

# కంటెంట్ మీదే నమ్మకం పెట్టుకున్న కన్నప్ప




టాలీవుడ్సినీ ఇండస్ట్రీ నుండి మేకర్స్ ప్రజంట్ చేస్తున్న మోస్ట్ అవైటెడ్ బిగ్గెస్ట్ ప్రాజెక్ట్స్ లో కన్నప్ప కూడా ఒకటి. ఈ సినిమా భారీ మల్టీ స్టారర్ ప్రాజెక్ట్ గా పాన్ ఇండియా లెవెల్ లో తెరకెక్కుతుంది. మంచు విష్ణు హీరోగా యాక్ట్ చేస్తున్న ఈ సినిమా విషయంలో ఓ న్యూస్ తెగ వైరల్ అవుతుంది. ఈ సినిమాకు బిజినెస్ పరంగా కొన్ని విషయాలు కన్ఫార్మ్ అవుతున్నాయి. అవేంటంటే.. ఈ సినిమా ఓన్ రిలీజ్ లోనే వస్తుంది దాంతోపాటు ఓటీటీ డీల్ వైజ్ గా కూడా కన్ఫార్మ్ కాలేదని అర్థమవుతుంది. అయితే వీటిని కొంతమంది మాత్రం వేరే విధంగా ప్రొజెక్ట్ చేస్తున్నారు. బట్ ఈ మూవీ విషయంలో మేకర్స్ అనుకున్నట్లుగా రేట్ రాలేదని, అందుకే ఈ సినిమాను ఓన్ రిలీజ్ అండ్ ఓటీటీ డీల్ వైజ్ గా కూడా సెట్ చేయలేదని మేకర్స్ క్లియర్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే విష్ణు కూడా ఓటిటి డీల్ కి ఒక రేట్ తాను చెప్తే ఓటిటి వారు ఇంకో రేట్ చెప్పారు.సినిమా రిలీజ్ అయ్యి హిట్ అయితే తాను చెప్పిన మొత్తం ఇస్తామని చెప్పారని నేను ఆ మొత్తం రెడీ చేసుకోండి అని చెప్పానని తెలిపాడు. మరి ఇదే థియేట్రికల్ గా కూడా అని చెప్పొచ్చు. వీటితో తాము కంటెంట్ పరంగా ఎంత నమ్మకంగా ఉన్నారు అనేది అర్థం చేసుకోవచ్చు. ఆల్రెడీ ట్రైలర్ కి మంచి టాక్ వచ్చింది. సో థియేటర్స్ లో రిలీజ్ అయ్యాక అన్నీ వర్కౌట్ అయితే కన్నప్ప సాలిడ్ వసూళ్లు అందుకోవడం గ్యారెంటీ అని చెప్పవచ్చు. మరి ఈ సినిమా ఎలాంటి సక్సెస్ ను అందుకుంటుందో చూడాలి.



# మహేష్ బాబు కోసం రాజమౌళి నెక్ట్స్ లెవెల్ ప్లాన్?



ఇండియన్ సినిమా హిస్టరీలోమోస్ట్ ఇంట్రెస్టింగ్ ప్రాజెక్ట్స్ లో ఒకటి రాజమౌళి, మహేష్ బాబుల కాంబో మూవీ. ఇప్పటికే ఈ సినిమాపై వరల్డ్ వైడ్ గా ఆడియన్స్ లో అంచనాలు క్రియేట్ అయ్యాయి. సినిమా కోసం ఏకంగా వెయ్యి కోట్లు ఖర్చు పెడుతున్నట్లు తెలుస్తుంది. ఎందుకంటే రాజమౌళి సినిమా కెరీర్ లోనే కాదు.. టోటల్ సినిమా హిస్టరీలోనే నెవ్వర్ బిఫోర్ అనే రేంజ్ లో బిగ్గెస్ట్ పాన్ వరల్డ్ అడ్వంచర్ ప్రాజెక్ట్ గా ప్లాన్ చేస్తున్నారు. రాజమౌళి సత్తా ఏంటో మరోసారి వరల్డ్ వైడ్ సినిమాకు తెలియజేయాలనుకుంటున్నట్లు తెలుస్తుంది. ఇక ఈ సినిమాకు సంబంధించిన లేటెస్ట్ అప్డేట్ కూడా సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గా మారింది. లేటెస్ట్ గా లీకైన సమాచారం ప్రకారం, మహేష్ బాబు, ప్రియాంకా చోప్రా ఇంట్రడక్షన్ సీన్ కోసం జక్కన్న నెక్స్ట్ షెడ్యూల్ ను కెన్యా అడవుల్లో ప్లాన్ చేసినట్టు తెలుస్తోంది. ఈ సీన్ కేవలం వారి ఇంట్రడక్షన్ లా మాత్రమే కాకుండా.. కథలో ఓ మేజర్ ట్విస్టుగా కూడా ఉంటుందట. అంతేకాదు,ఈ సీన్‌లో భారీ యాక్షన్ ఎలిమెంట్స్ ఉండబోతున్నాయట. కెన్యా లొకేషన్లు, ఫారెస్ట్ నేపథ్యం సినిమాకు స్పెషల్ విజువల్ ట్రీట్ ఇవ్వబోతున్నాయట. ఈ సీన్ కోసం భారీ వీఎఫ్ఎక్స్ టీమ్, ఇంటర్నేషనల్ టెక్నికల్ క్రూ పనిచేస్తుందని సమాచారం.అంటే ఆర్ఆర్ఆర్కంటే హై రేంజ్ లోనే విజువల్ ఎఫెక్ట్స్ ఉండనున్నట్లు తెలుస్తోంది.

ఇప్పటికే ప్రాజెక్ట్‌కు సంబంధించిన చిన్న చిన్న డిటైల్స్ బయటకు వచ్చినా.. పూర్తి కాన్సెప్ట్ ఇంకా సీక్రెట్ గానే ఉంది. కానీ రాజమౌళి గత సినిమాల ట్రాక్ రికార్డు చూస్తే ఈసారి ఇంకెంత భయంకరంగా డిజైన్ చేసి ఉంటారో ఊహించడమే కష్టం. ఇదే సమయంలో ప్రియాంకా చోప్రా కూడా రీసెంట్ గా అమెరికాలో జరిగిన టాక్ షోలో ఈ ప్రాజెక్ట్ గురించి చిన్న క్లారిటీ ఇచ్చారు. ఇండియాలో షూటింగ్‌ల కారణంగా తన కూతురు మాల్తీని చాలా రోజులుగా చూడలేకపోయానని చెప్పింది. మహేష్ బాబు నటనకు గ్లోబల్ ప్లాట్‌ఫామ్ మీద పరిచయం కల్పించేలా రాజమౌళి ఈ సినిమాను రూపొందిస్తున్నారని తెలుస్తోంది. మహేష్ బాబు ప్రపంచవ్యాప్తంగా ఒక అడ్వెంచర్ ట్రావెలర్ క్యారెక్టర్ లో కనిపించబోతున్నారు. ఈ పాత్ర కోసం ఆయన ఫిజికల్ గా బాగా ప్రిపేర్ అవుతున్నారని సమాచారం. అంతేకాదు, కథలోని కీలక పాత్రకు మలయాళ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ ను తీసుకున్నారు.మొత్తానికి ఈ ప్రాజెక్ట్ కి సంబంధించిన కెన్యా షెడ్యూల్ అప్‌డేట్‌తో సినిమాపై అంచనాలు మళ్లీ నెక్స్ట్ లెవెల్‌కి వెళ్తున్నాయి. మహేష్ రాజమౌళి కాంబో ఎంత స్థాయిలో వర్కౌట్ అవుతుందో, ఇండియన్ సినిమా కొత్త రికార్డులను ఎలా తిరగరాయబోతుందో చూడాలి.

# ఒకే ఫ్రేమ్ లో దీపికా, మృణాల్, జాన్వీ?

ఐకాన్ స్టార్, అట్లీకాంబినేషన్ లో స్టార్ హీరోయిన్స్ ఫైనల్ అయ్యారనే టాక్ గట్టిగా వినిపిస్తుంది. ఈ సినిమా కోసం ఏకంగా ముగ్గురు హీరోయిన్స్ ను ఫిక్స్ చేశారంటే అవును అంటూ లీక్స్ వస్తున్నాయి. బన్నీ సినీ కెరీర్ లో ఈ సినిమా 22 వ ప్రాజెక్ట్ గా రాబోతుంది. రెగ్యులర్ షూటింగ్ పై ఫిల్మ్ మేకర్స్ ఎలాంటి అప్డేట్ ఇవ్వలేదు. అయితే సినిమాలో హీరోయిన్లు ఎవరు సెలెక్ట్ అయ్యారనేది కూడా ఇంకా రివీల్ చేయలేదు. అఫిషియల్ గా మాత్రం ఇప్పటికే దీపికా పదుకొణే ఎంట్రీ ఫిక్స్ అయ్యింది. మరో ఇద్దరు హీరోయిన్లుఈ సినిమాలో ఉండే అవకాశం ఉందనిటాక్ వినిపిస్తుంది. అది కూడా జాన్వీ కపూర్, శ్రద్ధా కపూర్, మృణాల్ ఠాకూర్, అనన్య పాండే ఇలా కొంత మంది పేర్లు తెరపైకి వచ్చాయి. కానీ లేటెస్ట్ సమాచారం ఏంటంటే..మరో ఇద్దరు హీరోయిన్స్ ని కూడా మేకర్స్ ఖరారు చేసినట్లు తెలిసింది. మృణాల్ ఠాకూర్ ని సెకెండ్ లీడ్ కి, థర్డ్ లీడ్ లో జాన్వీ కపూర్ ని సెలెక్ట్ చేసినట్లు వినిపిస్తుంది.అట్లీ ఇద్దరిపై టెస్ట్ షూట్ చేసి సెలెక్ట్ చేశారట.

ఇదే నిజమైతే ఇక సినిమా అంతా అందంతో నిండిపోతుంది. దీపిక, మృణాల్, జాన్వీ కపూర్ ఒకే ఫ్రేమ్ లో కనిపిస్తే ఆ రచ్చ ఎలా ఉంటుందో ఊహకే అందదు. ఇంత వరకూ ఈ కాంబినేషన్ కలిసి నటించింది లేదు. ఇక వీళ్లిద్దరికంటే దీపిక సీనియర్. స్టార్ డమ్ పరంగా కూడా తిరుగు లేని హీరోయిన్. కానీ పెర్ఫార్మెన్స్ లో మాత్రం మృణాల్ కి పోటీ కాదు. నటిగా మృణాల్ కే ఎక్కువ మార్కులు పడతాయి.జాన్వీ కపూర్ తో పోలిక చేసినా? అదే పరిస్థితి. అందుకే మృణాల్ ని సెకెండ్ లీడ్ లో పెట్టినట్లు తెలుస్తోంది. కానీ క్రేజ్ పరంగా చూస్తే జాన్వీ కపూర్ కంటే ఓ మెట్టు కిందనే ఉంటుంది మృణాల్. మరి ఈ సినిమాలో ఈ ముగ్గుర్నీ అట్లీ ఎలా బ్యాలెన్స్ చేస్తాడు? అన్నది చూడాలి. హీరోయిన్లను అందంగా చూపించడంలో అట్లీ ఎక్స్ పర్ట్ కాదు. హీరోయిన్ల పాత్రలకు స్కోప్ పర్వాలేదు. మరి వీరినిఎలా హ్యాండిల్ చేస్తారనేది చూడాలి.





# అజిత్ న్యూ లుక్.. ఏ సినిమా కోసం?

కోలీవుడ్ స్టార్ యాక్టర్స్ లో అజిత్ కుమార్ లేటెస్ట్ గా డిఫరెంట్ లుక్ లో కనిపించి మెస్మరైజ్ చేస్తున్నారు. తన ఫ్యాన్స్ కు మాత్రం ఈ లుక్ షాక్ అనే చెప్పాలి. నార్మల్ గా ఎక్కువ గా స్టైలిష్ లుక్స్ లో కనిపించి ఎంటర్ టైన్ చేస్తారు. బట్ ఈసారి మాత్రం గుండులో కనిపిస్తూ అస్సలు గుర్తు పట్టలేని లుక్ లో తన ఫోటోస్ ను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. బేబీ కటింగ్స్టైల్‌గా పిలిచే ఈ గుండు లుక్ ఇప్పుడు నెట్టింట్లో తెగ వైరల్ అవుతుంది.ప్రస్తుతం అజిత్ తన రెండో ప్యాషన్ అయిన రేసింగ్‌ను కంప్లీట్ గా కంటిన్యూ చేస్తున్నారు. బెల్జియంలోని ప్రసిద్ధ స్పా ఫ్రాంకో చాంప్స్ రేసింగ్ సర్క్యూట్‌లో రేసింగ్ సిరీస్ కోసం ప్రాక్టీస్ చేస్తున్న టైమ్ లో అజిత్ ఈ లుక్‌లో కనిపించాడు. అజిత్ ఈ ఏడాది ఇప్పటికే రెండు సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. అయినప్పటికీ, మధ్యలోనే ఓ ప్రత్యేకమైన బ్రేక్ తీసుకొని విదేశాల్లో రేసింగ్‌లో పాల్గొనడం ఆయన ప్యాషన్‌కు నిదర్శనం.

రీసెంట్ గా గుడ్ బ్యాడ్ అగ్లీ సినిమాతో మంచి విజయాన్ని అందుకున్న అజిత్ మళ్లీ అదే దర్శకుడు అధిక్ రవిచంద్రన్‌తో ఓ కొత్త ప్రాజెక్ట్ ప్లాన్ చేస్తున్నట్టు తెలుస్తోంది. ఇప్పటివరకు ఈ కొత్త సినిమాపై ఎలాంటి అధికారిక ప్రకటన రాకపోయినా.. అజిత్ గెటప్ చూస్తుంటే ఇది ఆ ప్రాజెక్ట్ కోసమేనన్న ప్రచారం జోరుగా సాగుతోంది. ఈసారి ఓ సైనిక నేపథ్యమా? లేక స్ట్రిక్ట్ పోలీస్ గెటప్‌లా ఏదైనా రఫ్ అండ్ టఫ్ క్యారెక్టర్ కోసం ఇలా ట్రై చేస్తున్నారా? అనే క్యూరియాసిటీ ఫ్యాన్స్‌లో కలుగుతుంది.ఈ గుండు లుక్‌తో పాటు అజిత్ ధరించిన డార్క్ షేడ్స్ గ్లాసెస్, నేవీ బ్లూ జాకెట్‌లో కనిపించిన విధానం కూడా ఫ్యాషన్ లవర్స్‌ని ఆకట్టుకుంది. సాధారణంగా సెలబ్రిటీస్ ఇలాంటివి షూటింగ్ సమయంలో మాత్రమే చేస్తారు. కానీ అజిత్ మాత్రం నిజ జీవితంలోనూ తన లుక్‌పై ఈ స్థాయిలో ప్రయోగాలు చేయడం విశేషం. ఇప్పటికే ఈ లుక్‌తో ఉన్న ఫొటోలు వైరల్ అవుతున్నాయి. ఫ్యాన్స్ మాత్రం తలా మళ్లీ ఏదో కొత్తగా ట్రై చేస్తున్నాడు, ఇది మామూలు సినిమాకాదులే.. అంటూ కామెంట్లు పెడుతున్నారు. ప్రస్తుతం అజిత్ రేసింగ్ పూర్తిచేసిన వెంటనే ఈ ప్రాజెక్ట్ షురూ అయ్యే అవకాశముంది. మరి ఈ గెటప్ వెనుక అసలు కథేంటి అనేది అధికారిక ప్రకటన రాగానే తెలుస్తుంది.






## సర్ప్రైజింగ్ పోస్టర్ తో ది ఫ్యామిలీ మ్యాన్

ఇండియన్ ఓటిటి కంటెంట్ దగ్గర సెన్సేషనల్ హిట్ అయ్యిన పలు క్రేజీ వెబ్ సిరీస్ లు చాలానే ఉన్నాయి.ముఖ్యంగా ప్రముఖ స్ట్రీమింగ్ యాప్అమెజాన్ప్రైమ్‌వీడియోలో స్ట్రీమింగ్ కి వచ్చిన సాలిడ్ థ్రిల్లర్ సిరీస్ ది ఫ్యామిలీమ్యాన్‌కూడాఒకటి.రెండుసీజన్స్ ని సక్సెస్ ఫుల్ గా మనోజ్ బాజ్ పాయితో ప్లాన్ చేస్తున్న దర్శకుడు రాజ్ అండ్ డీకేల నుంచి ఇపుడు సీజన్ 3 ట్రీట్ ఇచ్చేందుకు రెడీ అవుతుంది.ఈ సిరీస్ కి సెపరేట్ ఫ్యాన్స్ ఉండగా మొత్తానికి సీజన్ 3 కోసం ఎదురు చూస్తున్న వారికి అమెజాన్ ప్రైమ్ వీడియో వారు ఒక సర్ప్రైజింగ్ అప్డేట్ ని ఇచ్చేసారు. దీనితోత్వరలోనే ది ఫ్యామిలీ మ్యాన్ 3 ట్రీట్ ఇచ్చేందుకు వస్తుంది అంటూ మనోజ్ పై ఒక ఇంట్రెస్టింగ్ పోస్టర్ తో ఈ అప్డేట్ ని ఇచ్చేసారు. అయితే దీనికి ది ఫ్యామిలీ మ్యాన్ రిటర్న్స్ అంటూ కొత్త టైటిల్ ని లాక్ చేయడం విశేషం. ఇక డేట్ ఎప్పుడు వస్తుంది అనేది తర్వాతి ప్రశ్నగా మారింది. ఇప్పుడు ఫ్యాన్స్ దీనికోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

# తమ్ముడు.. నితిన్ కెరీర్ లోనే రిస్కీ బడ్జెట్?

నితిన్ రీసెంట్ టైమ్ లో కంటిన్యూగా బ్యాక్ టు బ్యాక్ ఫ్లాపులతో సతమతమయ్యారు. మాచర్ల నియోజకవర్గం, ఎక్స్ ట్రా ఆర్డినరీ మ్యాన్ సినిమాలు అతని బాక్సాఫీస్ మార్కెట్‌ను గట్టిగానే దెబ్బ కొట్టాయి. ముఖ్యంగా రాబిన్ హుడ్సినిమాను మైత్రీ మూవీ మేకర్స్ భారీగా నిర్మించగా అది కూడా డిజప్పాయింట్ చేసింది. ఈ నేపథ్యంలో నితిన్ ఇప్పుడొక మాస్ యాక్షన్ డ్రామాతో ప్రేక్షకుల ముందుకు రావడానికి రెడీ అవుతున్నారు. ఆ సినిమానే తమ్ముడు.ఈ సినిమాకి వకీల్ సాబ్ ఫేమ్ శ్రీరామ్ వేణు దర్శకత్వం వహిస్తున్నారు. అయితే ఈ సినిమా బడ్జెట్ విషయంలో టాలీవుడ్ టాప్ ప్రొడ్యూసర్ దిల్ రాజు ఓపెన్ అయ్యారు. ప్రమోషన్ కార్యక్రమాల్లో మాట్లాడుతూ దిల్ రాజు.. ఈ సినిమాకి 75 కోట్ల ఖర్చు అయ్యింది. కథ మూడేళ్ల క్రితమే ఫిక్స్ చేశాం. కానీ షూటింగ్ విభిన్న కారణాలతో ఆలస్యం అయిందిఅని తెలిపారు. ముఖ్యంగా ఈ సినిమా కోసం 150 రోజులకు పైగా వర్కింగ్ డేస్ పైనే ఖర్చు చేశారని చెప్పడం హైలెట్.నితిన్ గత ట్రాక్‌తో పోలిస్తే ఈ బడ్జెట్ నిజంగా భారీ రిస్క్ అనిపిస్తుంది. సాధారణంగా నితిన్ సినిమాలు 25 నుంచి 30 కోట్ల మధ్యలోనే ప్లాన్ చేస్తారు.

ఇక అతని కెరీర్ బెస్ట్ హిట్స్ లో అ ఆ సినిమా 70 కోట్ల గ్రాస్ వసూళ్లు రాబట్టగా, భీష్మ 50 కోట్ల వరకు వసూలు చేసింది. అయితే రాబిన్ హుడ్సినిమాకు పెట్టిన 60 కోట్ల బడ్జెట్ దారుణంగా మైనస్ అయింది. ఇప్పుడు దిల్ రాజు వేసిన 75 కోట్ల రిస్క్ నిజంగా నితిన్ కెరీర్ లోనే అతిపెద్ద బడ్జెట్ రిస్క్ అని చెప్పవచ్చు.అయితే ట్రైలర్‌కి కొంత పాజిటివ్ రెస్పాన్స్ రావడంతో సినిమాపై పాజిటివ్ బజ్ క్రియేట్ అయ్యింది. దిల్ రాజు మాటల ప్రకారం ఈ సినిమా సెంటిమెంట్స్, ఎమోషన్స్ యాక్షన్ మిక్స్‌తో ప్రేక్షకుల మనసు గెలుస్తుందట. ఆయన ఈ సినిమాపై ఎంతో నమ్మకంగా ఉన్నట్టు చెబుతున్నారు. ఇప్పటి వరకూ డిజిటల్ హక్కులు నెట్‌ఫ్లిక్స్‌కు డీసెంట్ ధరకు అమ్ముడుపోయాయి.ఇతర నాన్ థియేట్రికల్ హక్కులు కూడా క్లోజ్ అయ్యాయని సమాచారం. జులై 4న తమ్ముడుథియేటర్లలో విడుదల కానుంది. ఇది నితిన్ కెరీర్‌ను మళ్లీ ట్రాక్‌లోకి తీసుకురావలసిన సినిమా. దిల్ రాజు గ్యాంబ్లింగ్ వర్కౌట్ అవుతుందా లేదా అన్నదే ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. ఎంతైనా, ఈ సినిమా రిజల్ట్ మీదే నితిన్ కెరీర్ కూడా డిపెండ్ అయ్యిందని అనడంలో ఎలాంటి సందేహం లేదు. మరి ఈ సినిమా ఎలాంటి సక్సెస్ ను అందుకుంటుందో చూడాలి.

